జ్యోతి

డిశంబర్ '64

60 పైసలు



సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.
విడిప్రతి వెల : 60 పైసలు—
సంపుటి 2 డిసెంబరు 1964 సంచిక 12

ఇదీ వరస....

ముఖచిత్రం : "సుమంగళి" లో నాగేశ్వరరావు, సావిత్రి.

[నవంబరు సంచిక ముఖచిత్రం "వాణిశ్రీ" అని గమనింప మనవి.]

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ, బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

పాఠకులకు మనవి

"జ్యోతి" దీపావళి సంచికను మేము అనుకున్నంత, మీరాశించినంత ఆకర్షణీయంగా రూపొందించలేక పోయినందుకు విచారిస్తున్నాము. అనేక అనివార్య కారణాల ఒత్తిడి వల్ల అది సాధ్యపడలేదు.

1965 జనవరి సంచిక (వచ్చేది) నుంచి "జ్యోతి" వెల 60 పైసల నుంచి 75 పైసలకు పెరుగుతున్నది. వెలతోపాటు ఆకర్షణలను కూడా పెంచడానికి యథాశక్తిగా ప్రయత్నిస్తాము.

డిసెంబరు సంచిక వరకు ఏడు రూపాయలుగావున్న ఏడాది చందా జనవరి '65 నుంచి తొమ్మిది రూపాయలవుతుంది. ఇప్పటి చందాదారులకు జనవరి నుంచి సంచికలసరఫరా కొత్త రేటు ప్రకారం సవరించ బడుతుంది.

"జ్యోతి" పూర్తిగా పాఠకుల ఆదరాభిమానాల ఆధారంతో వెలువడుతున్న పత్రిక. అవి గడచిన రెండేళ్ళలో కంటె ఇబ్బడి ముబ్బడిగా మాకు లభించగలవని ఆశిస్తున్నాము.

వేమూరి రాధాకృష్ణ

మేనేజింగ్ ఎడిటర్, "జ్యోతి"

రాజకీయ వాతావరణం

ఆహార సమస్య: ఎ. ఐ. సి. సి. సభలు

"గివజ్ ఫుడ్ ఆర్ షూటజ్" — "తిండి పెట్టండి, లేకపోతే కాల్చిచంపెయ్యండి" కేరళరాష్ట్రంలో నవంబరు తొమ్మిదవ తేదీన వేలాది ప్రజలు "బజారున పడి" చేసిన భయంకర సినాదం ఇది.

ఆహారం కోసం జరిగిన ఆ అలజడి దేశాన్ని యావత్తూ "గజ గజ" లాడించింది. ఉత్తర క్షణాల మీద "బియ్యం" ఆరాష్ట్రానికి తరలి వెళ్ళింది. ఈలోపల "లాఠీ చార్జీలు, అరెస్టులు, అలజడిని అదుపు చెయ్యటానికి శత కోటి వుపాయాలు—

అసలు విషయం యేమిటంటే, సరిగ్గా అంతకు క్రితం రోజు సాయంత్రం గుంటూరులో జరిగిన ఎ. ఐ. సి. సి. సమావేశాలలో "ఆహార సమస్యను యెంతో సహనంతో అర్థం చేసుకుని ప్రభుత్వంతో సహకరిస్తున్న ప్రజలను" అభినందిస్తూ, ఒక తీర్మానం యేకగ్రీవంగా ఆమోదించబడింది.

సరిగ్గా అదే సమయంలో విజయవాడలో సైతం బియ్యం కోసం "క్యూలు"—మదరాసు, హైదరాబాదు, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ నగరాల స్థితి సరే సరి.

ఆహార సమస్యనుగురించి ఇదమిత్థమైన నిర్ణయం యేదీ గుంటూరు ఎ. ఐ. సి. సి. సమావేశాలలో జరగలేదు. నిర్ణయం చేసే బాధ్యత యావత్తూ కేంద్ర ఆహార మంత్రి "రాష్ట్ర ముఖ్య మంత్రుల సమావేశానికి" వదిలివేశారు.

"తిండి పెట్టండి, లేకపోతే కాల్చి చంపెయ్యండి" ఒక వైపు ఈ భయంకరనినాదం దేశాన్ని కంపింపజేస్తుంటే, మరొకవైపు "పాము చావకూడదు, కట్టవిరగ కూడదు" అనే ధోరణిలో ఆహార సమస్యకు పరిష్కార మార్గం వెతకటం యేమనాలి? ... ...

చట్టబద్ధమైన రేషనింగ్‌ను దేశం అన్ని ప్రాంతాలలోనూ ప్రవేశ పెట్టాలనేది ఒక సూచన. తరుగురాష్ట్రాలవారు ముఖ్యంగాకోరే కోర్కె యిది. కేంద్ర ఆహారమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం, ప్రధాని శ్రీ లాల్ బహదూర్‌కూడా యీ సూచనను ఆదిలోనే చేశారు.

కాని, మిగులురాష్ట్రాలు దీనికి సమ్మతించలేదు. బియ్యంవర్తకులు ముఖ్యంగా దీనిని వ్యతిరేకించటంతో ఈసూచనకు ఆదిలోనే హంసపాదుపడింది.

"ప్రొక్యూర్మెంట్" చేసి తగిన విధంగా బియ్యం సరఫరా చెయ్యగలం అనే నమ్మకం కేంద్రప్రభుత్వానికి వుండాలంటే మిగులు రాష్ట్రాల సహకారం అందుకు పూర్తిగా లభించాలి. అది లేనప్పుడు ఎన్ని చట్టాలు ప్రవేశపెట్టి ఎన్ని నగరాలలో రేషనింగ్ అమలుజరిపితేమాత్రం యేం ప్రయోజనం? అందుకే ఆహారసమస్య పరిష్కారకృషిని గుంటూరు సమావేశాలలో "రాష్ట్ర ముఖ్యమంత్రుల సమావేశానికి" వదలివేశారు.

అంటే దీని అర్థం గుంటూరు ఎ. ఐ. సి. సి. కి రాష్ట్ర ముఖ్యమం



గుంటూరు ఎ. ఐ. సి. సి. సభావేదికపై
శ్రీ కామరాజ్, శ్రీ లాల్ బహదూర్.

త్రులు రాలేదనికాదు. రాష్ట్ర ముఖ్య మంత్రులు ఎ. ఐ. సి. సి. నిర్ణయా లకు భిన్నంగా వ్యవహరిస్తారని అంత కన్నా కాదు. రాష్ట్ర ముఖ్యమంత్రు లందరు "కాంగ్రెస్ క్రమశిక్షణకు", ఎ. ఐ. సి. సి. ఆదేశాలకు తలవొగ్గే "కార్యకర్తలే"!

అందుకే బహుశః యీ ముఖ్య మంత్రు లందరికీ రుచించని విధా నాన్ని "ఆ ఎ. ఐ. సి. సి." ద్వారా చెప్పించకుండా గుట్టుచప్పుడు కా కుండా విషయాన్ని దాటవేశారు.

ప్రధాని శ్రీ లాల్‌బహాదూర్, శ్రీ సుబ్రహ్మణ్యం నిమిత్తమాత్రులుగా "బరువుభారం భరించే బాధ్యతను" భవిష్యత్తుకు వదలివేశారు.


ఏది యేమైనప్పటికి ఆహారసమస్య విషయంలోమాత్రం శ్రీ లాల్‌బహ దూర్‌మంత్రివర్గం "ప్రచండమైన ఒక సవాలును" ఎదుర్కొంటోంది. ఈ సమస్య పరిష్కారంలో యేమాత్రం బేసబబు జరిగినా దేశ భవిష్యత్తుకే ఒక గొడ్డలిపెట్టు సంప్రాప్తమౌతుంది.

ఈ రోజున దేశంలోవున్న ఆహా రం అందరికీ పూర్తిగా సరిపోదు. పంటలు రావాలి. విదేశాలనుండి ఆహారధాన్యాలు దిగుమతి కావాలి. అంతా సవ్యంగా వెంటనే జరిగితేనే దేశ ప్రజల కనీస ఆహారావసరాలు ఇబ్బంది లేకుండా సరుబాటువుతాయి.

ఇలా జరగాలంటే ప్రధానంగా కావలసినది రాష్ట్రాల పూర్తి సహ కారం. ఆహారం అటు కేంద్రానికి ఇటు రాష్ట్రాలకు కూడా సంబంధించిన బాధ్యత. ఇరువురికి సయోధ్య యేర్పడిన నాడే పరిష్కారం సాధ్య మవుతుంది.

రేషనింగ్ పెట్టాలంటే బియ్యం సరఫరాకు హామీ లభించాలి. ఈ హామీ లభ్యం కావటానికి పోలీసు సహాయంతోనైనా సరే రాష్ట్రాలలో వున్న బియ్యం నిలవలను బహిర్గతం చెయ్యాలి.

బియ్యం నిలవలను బహిర్గతంచేసి పంపిణీని సక్రమంగా జరిపించ



గుంటూరు సభల్లో వక్తల ప్రసంగాలను శ్రద్ధగా ఆలకిస్తున్న ఎ. ఐ. సి. సి. ప్రతినిధుల ఖాళీసీట్లు

టానికి, ఇందుకు భిన్నంగా జరిగిన సందర్భాలలో అందుకు బాధ్యులపైన గట్టి చర్యలు తీసుకోటానికి, నవంబరు అయిదునుంచీ అమలులోకి వచ్చేటట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. దానిని అమలు జరి పేందుకు అవసరమైన చర్యలు, ముఖ్యంగా మెజిస్ట్రేట్లను నియమించే బాధ్యత రాష్ట్రాలది. ఇది వ్రాస్తున్న 20వ తేదీవరకు, అసలైన మిగులు రాష్ట్రాలలో మెజిస్ట్రేట్ల నియామకం జరగలేదు.

రాష్ట్రాలను తగువిధాల నప్పించి ఆహారసమస్యను పరిష్కరించటంలో శ్రీ శాస్త్రి ప్రభుత్వం ఒక నిర్దుష్టమైన విధానాన్ని యేర్పరచుకోలేక పోయిందనే చెప్పాలి.

ధరలను అదుపుచెయ్యటం, ఆహా రం అందరికీ సరసధరలకు లభ్యం కావటం—ఇవి రెండూ జరగనినాడు ప్రజలలో భరింపరాని వేదన బద్ద లవుతుంది ... ...

విజయవాడ, గుంటూరు, నెల్లూరు, విజయనగరం ... ... ఇలా కోస్తాజిల్లా లలోనే "బియ్యానికి క్యూలు" ఐతే కేరళరాష్ట్రంలో ప్రజలగతి యెంత దుర్భరంగావున్నదో తేలికగా ఊహిం చుకోవచ్చు.

ఇది కార్తీకమాసం. పంటలు ఇంకా రాలేదు. బియ్యం పండించే గ్రామాలలోకూడా బియ్యానికి బీద లు కటకట లాడిపోతున్నారు. నవం బరు 14 వ తేదీన కృష్ణాజిల్లాలో ఒక పల్లెటూళ్ళో వీశ వంకాయల ధర రూపాయి. పెసరపప్పు కిలో రూపా యన్నర. మినప్పప్పు కిలో రూపా యన్నర ... ...

అయినా ప్రజలు చాలా ఓర్పుతో సహనంగా ఆహారసమస్యను అర్థం చేసుకుంటున్నారు. ఇందుకు గుం టూరు ఎ. ఐ. సి. సి. వీళ్ళ నందరినీ ఏకగ్రీవంగా అభినందించింది.

విజయవాడలోను, తాడేపల్లిగూ డెంలోను, భీమవరంలోను, హైదరా బాదులోను గిడ్డంగులలో బియ్యం లేవనికాదు. ఉన్నాయి. ఆహారమం త్రులకు అది తెలుసు. అందుకే ఆహా రసమస్య పరిష్కారం అవుతుందని వారి నమ్మకం.

అందుకే ఈ రేషనింగ్, కార్డులు, ఉద్యోగులఅధికారాలు వద్దని బియ్యం వ్యాపారస్తులు అంటుంటే వారూ సరే అంటున్నారు.

కోస్తాజిల్లాలనుంచి హైదరాబా దులో వినియోగంకోసం పంపబడే బియ్యం హైదరాబాదులో పూర్తిగా కనిపించదు. అందులో చాలాభాగం ఎల్లలనుదాటి ఎక్కడికో పోతుంది.

కేరళలో మొన్న జరిగిన అలజడి సందర్భంలో ఒక పెద్ద గిడ్డంగిలో అంతస్తులుగా పేర్చబడిన నూనెడబ్బా లలో బయటపడింది నూనెకాదు; బియ్యం.

ఆటంబాంబు కథ

పొరుగునున్న చైనా ఆటంబాంబు పేల్చింది. ఆ చుట్టు పక్కలున్న చిన్న దేశాలన్నీ ఎత్తుగా "పెరిగి పోతున్న చైనా కీర్తి"ని "హాశ్చర్యం"తో చూ స్తున్నాయి. వాటన్నింటికీ ఇండియా బోధించే అలీన విధానం అంటే వేళాకోళంగా వుంది.

మనమూ ఆటంబాంబు పేల్చాలి. మనమూ ఆయుధాలు కొనుక్కో వాలి. కనీసం అప్పైనా తెచ్చు కోవాలి. కాయ కల్ప చికిత్స చేసు కుంటేనేగానీ చుట్టుపక్కల దేశాలు మన వంక చూడవు.

అన్ని బాంబుల్లోకి ఆటంబాంబు అతి చౌకట. దాన్ని చేసుకుంటే చాలుగా. ...

గుంటూరు ఎ. ఐ. సి. సి. లో "ఛోటా మోటా" నాయకులు ఛోలెడు మంది యెనిమిదవ తేదీ పొద్దు పోయేదాకా ఈపైన చెప్పిన విషయాల నన్నింటినీ "గట్టిగా నొక్కి వక్కాణించారు." కొందరు "పున రుద్ఘాటన చేశారు.

ఇంతలోకే తెల్లవారి పొద్దెక్కి మళ్ళీ ఎ. ఐ. సి. సి సమావేశ మయింది.

మర్నాడు ప్రొద్దున్న ముందుగా ఢేబర్, తరవాత కృష్ణమీనన్, స్వరణ్ సింగ్, లాల్ బహదూర్— అంతా ఆటంబాంబ్ కావాలన్న వాళ్ళను చివాట్లు వేశారు. ఆటం బాంబు జోలికిపోతే "చేతులు కాల తాయి" అన్నారు. చేతులు కాల్చుకో వద్దన్నారు. వెనకగావున్న గాంధీ-నెహ్రూల బొమ్మలుచూపించి వాళ్ళ ఆత్మలకు ద్రోహం చెయ్యొద్దన్నారు.

అప్పు డనిపించింది అందరికీ—

ఔను. నిజంగానే ఆటంబాంబులు తయారుచేసుకోవాలంటే మనకు స్తోమతు యేది ! స్తోమతుకోసం విదే శాలకు వెళ్ళి అప్పులుచేస్తే, ఇప్పటికి చేసిన అప్పులమాటేమిటి ... ఆటం బాంబు జోలకి వెడితే నిజంగానే చేతులు కాలతాయి, వళ్ళంతాకూడా కాలుతుంది అనిపించింది అందరికీ.

అందుకే "అటునుంచి నరుక్కో రమ్మన్నాడు. "అలీనవిధానం జిందా బాద్." అణ్వస్త్రాలకు వ్యతిరేకంగా ప్రపంచంలో భారత దేశం ముమ్మ రంగా ప్రజాభిప్రాయాన్ని లేవకొట్టా లని ప్రధాని శ్రీ లాల్ బహదూర్







చేసిన సూచనను అందరూ శిరసా వహించటం మంచిదనుకున్నారు.

అంతర్జాతీయ సమస్యలనుగురించి గుంటూరు ఎ. ఐ. సి. సి. చేసిన తీర్మానంలో అంతా ఆటంబాంబుకథే వుంది.

రష్యాలో జరిగిన మార్పులు,అమెరికాలోను, బ్రిటన్‌లోను జరిగిన ఎన్నికలనుగురించి యెటువంటి ప్రస్తావన జరగలేదు.

ఈ మధ్య మన విదేశాంగవిధానం చాలా క్లుప్తంగా పరిమితంగా అయిపోతోంది. కాంగ్రెస్ విధానాన్నే నిర్ణయించే ఎ. ఐ. సి. సి. కొన్ని పెద్ద పెద్ద సమస్యలనుగురించి యెటువంటి ప్రస్తావన చెయ్యకపోవటానికి ప్రధానంగా రెండే కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి విదేశాంగ వ్యవహారాలపై కూలంకషంగా ఒక విధానాన్ని ప్రకటించగల 'సెక్రటేరియట్' శ్రీ శాస్త్రివెంబడి గుంటూరు రాకపోవటంగాని; రెండు—అలా వచ్చినా 'కాంగ్రెస్ పెద్దలు' కొందరు ఈరొష్టుఅంతాయిక్కడ యెందుకులే, యెట్లాగైనా ప్రభుత్వం ఆ విషయాలు చూస్తూనే వుందిగదా అని తీర్మానంలోనుంచి ఆ విషయాలను తీసివేయ్యటంగాని అయివుండాలి.

గుంటూరులో జరిగిన ఎ. ఐ. సి. సి. అపూర్వంగా కడు వైభవంగా జరిగింది. లక్షలాది ప్రజలు తిరణాలకు వచ్చినట్లు వచ్చారు. మూడు రోజుల సమావేశాలకు కనీసం డెభ్భై లక్షల రూపాయలైనా ఖర్చు అయివుంటుందని చిన్న అంచనా!



నవంబరు 25వ తేదీన తమ 71వ యేట పరమపదించిన మహాగాయకులు ద్వారం వెంకటస్వామి నాయుడుగారు.


జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో ముఖ్య సమస్యలపై ప్రజలకు ఆశను, ఉత్తేజాన్ని కలిగించ వలసిన నిర్ణయాలు చెయ్యడానికి ఉద్దేశించిన ఎ. ఐ. సి. సి. సభలను కేవలం ఒక వినోద ప్రదర్శనంగా తయారు చేసిన వారిని చూసి జాలిపడాలో, కోప్పడాలో తెలియడంలేదు.

● ● ●


విజయవాడలో ఇటీవల జరిగిన ఉదంతంపైవ్యాఖ్యానిస్తూఒకమిత్రుడు "రక్షకభటు లనగా విగ్రహములను రక్షించువారు" అని నిర్వచనం చెప్పాడు.

—అనంతం

ఒక విద్యార్థి సమస్య



జీవులకు తానొకొక్కడై...







నారాయణరావుకు
రోజూ దేవాలయానికి
వెళ్ళే అలవాటు. ఏ ఊరు
వెళ్ళినా సాయంకాలం
అలా షికారు వెళ్ళి

దూరంగా ఏదేనా గోపురం కనిపిస్తే దగ్గరగా వెళ్ళి, దైవదర్శనం చేసుకుని,కాసేపు మంటపంలో కూచుని, ప్రశాంతతను అనుభవిస్తే నే గాని తృప్తి వుండదు; ఆ రాత్రి అతడికి సుఖంగా నిద్రపట్టదు.

అతడికి భగవద్భక్తిని గురించి విశేషంగా యేమీ తెలియదు. సనాతనాచార సంప్రదాయాల యెడ విశ్వాసం కూడా యేమీ లేదు. పురాణపురుషుల మహిమలు, భారత భాగవతాలలోని కథలూ, ఋషులను గురించిన కథలలోని అసంభావ్యములైన విషయాలూ, నారాయణరావు పట్టించుకోడు. ఆకథలలోని, ఆ మహా పురుషుల జీవితాలలోని సంఘటనలకు సంబంధించిన, అంతరార్థాలను గురించి అతడు ఆలోచించడు. సరి పెట్టుకోలేని కొన్ని విషయాలను గురించి, సమాధానపడేందుకు ప్రయత్నించడు. అయినా రోజూ దేవాలయానికి వెళతాడు. ఏదో తనను నిలువనీయని ఒక ఆర్తికి కొంత ఉపశమనాన్ని, ఆలయంలో పొందగలిగినట్లు అతడు భావించు కొనటంవలన, రోజూ వెళతాడని చెప్పుకోవచ్చును. ఏదో ఒక జిజ్ఞాస, ఒక ఆరాటం, నారాయణరావు మనశ్శాంతిని యెప్పుడూ కొల్లగొడుతూనే వుంటుంది.

చిన్నతనం నుంచీ అతడికి ఆలయానికి వెళ్ళేఅలవాటుంది. పెద్దదైన తరువాత గూడా అతడికా అలవాటు పోలేదు. చిన్నప్పటి అలవాటు కాబట్టి, బిడియంగానూ, సిగ్గుగానూ ఏమీ వుండదు. క్రొత్త వాళ్ళు, తాను గుడికి వెళుతున్నప్పుడు చూసినా !

అయితే గుడికి ఎందుకుపోవాలి? అన్న ప్రశ్న వచ్చినప్పుడు సరియైన సమాధానంరాక, నారాయణరావు కళవళపడేవాడు. నీతి ముఖ్యం కాని, భక్తి కాదని అతడికీ తెలుసు. అనేకమంది నీతిలేనివాళ్ళు గుళ్ళో తనకు తారసపడుతూ వుండటమూ చూస్తూ వున్నాడు. అయినా ఇన్ని ఆలోచనలు తనకెందుకు? ఈ విషయాలన్నీ ఆలోచనచేసి నిగ్గుతేల్చగల సమర్థత తనకు లేదు. తన అలవాటును పోగొట్టుకొనవలసిన అవసరం మాత్రం లేదన్న నిశ్చయానికి మాత్రమే అతడు రాగలిగాడు.

కాని ఒకందుకు అతడు విపరీతంగా బాధపడతాడు. దేవాలయంలోకి వెళ్ళి, భగవంతుని ముందు చేతులు జోడించి నిలిచి, మనస్సు లగ్నం చేయాలని ఆరాటపడుతున్న సమయంలోకూడా, అనేకములైన కామనలు, ఈర్ష్యాద్వేషాలు, తప్పుడు ఆలోచనలు, స్వార్థం, అసూయ, జీవితంలో అసంతృప్తి తనను విడిచిపెట్టి పోయేవికావు.

ఎప్పటికైనా వీటన్నిటినుండీ విముక్తి లభిస్తుందనే ఆశతోనే, ప్రయోజనంతోనే నారాయణరావు రోజూ గుడికివచ్చి ప్రదక్షిణాలుచేసి, దైవ దర్శనం చేసుకుంటున్నాడు.

నారాయణరావుది జాలిగుండె. మెత్తని మనసు. తన బలహీనతలను గురించి తనకు క్షుణ్ణంగా తెలుసు. వాటిని వదల్చుకోలేనందుకు, ఏకాంతంగా, సిగ్గుపడుతుంటాడు. తనని తానే నిరసించుకుంటూ ఉంటాడు.

"డిగ్రీ కోర్సు" పూర్తిచేసి నారాయణరావు ఎమ్, ఏ. చదువు కునేందుకు హైదరాబాదు వచ్చాడు. యూనివర్శిటీలో చేరిపోయి, హాస్టలులో వుంటూ చదువు సాగించాడు. హాస్టల్లో భోజనంతో కూడా యెలానో రాజీపడ్డాడుగాని, ప్రముఖంగా, దగ్గర్లో యెక్కడా దేవుడి గుడిలేకపోవటం అతడికి సమస్యే అయింది. ఎటు పోవాలన్నా సిటీ బస్‌మీద రెండు మూడు మైళ్ళు వెళ్ళవలసిందే. ఒంటరిగా ఏదో బీద తనంతో బాధ పడుతున్నట్లున్న దేవుళ్ళను చూస్తే అతడికి భయమూ-దిగులూ. అందుచేత నిత్యనైవేద్య దీపారాధనలతో కలకల లాడుతూ, నలుగురు వచ్చిపోతూ వుండే గుడికి పోవటమే నారాయణరావుకి ఇష్టం.

హైదరాబాదుకు వచ్చిన వారం రోజుల్లో, ఇదిఒక ప్రముఖ సమస్యగా పరిణమించి నారాయణరావు దిగులు పడ్డాడు. హాస్టల్లో చుట్టుపట్ల గదుల్లో వున్నవాళ్ళను కొందరిని వాకబు చేశాడు. వాళ్ళలో కొందరు నారాయణరావును వింతగా చూశారు. కొందరు పరిహాసంగా చూశారు. కొందరు అనాగరికుడు అన్నట్లు చూశారు. కొందరు మాత్రం మెచ్చుకొని గౌరవించారు. సరే ఒక మిత్రుడు పాపం నారాయణరావును వెంటపెట్టుకొని ఒక సాయంకాలం, చిక్కడపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకుని వెళ్ళాడు. నారాయణరావుకు చాలా సంతోషమైంది. కాని ఇది ఒక సమస్యే. రోజూ రావాలంటే రెండు మూడుగంటల పని. ఎనిమిదిన్నర దాటితే హాస్టల్లో భోజనం వుండదు. బస్ కోసం వెయిట్ చేయటం, యువతీ మండలి స్టాప్ దగ్గరదిగి కొంతదూరం నడవటం, ఇవన్నీ సమస్యలే. అందువలన ఎప్పుడూ వారం రోజులకోసారి మాత్రమే దేవాలయానికి వెళ్ళగలుగుతున్నాడు.

మంజుశ్రీ


ఓ రోజున నారాయణరావు దేవాలయానికి వెళ్ళాడు. సాయంకాలం పొడి పొడిగా చినుకులు పడి వెలిశాయి. ఆవాళ, గుళ్లో తొక్కిడిగా లేదు. మళ్ళీ వానవచ్చే సూచనలు కనపడుతున్నాయి. ఒకరూ, ఇద్దరూ వచ్చి దండం పెట్టుకొని వెళుతున్నారు. ఆవాళెందుకో మనసు కొంచెం ప్రశాంతంగావుంది. మంటపంలో చాలాసేపు కూచుండి పోయాడు నారాయణరావు. ఇంతలో వాన వచ్చింది. ఆ దృశ్యం మనోహరంగా వుంది.

ప్రొద్దుపోతున్నదని నారాయణ రావు లేచాడు. అప్పటికింకా సన్నగా తుప్పర పడుతూనే వుంది. సింహద్వారం దాకావచ్చి, యథాలాపంగా తన చెప్పులు జత కోసం వెతుక్కున్నాడు. తన చెప్పులు కనిపించలేదు. చాలా జాగ్రత్తగా చుట్టు ప్రక్కల ప్రదేశమంతా వెతికాడు. కాని ఎక్కడా కనిపించలేదు. నారాయణరావుకి చాలా విచారం కలిగింది. యూనివర్శిటీలో చేరే ముందే వాటిని కొనుక్కున్నాడు. ఖరీదుకూడా ఎక్కువే. పన్నెండు రూపాయలైనవి. మళ్ళీకొనుక్కోవాలన్నా, ఇప్పుడు తనకు చేత కాదు. ఎవరినో అప్పు అడగాలి.

ఎవరో కావాలనే తీసుకొని వెళ్ళారన్న ఆలోచన ఎంతో బాధాకరంగా వుంది అతడికి. అక్కడ దేనికోసమో వెతుకుతూంటే, సింహద్వారం ముందు పూలూ, పళ్ళూ, కొబ్బరికాయలూ అమ్ముకుంటూవుండే వాళ్ళు ఏమిటని అడిగారు. నారాయణరావుకు వాళ్ళు తనను అట్లా అడగటం ఇష్టంలేదు. ఐనా తాను అక్కడ తచ్చాడుతుంటే అడిగారు కాని, వాళ్ళ తప్పేముంది! "చెప్పులు కనపడటంలేదు" అని చెప్పాడు. అక్కడున్న వాళ్ళలో కొందరు వెకిలిగా నవ్వితే నారాయణరావుకు కత్తిపెట్టి పొడిచినంత బాధ కలిగింది. ఎవరో సానునయంగా "ఎవరో దుర్మార్గులు యెత్తుకొనిపోయి వుంటారు" అని సానుతాపం వెల్లడించారు. నారాయణరావుకు వీళ్ళ ఓదార్పుకాని, వాళ్ళ పరిహాసంకాని పట్టలేదు. మనుషుల దుర్మార్గమే మనస్సును అమితంగా బాధిస్తున్నది. "ఈమధ్య ఇట్లా చెప్పులు పోవటం జాస్తి అయింది" అన్నా రొకరు.

నారాయణరావు తల ఎత్తిచూస్తే అక్కడ "చెప్పులదొంగలతో జాగ్రత్త" అని పెద్ద పెద్ద అక్షరాలతో ఒక అట్టమీద వ్రాసి వ్రేలాడగట్టబడి వుంది. నారాయణరావుకు అమితమైన బాధ కలిగ్గింది. దేవాలయంలోకూడా, సినిమాహాలులోలాగానూ, రైలుబండిలోలాగానూ "దొంగలతో జాగ్రత్త" అని వ్రాసివున్నందుకు అతడెంతో ఖిన్నుడైనాడు. తన చెప్పులుపోవటం సంగతి అట్లావుంచి, ప్రపంచం ఇలా అయిపోవటం అతడు భరించలేడు.

ఇంతలో ఓ వృద్ధుడు అక్కడికి



వచ్చాడు. బిళ్ళగోచీ పెట్టుకుని, పైన ఉత్తరీయం వేసుకొని సింహద్వారం దగ్గర నిల్చుని నమస్కారం చేస్తున్నాడు. ఆయన ప్రక్కకు తిరిగి అక్కడెవరినో ప్రశ్నించాడు. వాళ్ళు చెప్పారు. ఆ వృద్ధుడు ఎంతో బాధపడిపోయి "అయ్యో! ఎంత చెడ్డ కాలం వచ్చింది? మనుషులంతా ఏమైపోతున్నారు? దేవాలయంలో చెప్పులు దొంగిలించినవాడికి కుక్క జన్మ వస్తుందని శాస్త్రం చెపుతున్నది. వాడెవడో కుక్కై పుడతాడు" అని బాధగానూ, కోపంగానూ నిరసిస్తున్నట్లు అని గుళ్ళోకి వెళ్ళిపోయాడు.


నారాయణరావు వొట్టిపాదాలతోనే తిరిగి పోయినాడు. అతడి సున్నితమైన మనస్సు విపరీతంగా బాధపడసాగింది. వాడెవరో, తన చెప్పులను ఆరుకో, ఏడుకో అమ్ముకుంటాడు. ఒకరోజో, రెండురోజులలో ఖర్చుపెట్టుకుంటాడు. అంతటితో జీవితం ముగిసిపోతుందా? అయ్యో! ఎవరోవాడు—తన చెప్పులను దొంగిలించినవాడు? వాడిపైన యెంతో జాలికలిగింది నారాయణరావుకు.

ఆ రాత్రంతా అదే ఆలోచనతో, అదే దుఃఖంతో, దిగులుతో, అసంతృప్తితోగడిపాడు నారాయణరావు. నారాయణరావుకు ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. చిత్రవిచిత్రములైనకలలు వచ్చాయి. కలలనిండా దుఃఖమూ, భయమూ, దిగులూ, జాలీ, అసంతృప్తి. తనకు తొమ్మిదేళ్ళప్పుడు స్కూలునుంచి ఇంటికి తిరిగివస్తుంటే

పదిమంది పెద్దవాళ్ళు, పెద్ద పెద్ద లాఠీకర్రలు, నాటుకట్టెలూ పట్టుకుని, ఓ కుక్కను తరుముతున్నారు. అది వాళ్ళకు చిక్కకుండా పోవాలని భయంతో, మొండి తెగింపుతో, క్రౌర్యంతో, ప్రయత్నం చేస్తున్నది. అయినా పదిమందీ, తలో దిక్కూ చేరి, చుట్టుముట్టారు. నల్లకుక్క. కళ్లు ఎఱ్ఱగా మండిపోతున్నాయి. నోటి వెంబడి చొల్లు కారిపోతున్నది. మధ్య మధ్య ఎఱ్ఱని రక్తపు జీరలు కూడా నోటివెంట పడుతున్నాయి. ముడుచుకొని, కుయ్యో మొఱ్ఱో, రక్షించండర్రోయ్ అంటూ దీనంగా, దిగులుగా, వేడుకుంటున్నట్లు, ప్రాధేయపడుతున్నట్లుచూస్తూ తనను తాను అర్పించుకుంది. ఎవరికీ జాలి లేదు. దయలేదు. అన్ని కర్రలూ వొక్కసారిగా దానిమీద నేపడ్డాయి. ఎముకలు పిండి పిండి అయిపోయినయ్. రక్తపు మడుగులో కుక్క కుప్ప కూలి పోయింది. తల పగిలి పోయింది. పలువరుస వికృతంగా బయటకు పొడుచుకుని వచ్చింది. కాళ్ళూ, తోకా, ఆడిస్తూ, విలవిలలాడి, కుయ్యోమని పేగులన్నీ బయటపడేలా అరుస్తూ ప్రాణాలు విడిచింది.

తాను చూడలేక పోయినాడు నారాయణరావు. కాని తనముందే జరిగింది ఇంత ఘోరం. తాను ఆ గుంపును తప్పించుకొని ఇంటికి పోవటానికి వీల్లేదు. దారి లేదు. చూడవలసి వచ్చింది. చూశాడు. తరువాత రెండు రోజులు జ్వరం కూడా వచ్చింది. అది పిచ్చికుక్కట. అంతకు క్రితం రోజున ఇద్దరు చిన్నపిల్లలను కరిచింది. ఒకడు క్రితం రోజు, ఒకడు ఈ రోజు ఆస్పత్రిలో చచ్చిపోయినారు. ఆ దుఃఖంతో రెచ్చిపోయినారు మనుషులు.

ఇంకోసారి తమఇంట్లోనే ఒక కుక్క అలవాటుగా పెంపుడుకుక్కలాగా వుండేది. ఇంటిల్లిపాదీ ఎంతో మాలిమిగా వుండేవాళ్ళు దానితో. ఎంతో ప్రేమించేవాళ్ళు. ఎవరినీ ఏమీ అనేదికాదు. నోట్లో వేళ్ళు పెట్టినా ఏమీ అనేదికాదు. చెవులు పట్టి లాగినా, చిన్నపిల్లలు తోకపట్టి లాగినా, కొట్టినా "భౌ" మనికూడా దడిపించేదికాదు. ఎక్కడెక్కడో వొక కబళంతిని, రాత్రికి మాత్రం పడుకోటానికి చేరేది. అమిత సాధువుగా వుండేది ఆ కుక్క. ఓసారి, పుండువంటి చలికాలంలో వేపచెట్టు కింద ఇసుకకుప్ప చాటున ఎనిమిది పిల్లలను పెట్టిందాకుక్క. ఇంటి మరామత్తుకోసం, ఇసుకను తోలించారప్పుడు. కాని అచలికో, మరి దేనికో, ఆ పిల్లలు బ్రతకలేదు. పదిహేను, ఇరవైరోజుల తరవాత, ఒక పిల్ల చనిపోతే పనివాళ్ళచేత తీసిపారేయించారు. ఆ తరువాత వరసగా రెండు మూడు రోజులకో పిల్ల చొప్పున అన్ని పిల్లలూ చనిపోయినయ్. పాపం దాని దుఃఖం



దుఃఖంకాదు. ఆ చెట్టుకిందమూ చూస్తూ, అన్నం నీళ్ళూమాని, ఆర్నెల్లు ఓ అని కేకలుపెడుతూ, కృశించి కృశించి చనిపోయింది. రోజూ మూడుపూటలా వచ్చి, కుయ్యోమని యేడ్చేది. వెళ్ళగొట్టినా వెళ్ళి మళ్ళీ వచ్చేది. దాని అవస్థ చూస్తుంటే ఇంట్లో వున్నవాళ్ళందరికీ కడుపు తరుక్కుపోయేది. అమ్మ ఒకరోజు అన్నంముందు కూర్చుని కళ్ళనీళ్ళు పెట్టుకుందికూడా. అప్పటి నుంచీ యింట్లో అందరికీ కూడా కుక్కను చేరదీయాలంటే భయమూ, దిగులూ అయేది.

ఓ సారి గాలివాన పట్టుకుని నాలుగురోజులదాకా వదలలేదు. ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. తలుపులు వేసినా, కిటికీ రెక్కల్లోంచి, తలుపు సందుల్లోంచి ఇల్లంతా తడిసిపోతున్నది. బయటప్రపంచ మంతా హెూరుమని వొకటేవాన.


తలుపులు కొట్టినట్టుగా వినపడితే తానే వోరవాకిలిగా తెరిచి చూశాడు నారాయణరావు. కుక్కపిల్ల ఒకటి చలికీ, వానకూ ముద్దయిపోయి వొణుకుతూ, కాళ్ళతో తలుపును రాస్తున్నది. తలుపు తెరవగానే నిస్సహాయంగా చూసింది. ఆ చూపు కడుపులో చేయిపెట్టి కెలికినట్లైంది నారాయణరావుకు. ఇంకొంచెంసందు

చేశాడు. ఒక్క దూకుతో లోపలకు వచ్చి పడింది కుక్కపిల్ల. పెట్టెల చాటుకు చేరి ముడుచుకొని పడుకున్నది. తరువాత రెండురోజులకు కాని వాన తగ్గలేదు. ఈ రెండు రోజులూ పడుకున్నచోటును వదిలిపెట్టలేదు కుక్కపిల్ల. ముడుచుకొని పడుకుని అర్ధనిమీలిత నేత్రాలతో మహదానందం అనుభవించసాగింది. ఏమన్నా పెట్టినాకూడా తినలేదు. వానవెలిసి, గాలి హోరుతగ్గి, ఆకాశం నిర్మలమై, ఎండ కాసినతరువాతకూడా ఆ కుక్క పిల్లను ఇంట్లోంచి ఎవరూ వెళ్ళగొట్టలేకపోయారు. వెళ్ళగొడదామని ఎంత ప్రయత్నించినా, ఏ అర్ధరాత్రో వచ్చి, ఓ మూల ముడుచుకొని పడుకొనేది, కాలి గోళ్ళతో తలుపులు గీరి, తలుపు తెరవగానే లోపలకు దూరేది. ఆరు నెలల్లో అందరికీ మాలిమైపోయింది. ఒకపూట ఒక కరుడు అన్నంపెడితే కుటుంబంలో తానూ ఒకతెగా మెలిగి పెద్దదైంది.

కాని ఒకరోజు చొంగ కార్చుకుంటూ ఇంటికి వచ్చింది. ఇంటిలో నడచినంతమేరా చొంగ. మూతి మధ్యలో పెద్ద రాయి ఇరుక్కుని పోయినట్లుగా చీలిపోయింది. రెండు దవడలూ కలుసుకోవటమే లేదు. నారాయణరావు పరీక్షగాచూశాడు. ఏదో పెద్ద ఎముక విరిగినట్లుగా వుంది పళ్ళసందున. ఇంతో వాళ్ళంతా దాన్నిచూసి అసహ్యించుకున్నారు. అన్నంపెడితే తినలేకపోయింది. పాలుపోస్తే కతకలేకపోయింది. వారం రోజులు అలానే బాధపడింది, కడుపులోకి ఏమీ ఆహారం లేకుండానే. తరువాత వెటర్నరీ హాస్పిటల్‌కు తీసుకువెళితే ధనుర్వాతమో–ఏదో వాతమో, అన్నారు. తరువాతరెండు రోజులకు చచ్చిపోయింది.

ఇంకోసారి చిన్న కుక్కపిల్ల బజారులో బండి కింద పడి నలిగి పోవటం చూశాడు. ఇంకో గజ్జి కుక్కపిల్లను, పెద్ద కుక్కలన్నీ పీకి పెట్టడం చూశాడు. ఇవన్నీ నారాయణరావుకు ఆ రాత్రి కళ్ళముందు తిరిగినయ్. ఇవే కలలు.

ప్రొద్దున లేవగానే నారాయణరావు ఏపనీ చేసుకోలేక పోయాడు. తన చెప్పులు దేవాలయంలో పోయినవని, ఎవరో దొంగ ఎత్తుకుని పోయినారని ఎవరితోనూ చెప్పలేదు. అట్లా చెప్పటంకాని, ఆ ఆలోచన మనసులోకి రావటంకాని, అతనికెంతమాత్రమూ ఇష్టంలేదు. పక్క రూంలో వుంటున్న స్నేహితుణ్ణి అడిగి అప్పుతీసుకుని, ఆ సాయంకాలమే బజారుకు వెళ్ళి నారాయణరావు చెప్పుల జత తీసుకున్నాడు. అవాళ క్లాసులకు కూడా హాజరు కాలేక పోయినాడు.



ఆ సాయంకాలానికే దేవాలయానికి వెళ్ళి దేవుడిముందు నిలబడి మనస్సునంతా ఏకాగ్రంచేసి, కళ్ళు తడిసి పోతూ వుండగా, తన చెప్పులు ఎత్తుకొనిపోయిన అతడు వాటిని కావాలని దొంగతనం చేసివుండడనీ, పొరపాటున తన చెప్పులే ననుకొని తొడుక్కుని వెళ్ళివుంటాడని ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకొని పొరపాటు జరిగినందుకు నొచ్చుకుని వుంటాడని, ఒకవేళ, పొరపాటున, తెలియక, మూర్ఖత్వంవలన, బీదతనం వలన, కావాలనే తీసుకొని వెళ్ళినా, తన మీదదయచూపి, అతణ్ణి రక్షించాలనీ, ఈచిన్న తప్పుకు అతడికి కుక్క జన్మ ససేమిరా రాకుండా వుండాలని, నారాయణరావు ఎంతగానో ప్రార్థించాడు. అప్పటికిగాని అతడి మనసు తేలిక పడలేదు. అప్పటికిగాని వీధిలో కుక్కను చూసినప్పుడు మనస్సు ఉలికి పడటం నుండి తేరుకోలేదు. సింహద్వారం బయటికివచ్చి భయం భయంగా తన చెప్పులు తొడుక్కుని ఏవేవో ఆలోచనలతో కళ్ళుతుడుచుకుంటూ బస్‌స్టాపువరకూ నడచివచ్చి, యథాలాపంగా తన చెప్పులవేపు చూసుకుంటే. "అయ్యో భగవంతుడా? ఈ చెప్పులు ఇవాళ తాను కొన్నవేనా?" అన్న ప్రశ్నమళ్ళీ అతడికళ్ళు తడిపింది.

□□□

సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

(గతసంచిక తరువాయి)

తర్వాత సునంద వచ్చినప్పుడు "రెండు మూడు రోజుల్లో ఇంటికి వెళ్ళిపోతున్నాం" అంది జయంతి.

"పూర్తిగా తగ్గకుండానే?" సునంద ఆశ్చర్యం వెలిబుచ్చింది.

"తగ్గకపోవటమేం? నార్మల్‌కి వచ్చేసింది. ఇంకా ఎన్నిరోజు లుండాలి? నాకు బాగాలేదు."

"అవుననుకో! కాని, నీ మొహంలో నీరసం పోనేలేదు."

జయంతి నవ్వింది. "బాగుంది. నేను మళ్ళీ ఓ మనిషి నవాలంటే కనీసం ఓ నెలయినా కావాలి. అంత వరకూ యిక్కడుండటం మర్యాదేనంటావా?"

"అనను. కాని, యీ పరిస్థితుల్లో సుఖమైన వాతావరణం వదిలి, కావాలని యిబ్బందుల్లో అడుగుపెట్టడం గూడా మంచిది కాదంటాను. నీ అంతట నీవువచ్చి అతని నెత్తికెక్కితే అది వేరేవిషయం. ఏం? అతనేమైనా అన్నాడా?" అంది కుతూహలంగా చూస్తూ.

"లేదు. అనటాని కేముందసలు? కాని, నాకే యిష్టంలేదు."

ఇద్దరిమధ్యా నిశ్శబ్దం యేర్పడింది.

"సునందా! సాధ్యమైనంత త్వరలో నేను ఆ టీచర్‌జాబ్‌లో జాయిన్ కాకపోతే అదికాస్తా యింకెవరికైనా వాళ్ళిచ్చెయ్యరూ?" అంది జయంతి.

"అదా నీ భయం! అసలుసంగతి అదని చెప్పవేం మరి? ఆ ఖాళీ ఎప్పుడో భర్తీ అయిపోయింది. నువ్వు జబ్బుపడిన నాలుగురోజులకి ఆ హెడ్మిస్ట్రెస్ నాకు కబురు చేసింది. నీకు ఒంట్లో బాగాలేదనీ, హాస్పిటల్లో ఉన్నావని చెప్పి పంపించాను."

"అలా ఎందుకుచెప్పావు?"

"చెప్ప కేంచెయ్యాలి? ఓ చెంపన పరీక్షలు దగ్గరికొస్తున్నాయని ఆవిడ తొందరపడుతోంది."

"ఐతే అందులోకి ఎవరైనా వచ్చేశారంటావా?"

"ఆహా! నిస్సందేహంగా! ఐనా ఒకవేళ వుంచినా యిప్పట్లో నువ్వీ పరిస్థితుల్లో జేరగలిగేదానివా?" అంది సునంద.

జయంతి నిట్టూర్పు విడిచింది.

"యేం?"

"యేముంది? భూమి గుండ్రముగా నుండును."

"అందుకే-ఒంటికి కాస్త కండ పట్టేవరకూ యిక్కడే వుంటే బాగుంటుందేమోనని నావుద్దేశ్యం. మీ యింటికి వెళ్ళగానే సరా? అక్కడ జరిగే మార్గం?."

"నేను శేఖరం దగ్గర చేరినప్పటి నుంచి అప్పుడప్పుడు దాచుకున్న డబ్బుకొద్దిగా వుంది."

"యెంత వుంది? మహావుంటే రెండు వందలుందేమో! దానితో

"సెక్రటరీ" సీరియల్ - జరిగిన కథ

అనగనగా ఒక జయంతి. ఆమె కొక బామ్మ. జయంతికి చాల కాలం ప్రయత్నించగా వనితా విహార్‌లో సెక్రటరీగా ఉద్యోగం దొరుకుతుంది. కాని, అక్కడి సభ్యురాండ్ర సంకుచితప్రవర్తన గిట్టక రాజీనామా యిస్తుంది. వనితావిహార్‌లోనే కాక ఊళ్ళోకూడా గొప్ప పలుకుబడిగల రాజశేఖరం ఆమెకు తనవద్ద సెక్రటరీగా ఉద్యోగమిస్తాడు. అతడు అందగాడు, ధనికుడు, మంచివాడు. అతనివద్ద ఉద్యోగం చేస్తుండగా జయంతికి శివరామ్, ప్రకాశం అనే యువకులు, ఒక డాక్టరు, ఆయన భార్య కామేశ్వరమ్మగారు పరిచయమౌతారు.

రాజశేఖరంవద్ద ఉద్యోగం బాగానే వుంది. అతడామెను ఎంతో గౌరవంగా, ఆత్మీయంగా చూస్తాడు. కాని కొన్ని విచిత్ర సంఘటనలు వరసగా జరిగిపోయి అతన్ని కూడా జయంతి ఏవగించుకొనడం ప్రారంభిస్తుంది. అతనికి ప్రమీల అనే అమ్మాయితో వివాహం నిశ్చయమైనట్టు తెలుస్తుంది. రేఖారాణి అనే ఆమెతో అతని ఏకాంత ప్రవర్తన చూస్తుంది. ఇక ఆఉద్యోగం చేయలేననే నిశ్చయానికి వచ్చి రాజీనామా ఇచ్చేస్తుంది. ఆనాటినుంచే ఆమెకు తీవ్రమైన జబ్బుచేస్తుంది. స్పృహ కోల్పోతుంది. జబ్బుగా వున్నన్నాళ్ళు, ఆ తర్వాత రాజశేఖరమే ఆమెను, ఆమె బామ్మగారిని ఆదరిస్తాడు. కాని జబ్బు నయమైన తరవాత అతని ఇంట్లో వుండకూడదని, తన ఇంటికి వెళ్ళిపోవాలనినిశ్చయించుకుంటుంది.

సరిపోతుందా? నామాట విను. పిచ్చిపిచ్చి ఆలోచనలతో బుఱ్ఱపాడు చేసుకోక ఆరోగ్యం వచ్చేవరకూ ఇక్కడే వుండు.

"కాదు సునందా! నాకెందుకో ఇక్కడ శోకంపరంగా వుంది."

"యెందుకని?"

"యెందుకో - కారణం వెతికితే ఫలానా"అని కన్పించదు. ఈ యింట్లో నాకు మనశ్శాంతిలేదు."

"అది యింట్లోగాదు. నీమనసులో లేదేమో. అది ఆలోచించు!మొదట" అంది సునంద.

జయంతి మాట్లాడలేదు. మౌనంగా ఆలోచిస్తూ ఉండి పోయింది. చాలాసేపు కూర్చున్న తర్వాత వెళ్లబోయే ముందు మరో సారి ఆలోచించు కోమని హెచ్చరించి సునంద వెళ్ళిపోయింది.

జయంతి లేచి వంటయింటి వైపు వచ్చింది. వస్తూనే ఆశ్చర్యపోయింది.

శేఖరం డైనింగ్ టేబిలుండే చోటులో అదితీసేసి క్రింద పీట వేసుకుని కూర్చుని భోంచేస్తున్నాడు. అతని కెదురుగా కూర్చుని బామ్మగారు వడ్డిస్తోంది.

శేఖరం ఎందుకో విపరీతంగా నవ్వుతున్నాడు. బామ్మ మొహం గూడా ప్రసన్నతతో వికసించివుంది.

"అట్టే నవ్వకు. పలమారేను. ఆ పల్లెటూళ్లో యెన్నో. చెప్తే కొన్ని రోజులు పురాణం అవుతుంది" అంటోంది పెరుగువడ్డిస్తూ.

"యెప్పుడైనాసరే! నాకూ నీకు తీరిక దొరికినప్పుడు అవన్నీ నాకు చెప్పాలి." అంటున్నాడు శేఖరం.

జయంతికిది కలో నిజమో అర్థం గాలేదు. అతన్ని బామ్మ నువ్వు అంటోంది. పోని ఆవిడకంటే అతను చాలా చిన్నవాడుగాబట్టి అది సహజమే! కాని శేఖరం గూడా ఆవిడని నువ్వు అంటున్నాడే! వీళ్ళిద్దరికియింత ఆత్మీయత యెప్పుడు పెరిగింది! శేఖరం వాలకంచూస్తుంటే బామ్మని బాగా మంచి చేసుకుంటున్నట్టు తోస్తోంది.

జయంతిలోపలకి వచ్చింది. మనవరాలిని చూస్తూనే బామ్మగారి మొహం కొద్దిగా గంభీరంగా మారింది.

"సునంద వెళ్ళి పోయిందా?" అన్నాడు శేఖరం.

జయంతి శేఖరం ప్రశ్న విన్పించుకోనట్టు "బామ్మా! నాయర్ యేమైపోయాడు" అంది గోడకానుకుని నిలబడుతూ.

"నే నే మాన్పించేశాను" అన్నాడు శేఖరం.

"అబ్బాయి చూడలేదుగాని — వెధవ—యెంత దుబారా చేస్తున్నాడని."

"అది నువ్వు యెల్లకాలం అరికట్ట లేవుగా—" అని ఆగి "పోన్లే! ఈ



కొద్ది రోజులు వాడి దుబారాతో పాటు జీతంగూడా కలిసివస్తుంది. నువ్వు చేస్తున్న భోజనానికి ఋణం కూడా తీరిపోతుంది."

"అదేమిటే" అంది బామ్మగారు.

శేఖరం మొహంలో నవ్వుపోయి గంభీరంగా తయారైంది. చురుగ్గా జయంతి వైపుచూస్తూ "ఆవిడకి భోజ

నంపెట్టిన నఋణం తీరిపోతుంది. అది సరే! నీకోసం యింతఖర్చు పెట్టాను. అదెలా రాబట్టుకోవాలో నాకు తెలియటం లేదు" అన్నాడు.

"ఆ ఋణం పెంచుకోకుండా వుండాలంటే మమ్మల్ని త్వరగా మా యింటికి పంపించెయ్యటం మంచిది,"

"ఖర్చుపెట్టినదానికి వడ్డీతోసహా వసూలు చెయ్యందే యెలా వెళ్ళనిస్తాను?" అన్నాడు పీటమీదనుంచి లేస్తూ. అప్పటికే అతని భోజనం అయిపోయింది.

"అంటే మీ ఉద్దేశ్యం—"

"ఆమాత్రం గ్రహించలేవూ–ఇవన్నీ గ్రహించిన తెలివితేటలున్న దానివి?"

"అంటే?" రోషంగా అంది.

"అంటే ఏమిటో చెబుతున్నాను విను. కొద్దిరోజులనుంచి నీ మాటల ధోరణి పూర్తిగా కాకపోయినా చూచాయగానైనా నేను అర్థంచేసుకోలేదు. నీ అందాన్ని చూసి, నేనేదో దానికి ముగ్ధుడినైపోయి నీకోసం ప్రాకులాడుతున్నానని, యీ నెపంతో వలలు విసురుతున్నానని అనుకోకు నువ్వు. నాక్కావాలనుకుంటే నీ కంటే వెయ్యిరెట్లు బాగున్నవాళ్ళు లక్షమంది వచ్చి నా కాళ్ళ దగ్గర నిలబడ్తారు. నా బాధల్లా బామ్మని గురించి. ఆవిడ ఆరోగ్యం మంచిది గాదు. ఈ పరిస్థితుల్లో నీ పిచ్చి ఆలోచనలకి ఆవిడని వదిలేసి ఆవిడ పడే అందోళనని గుర్తించలేకపోవటానికి నేను నీలాటి మూర్ఖుణ్ణికాదు."

అతను సూటిగా అనేస్తున్న యీ మాటలకి మొదట తెల్లబోయింది జయంతి. వెంటనే తేరుకుని విసురుగా ఏదో చెప్పబోయింది. శేఖరం దానికి అవకాశం యివ్వకుండానే "ఆవిడనిగురించి మాట్లాడే అధికారం నాకుంది. ఆవిడ నాకు పరాయిది గాదు —"

"ఛీ! సిగ్గులేదు. ఆవిడ అమాయకత్వాన్ని ఆధారంచేసుకుని—"

"జయంతీ!" ఇదంతా వింటున్న బామ్మగారు వారిస్తున్నట్టు బిగ్గరగా అంది.

శేఖరం మొహం యెర్రబడింది. కాని, తమాయించుకుంటూ "పోనీ–అలాగే అనుకో—"అని వెళ్ళబోతూ ఆగి "కాని దానివల్ల నీకు లాభమే గాని నష్టంలేదని హామీ యిస్తున్నాను–సరా?"అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

"జయా! అతను మనకి పరాయివాడు కాదని నేను చెప్పటంలా!" బామ్మగారు లేచి దగ్గరగావస్తూ అంది.

"ఊరుకో బామ్మా! దీనికంతటికీ నీ చాదస్తమే కారణం. ఆ అలుసు చూసుకునే అంతమాట లనగలిగాడు, లేకపోతే ఎంత ధైర్యం—" జయంతి కళ్ళు ఎరుపురంగుకి దిగినాయి. తర్జనితో చూపిస్తూ "ఇదుగో, ఇప్పుడే చెబుతున్నా! నే నీ యింట్లో ఒక్క క్షణం ఉండను. నువ్వు అతనికి వెళ్ళిపోతామని చెప్పెయ్యి" అంది.

"అదిగాదే జయా!"

"నీ మాట ఒక్కటిగూడా నేను వినదల్చుకోలేదు. వినను నేను" అంటూ, విసురుగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భోజనం చెయ్యలేదు జయంతి. బామ్మగారు ఎంత బ్రతిమలాడినా వినకుండా వద్దని వచ్చి మంచంమీద పడుకుంది.

ఛీ! ఛీ! ప్రపంచంలో యే ఆడపిల్లకైనా యింతకంటే అవమానం యింకోటుంటుందా! చివరికి కురూపిగూడా ఎవరైనా తన మొహం మీద "నువ్వు కురూపి" అంటే బాధపడ్తుందే! అన్నవాళ్ళని అసహ్యించుకుంటుందే! చిన్నప్పటినుంచి అందంతో అందరిలో ఓ ప్రత్యేకతని సంపాయించుకున్న తనని—నిజంగా శేఖరానికి ఆమాట లనటానికి యెంత ధైర్యం. అసలు దీనికంతటికీ మూల కారణం బామ్మ. ఆవిడ వాలకం చూస్తే పూర్తిగా అతని మాటలకి లోబడిపోయినట్టుంది. శేఖరం ఎంత తెలివిగా బామ్మని తన వైపుకి తిప్పుకున్నాడు. బామ్మ లేకుండా తనేం చెయ్యలేదని, ఎక్కడికీ వెళ్ళలేదని గ్రహించాడు. ఇది వల విసరటంకాకపోతే మరేమిటి! పైగా తనంటే ఏ ఆకర్షణా లేదుట. అందానికి ముగ్ధుడు కాలేదట. తను కల్లో గూడా ఆలోచించని విషయాలని నెత్తిమీద రుద్దటంవల్ల అతనికేం వస్తుంది? లక్షమంది కాళ్ళమీద పడ్తారుట! అది ప్రత్యేకంగా ఛాతీ విరుచుకు చెప్పాలా! సిగ్గులేకపోతేసరి! పాపం! అతని దృష్టిలో రేఖారాణి, ప్రమీల అంత సౌందర్యవంతులు యింకెవరూ లేరని గాబోలు. జయంతికి ఆ క్షణంలో శేఖరం అంటే కలిగినంత అసహ్యం యికముందెప్పుడూ యెవరిమీదా కలగదనిపించింది.

నిద్ర పోకుండా మంచంమీద కూర్చుని వెనక్కి జారగిలబడి ఆలోచిస్తున్న జయంతి, గదిలోకి శేఖరం రావడంతో వులిక్కిపడింది.

"భయపడకు. నేనేం నిన్ను మింగనులే" అన్నాడు బీరువా దగ్గరికి వెళ్తూ.

"నేనేం భయపడటంలేదు. యెవరికీ భయపడాల్సిన అవసరం కూడా నాకేం లేదు."

బీరువా తెరుస్తున్న అతను తల తిప్పి యిటువైపు చూశాడు. ఆ చూపు చిత్రంగా వుంది.

"ఓహో! అయితే వులిక్కి పడడం దేనికోమరి"

"పరధ్యానంగా వున్నప్పుడు హఠాత్తుగా శబ్దంవింటే శరీరం దానంతట అదే వులిక్కి పడ్తుంది."

"అలాగా! నాకు తెలియదులే" అన్నాడు.

జయంతి చూస్తుండగానే బీరువాలోంచి డబ్బుతీసి జేబులో పెట్టుకుని, సూటుకేస్‌కి తాళంవేస్తూ,

నంపెట్టిన నఋణం తీరిపోతుంది. అది సరే! నీకోసం యింతఖర్చు పెట్టాను. అదెలా రాబట్టుకోవాలో నాకు తెలియటం లేదు" అన్నాడు.

"ఆ ఋణం పెంచుకోకుండా వుండాలంటే మమ్మల్ని త్వరగా మా యింటికి పంపించెయ్యటం మంచిది."

"ఖర్చుపెట్టినదానికి వడ్డీతోసహా వసూలు చెయ్యందే యెలా వెళ్ళనిస్తాను?" అన్నాడు పీటమీదనుంచి లేస్తూ. అప్పటికే అతని భోజనం అయిపోయింది.

"అంటే మీ ఉద్దేశ్యం—"

"ఆమాత్రం గ్రహించలేవూ–ఇవన్నీ గ్రహించిన తెలివితేటలున్న దానివి?"

"అంటే?" రోషంగా అంది.

"అంటే ఏమిటో చెబ్తున్నాను విను. కొద్దిరోజులనుంచి నీ మాటల ధోరణి పూర్తిగా కాకపోయినా చూచాయగానైనా నేను అర్థంచేసుకోపోలేదు. నీ అందాన్ని చూసి, నేనేదో దానికి ముగ్ధుడినైపోయి నీకోసం ప్రాకులాడ్తున్నానని, యీ నెపంతో వలలు విసురుతున్నానని అనుకోకు నువ్వు. నాక్కావాలనుకుంటే నీ కంటే వెయ్యిరెట్లు బాగున్నవాళ్ళు లక్షమంది వచ్చి నా కాళ్ళ దగ్గిర నిలబడ్తారు. నా బాధల్లా బామ్మని గురించి. ఆవిడ ఆరోగ్యం మంచిది గాదు. ఈ పరిస్థితుల్లో నీ పిచ్చి ఆలోచన్లకి ఆవిడని వదిలేసి ఆవిడ పడే అందోళనని గుర్తించలేకపోవటానికి నేను నీలాటి మూర్ఖుణ్ణికాదు."

అతను సూటిగా అనేస్తున్న యీ మాటలకి మొదట తెల్లబోయింది జయంతి. వెంటనే తేరుకుని విసురుగా ఏదో చెప్పబోయింది. శేఖరం దానికి అవకాశం యివ్వకుండానే "ఆవిడనిగురించి మాట్లాడే అధికారం నాకుంది. ఆవిడ నాకు పరాయిది గాదు —"

"ఛీ! సిగ్గులేదు. ఆవిడ అమాయకత్వాన్ని ఆధారంచేసుకుని—"

"జయంతీ!" ఇదంతా వింటున్న బామ్మగారు వారిస్తున్నట్టు బిగ్గరగా అంది.

శేఖరం మొహం యెర్రబడింది. కాని, తమాయించుకుంటూ "పోనీ–అలాగే అనుకో—"అని వెళ్ళబోతూ ఆగి "కాని దానివల్ల నీకు లాభమే గాని నష్టంలేదని హామీ యిస్తున్నాను–సరా?"అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

"జయా! అతను మనకి పరాయివాడు కాదని నేను చెప్పటంలా!" బామ్మగారు లేచి దగ్గరగావస్తూ అంది.

"ఊరుకో బామ్మా! దీనికంతటికీ నీ చాదస్తమే కారణం. ఆ అలుసు చూసుకునే అంతమాట లనగలిగాడు, లేకపోతే ఎంత ధైర్యం—" జయంతి కళ్ళు ఎరుపురంగుకి దిగినాయి. తర్జనితో చూపిస్తూ "ఇదుగో, ఇప్పుడే చెబ్తున్నా! నే నీ యింట్లో ఒక్క క్షణం

ఉండను. నువ్వు అతనికి వెళ్ళిపోతామని చెప్పెయ్యి" అంది.

"అదిగాదే జయా!"

"నీ మాట ఒక్కటిగూడా నేను వినదల్చుకోలేదు. వినను నేను" అంటూ, విసురుగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి భోజనం చెయ్యలేదు జయంతి. బామ్మగారు ఎంత బ్రతిమలాడినా వినకుండా వద్దని వచ్చి మంచంమీద పడుకుంది.

ఛీ! ఛీ! ప్రపంచంలో యే ఆడపిల్లకైనా యింతకంటే అవమానం యింకోటుంటుందా! చివరికి కురూపిగూడా ఎవరైనా తన మొహంమీద "నువ్వు కురూపి" అంటే బాధపడ్తుందే! అన్నవాళ్ళని అసహ్యించుకుంటుందే! చిన్నప్పటినుంచి అందంతో అందరిలో ఓ ప్రత్యేకతని సంపాయించుకున్న తనని—నిజంగా శేఖరానికి ఆమాట లనటానికి యెంత ధైర్యం. అసలు దీనికంతటికీ మూలకారణం బామ్మ. ఆవిడ వాలకం చూస్తే పూర్తిగా అతని మాటలకి లోబడిపోయినట్టుంది. శేఖరం ఎంత తెలివిగా బామ్మని తన వైపుకి తిప్పుకున్నాడు. బామ్మ లేకుండా తనేం చెయ్యలేదని, ఎక్కడికీ వెళ్ళలేదని గ్రహించాడు. ఇది వల విసరటంకాకపోతే మరేమిటి! పైగా తనంటే ఏ ఆకర్షణా లేదుట. అందానికీ ముగ్ధుడు కాలేదట. తను కల్లో గూడా ఆలోచించని విషయాలని నెత్తిమీద రుదటంవల్ల అతనికేం వస్తుంది? లక్షమంది కాళ్ళమీద పడ్తారుట! అది ప్రత్యేకం ఛాతీ విరుచుకు చెప్పాలా! సిగ్గులేకపోతేసరి! పాపం! అతని దృష్టిలో రేఖారాణి, ప్రమీల అంత సౌందర్యవంతులు యింకెవరూ లేరని గాబోలు. జయంతికి ఆ క్షణంలో శేఖరం అంటే కలిగినంత అసహ్యం యికముందెప్పుడూ యెవరిమీదా కలగదనిపించింది.

నిద్ర పోకుండా మంచంమీద కూర్చుని వెనక్కు జారగిలబడి ఆలోచిస్తున్న జయంతి, గదిలోకి శేఖరం రావడంతో వులిక్కిపడింది.

"భయపడకు. నేనేం నిన్ను మింగనులే" అన్నాడు బీరువా దగ్గరికి వెళ్తూ.

"నేనేం భయపడటంలేదు. యెవరికీ భయపడాల్సిన అవసరం కూడా నాకేం లేదు."

బీరువా తెరుస్తున్న అతను తల తిప్పి యిటువైపు చూశాడు. ఆ చూపు చిత్రంగా వుంది.

"ఓహో! అయితే వులిక్కి పడడం దేనికోమరి"

"పరధ్యానంగా వున్నప్పుడు హఠాత్తుగా శబ్దంవింటే శరీరం దానంతట అదే వులిక్కి పడ్తుంది."

"అలాగా! నాకు తెలియదులే" అన్నాడు.

జయంతి చూస్తుండగానే బీరువాలోంచి డబ్బుతీసి జేబులో పెట్టుకుని, సూటుకేస్‌కి తాళంవేస్తూ,

"నేను వూరు వెడ్తున్నాను. ఇంటి దగ్గర జాగ్రత్త; నాయర్ గూడా లేడు" అన్నాడు తాళం చెవులు జయంతి మంచం మీదకి పడేస్తూ.

"మేం రేపువుదయం తెల్లవారగానే వెళ్ళిపోతున్నాం. మీ యింటి భద్రత యింకెవరికైనా అప్పగించుకుంటే మంచిది." తల తిప్పుకుంటూ అంది జయంతి వాటివైపు చూడకుండా.

"సరే అయితే" తాళం చెవులు చేతిలోకి తీసుకుని అతను వెళ్ళిపోయాడు.

జయంతికి నీరసం వచ్చింది. యేవూరు? యెన్నిరోజులు, యేం చెప్పలేదు. అతను అర్జంటుగా ఒకటి రెండు రోజులలో వస్తే వుండటానికి తనకి అభ్యంతరం లేదు. అతను లోపలికి రావడం ప్రసన్నంగానే వచ్చి గంభీరంగా తిరిగి వెళ్ళిపోవడం జయంతి దృష్టిని దాటిపోలేదు. అయినా యిదేమిటి? అసలు పరిచయం అనేది లేనప్పుడు, అంత ఆప్యాయంగా, స్నేహపూర్వకంగా మాట్లాడినమనిషి యిప్పుడిలా అంటీ అంటనట్టుండటానికి కారణం? ఎవరైనా పరిచయం అయింతర్వాత దగ్గరకి వస్తారు. ఇతను విడిపోయాడెందుకు? ఇదే అతని అసలు స్వరూపమా అన్పించింది జయంతికి.

శేఖరం వూరు వెళ్ళిపోతే యిల్లు వదిలిపెట్టి బామ్మ రావటానికి ఒప్పుకుంటుందా అని అనుమానం కలిగింది. అదే నిజమైంది గూడా.

"నాలుగు రోజుల్లో వచ్చేస్తానన్నాడు. ఇన్నాళ్ళువుండి యీ కాస్తలో తొందరపడటం బాగుంటుందా! అయినా అతను, మనకెంత జేస్తే—"

"అబ్బ! నీమాటలు వినాలంటేనే విసుగు—" జయంతి విసురుగా అని అక్కడినుంచి వెళ్ళిపోయింది. తను తిరస్కరించిన తాళం చెవులగుత్తి బామ్మ కొంగుకి వేళ్ళాడుతోంది.

● ● ●

శేఖరం వూరు వెళ్ళి దాదాపు యిరవైరోజులు అవుతోంది. అతను తిరిగి రాలేదు. కనీసం ఫలాన కారణంవల్ల రాలేకపోయానని ఉత్తరం గూడా రాయలేదు.

"నీ తిక్క కుదిర్చి నిన్నిక్కడే వుంచాలని అలా చేశాడేమో" అంది సునంద రహస్యంగా.

"ఛీ! ఫో! నీకు బుద్ధి లేదు" కసురుకుంది జయంతి.

శేఖరం క్షేమం గురించి ఖబురు తెలియలేదని బామ్మగారికి ఆదుర్దా యెక్కువైంది. "నాలుగు రోజుల్లో వచ్చేస్తానని చెప్పాడు. ఇరవైరోజులు దాటిపోయినాయి. అబ్బాయి రాలేదేమో?" అంది ఆవిడ.

"ఆయనకిలా వెళ్ళిపోయి వుండటం అలవాటే బామ్మా!" అంది విసుగ్గా జయంతి. పైకి పట్టనట్టు అలా అందేగాని లోపల్లోపల కనీసం ఉత్తరమైనా రాయలేదెందుకు అనే అనుమానం కలుగుతూనే వుంది.


ఒకవేళ సునందమాటే నిజమేమో! వెళ్ళేరోజున జరిగిన సంఘటనకి తనమీద కోపం వచ్చిందేమో! ...నా తనకేం తెలుసు అతనప్పుడే ఊరు వెళ్ళబోతున్నాడని! అసలింత ...సినమనిషి అలా నిర్లక్ష్యంగా ఎందుకు మాట్లాడాలి! కొంచెం ఆప్యాయంగా మాట్లాడితే తనుగూడా అలాగే మాట్లాడేది. అతని మాటలు, ప్రవర్తన గుచ్చినట్టే వున్నాయని స్పష్టంగా కన్పిస్తుంటే ఏంచెయ్యాలి?

ఏదేలావున్నా రోజులు క్షణాల్లా గిర్రున తిరిగిపోతూనే వున్నాయి. అడపాదడపా శివరామ్ వస్తూనే వున్నాడు. అతనితోబాటు ప్రకాశం గూడా అప్పుడప్పుడు వస్తున్నాడు. వచ్చినప్పుడల్లా వాళ్ళ చేతుల్లో పువ్వులు, పళ్ళు తప్పకుండా వుంటాయి. వాళ్ళొచ్చినప్పుడు గంటలు నిమిషాల్లా దొర్లిపోతాయి. బామ్మగారికికూడా శివరామ్ కబుర్లు నచ్చుతున్నాయి.

బామ్మకి, కామేశ్వరమ్మగారికి స్నేహం బాగా కలిసిపోయింది.

ఓ రోజు ఆవిడ వచ్చినప్పుడు అక్కడే సునందగూడా వుంది.

కామేశ్వరమ్మగారు జయంతి పెళ్ళి ప్రసక్తితెస్తూ "నా ఎరుకలో ఓ మంచి కుర్రాడున్నాడు. అతను గనుక ఒప్పుకుంటే ...



మా చేతులమీదుగా చెయ్యాలనే నాకూ డాక్టరుగారికి వుంది" అంది.

"ఎవరది? చెప్పండి. ఇంకా ఆలస్యం చేస్తారేం!" అంది బామ్మగారు ఆదుర్దాగా.

"ఇప్పుడే చెప్పను. మొదట అతని అభిప్రాయం తెలుసుకోవాలి."

"మీకు పుణ్యముంటుంది. అదేదో త్వరగా చూద్దురూ! దాని పెళ్ళి అయిపోయిందంటే నాకు యిక ఎక్కడున్నా నిశ్చింత" అంది మనమరాలి వంక చూస్తూ.

జయంతి ఆ ప్రసంగం మీద ఇష్టం లేనట్టు చటుక్కున లేచినిలబడి "సునందా! ఈరోజు పోస్ట్‌లో కొత్త పుస్తకాలు వచ్చాయి. వాటిల్లో స్వెటర్లు అల్లటం వుంది. చాలా కొత్తడిజైనులు రా! చూపిస్తాను." అంది.

"అబ్బ! తర్వాత చూస్తాలెద్దూ!" సునంద విసుక్కుంటూ, అని, కామేశ్వరమ్మగారి వైపు తిరిగి, "చెప్పండి చెప్పండి. ముందసలు కుఱ్ఱాడెలా వుంటాడు? జయంతి ప్రక్కన నిలబడితే యీడుగా వుంటాడా?" అంది.

"ఆ! చక్కటి జోడా అవుతుంది. నాకు తెలిసినంతవరకు అంత మంచి జోడా యెక్కడా చూసివుండను." ఆవిడ ముసిముసి నవ్వులు నవ్వుతూ జయంతి వైపు చూసింది.

జయంతి కెందుకో ఆవిడ నవ్వు చూస్తుంటే చిరాకు పుట్టింది.

"సునందా! నువ్వు వస్తావా? నేను వెళ్ళనా?"

"వస్తానుండు. ఆ! చెప్పండి అబ్బాయి యేం చదివాడు?"

"పెద్దచదువే!"

"మంచి సంస్కారం – వ్యక్తిత్వం యిచ్చేంత చదువు."

"సునందా!" మరోసారి పిల్చింది.

సునంద జయంతి మాట విన్పించుకోకుండా "ఘేమైనా వుద్యోగం చేస్తున్నాడా?" అంది.

"వుద్యోగం చెయ్యటం లేదనుకో కాని డబ్బు సంపాయించటం అతనికి తెలిసినంతగా మగవాళ్ళలో చాలా కొద్దిమందికి తెలుస్తుంది."

జయంతి వచ్చిసునంద చేయిపట్టి బలవంతాన లేవదీసి రెక్కపుచ్చుకుని యీడ్చుకు పోయింది. సునంద వెనక్కు తిరిగి నవ్వుతూ "యింకోసారి అడుగుతాను" అంటూ వెళ్ళిపోయింది.

ఇవతలకి వచ్చేసిం తర్వాత "యేమిటా వెధవ తొందర? యిప్పుడా పుస్తకాలు చూడకపోతే కొంప మునుగుతుందా!" అంది చిరుకోపం నటిస్తూ.

"ఆ వెధవ ఖబుర్లు వినకపోతే నీకు నిద్రపట్టదా?" జయంతి వెక్కిరించింది.

"పట్టదు. నా ప్రాణానికి ప్రాణానివి నువ్వు. నీకుకాబోయే మొగుడు ముందు నాకు నచ్చాలి. ఆమాట మర్చిపోకు—"

"కల్లోగూడా మర్చిపోను."

"మరి? పాపం ఆవిడంత వుత్సాహంగా ఆ సంబంధం గురించి చెబుతుంటే—"

"అవున్లే! యేం చదివాడో తెలియదు. వుద్యోగం యేమీలేదు. కాని డబ్బు సంపాయించగలడు— అంటే యెలాటి మనిషో అర్థం గావటం లేదూ నీకు?"

"యెలాటి మనిషి అంటావ్?"

"యే వడ్డీ వ్యాపారం తిప్పేవాడో అయివుంటాడు. వాళ్ళకి వున్నన్ని తెలివి తేటలు, వాళ్ళు సంపాయించేంత డబ్బు యింకెవరు సంపాయిస్తారు?"

"పోని నీకెలాటివాడు కావాలో చెప్పు?"

"నేనసలు పెళ్ళిచేసుకుంటేగా!"

"యెప్పటికీ చేసుకోవా? ఖర్మ! మిస్సమ్మగా వుండిపోవాలనుకుంటున్నావా? యేం?"

"అదేంలేదు. యిప్పుడప్పుడే చేసుకోను."

"అలా చెప్పు. కాని నువ్వు చేసుకోవాలనే సరికి వయసు దాటిపోయి, మొహం ముడుతలు పడిపోయి అప్పుడు నువ్వు కావాలనుకున్నా యెవరూ నీ మొహం చూడరు. ఈ రోజుల్లో చాలామంది అమ్మాయిలకి జరుగుతోందే అది."

"జరిగితే జరిగింది లే! అదే మంచిది; యే ముక్కూ మొహం తెలియనివాడినో చేసుకుని- వాడితో పెళ్ళయిన మర్నాటినుంచి నానా బాధలూ పడుతూ క్షణం ఒక యుగంలా యీడ్చేకంటే—"

"పోనీ ముక్కూ మొహం తెలిసినవాడెవరైనా వుంటే చెప్పు. యుగాలు క్షణాలులా గడుపుదువుగాని —" అంది సునంద.

"ఏం? నువ్వెళ్ళి పెళ్ళిసంబంధం మాట్లాడ్తావా?"

"ఓ! తప్పకుండా! ఆయనదగ్గరకెళ్ళి ఓ మహానుభావా! నీ అదృష్టం యేమని కొనియాడవలెను! మా జయంతిలాంటి సౌందర్యవతి, సుగుణాలపుట్ట—నీకు భార్యగా దొరకబోతోంది అంటే—అది కేవలం—"

"నీ ఖర్మ. చావు–ఏడు–మొత్తుకో అంటావు–అంతేనా?" అందిజయంతి.

సునంద నవ్వింది. వెంటనే చెంపలేసుకుంటూ "రామరామ! అలా అంటానా? ఒకవేళ ఎప్పుడైనా నీ కాబోయే భర్త అలా అన్నాడంటే అతను ఒకటి పిచ్చివాడైనా అయి ఉండాలి. లేకపోతే రెండు–గుడ్డివాడైనా అయివుండాలి" అంది. "అప్పుడు నువ్వు నీ నుదురు బాదుకుని ఖర్మ–అనుకోవాలి–అంతే."

"సునందా ! నిజంగా సీరియస్‌గా చెబుతున్నా ! నే నిప్పు డప్పుడే పెళ్ళి చేసుకోను—చేసుకోను. ఒట్టు."

క్షణంసేపు సునంద జయంతిని పరీక్షగా చూసింది. ఆ వెంటనే కళ్ళు చంద్రంగా తిప్పుతూ "ఓ ! ఇప్పుడు అర్థమైందిలే ! అదా నీ ఉపోద్ఘాతం !" అంది.

"అంటే ?"

"ఏముంది. జీవితాంతం రాజశేఖరం సెక్రటరీగా ఉండిపోవాలి. అంతేనా ?"

"ఛి ! ఛి ! అదేంగాదు. నిజంగా చెబుతున్నాను సునందా! అదేంగాదు."

"అంత ఖంగారు దేనికి ?"

"ఖంగారుకాదు. మనం ఒక ఉద్దేశ్యంతో అనే మాటలకి ఇంకోవైపు నుంచి ఎదటివారు యెలాటి అర్థాలు తీయగలరా అని—"

"సర్లే ! లేకపోతే ఏమిటో చెప్పు మరి ?"

జయంతి దిగులుపడుతూ యేదో ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టి "ఖర్మ! యే దుర్ముహూర్తంలో యితనికి సెక్రటరీగా అడుగు పెట్టానోగాని— అంతా తారుమారై పోయింది. ఒక్కటి గూడా అనుకున్నది అనుకున్నట్టు జరగటంలేదు."

"యింకానయంగదూ! వెంటనే యితని దగ్గర జాబ్ దొరక్కపోతే నిన్ను వనితావిహార్‌వాళ్ళూ ఓ వూపు వూపకుండా వదిలేవాళ్ళా ?"

"అవుననుకో! కాని—యేమిటో— జీవితం యెక్కడో మలుపు తిరిగి పోయినట్టే అన్పిస్తోంది."

"ఆ మలుపు అందమైన దేనని నాకు గట్టి నమ్మకం." సునంద కొంటెగా నవ్వింది.

"నీ మొహం. అతను వూరునుంచి రాగానే మేం యింటికి వెళ్ళిపోతాం. ఆ తర్వాత అతనికీ మాకూ యే సంబంధం వుండదు. ఆ సంగతి నాకు తెలుసు—"

"నిన్నతను ముందు గడపదాటనిచ్చిన తర్వాతగదా! అవన్నీ—"

"అంటే నీవుద్దేశ్యం ? సునందా! అతని సెక్రటరీగా నేను రిజైన్ యిచ్చేశానన్న సంగతి నువ్వు మర్చిపోతున్నావు."

"నువ్విచ్చావు. నిజమే ! కాని అతను అంగీకరించిన సూచనలేవీ కన్పించటంలేదు నాకు—"

"అలాగే అనుకుంటూ వుండు. వూరునుంచి అతను రాగానే నే యింట్లో ఒక్కక్షణంవుంటే ఒట్టు. అప్పుడను."

"చూద్దాంగా !"

"చూడు."

"ఒకవేళ వుంటే ?"

"నాపేరు జయంతిగాదు."

"పోన్లే! జయ. జయలు. సరేనా! యింతకీ పుస్తకాలుయేవి ?"



"పుస్తకాలులేవు. గిస్తకాలులేవు. కావాలంటే పూలువున్నాయి. కోసి యిస్తానురా!" అంది జయంతి కోపంగా.

ఆగాత్రిపడుకోబోయేముందుబామ్మగారువికసించినమొహంతో "కామేశ్వరమ్మగారు చెప్పిన సంబంధం గనకే అయితే జయా! మన కష్టాలుతీరినట్టే. నువ్వు చాలా అదృష్టవంతురాలివి." అంది.

"నాఅదృష్టం యేమిటో నాకు బాగానేతెలుసు బామ్మా! ఒకళ్ళు నాకు చెప్పఖ్ఖర్లేదు" అంది జయంతి విసుగ్గా గోడవైపు తిరిగి పడుకుంటూ.

● ● ●

నాలుగు రోజుల తర్వాత ఓ రోజు సాయంత్రం, అప్పుడే శివరామ్ వచ్చి వెళ్ళిపోయాడు. జయంతి ముందు హాల్లో గూర్చుని పుస్తకాలు తిరగేస్తోంది. బామ్మగారు కూడా అక్కడే వుంది.

వాకిట్లో కారు చప్పుడు విన్పించింది.

"యెవరే వచ్చింది ?" అంది బామ్మగారు.

జయంతికి క్షణంసేపు గుండెలు కొట్టుకున్నాయి. ఆకారు చప్పుడు యెవరిదో తనకు స్పష్టంగా తెలుసు.

"అబ్బాయి కాదుగదా!" బామ్మగారు లేచివాకిట్లోకి వెళ్ళబోయింది. తనవూహ నిజమయింది. బామ్మకి గుమ్మంలోనే యెదురైనాడు శేఖరం.

"అరె! యేమిటి! అంత చిక్కి

పోయినావేం?" బామ్మగారు ఆత్రంగా అడిగింది.

జయంతి చటుక్కున తలెత్తి చూసింది. చూస్తూనే తెల్లబోయింది. శేఖరం చాలా చిక్కిపోయాడు. గడ్డం మాసివుంది. శరీరకాంతి మాసిపోయి-పాలిపోయినట్టుగా వుంది.

"అసలు నువ్వేనా? గుర్తుపట్టలేకుండావున్నాను!"

"జ్వరం వచ్చింది. వెళ్ళిన మర్నాడే ఒళ్ళు నొప్పులు అన్పించింది. సాయంత్రానికి ఒళ్ళు వెచ్చగా అన్పించింది. రెండురోజుల్లో తగ్గిపోతుందనుకున్నాను. తగ్గలేదు" అన్నాడతను. మనిషి ఎంత చిక్కిపోయాడో కంఠం అంత గంభీరంగా ఉంది.

"అయ్యో రామా! ఒక్క ఉత్తరం ముక్కైనా రాసిపడెయ్యరూ?"

"రాస్తే యేం చేస్తారు?" అంటూ పైకి వెళ్ళబోతూ ఒక్క నిమిషం జయంతిదగ్గిర ఆగి "నీ ఒంటో ఎలా ఉంది?" అన్నాడు.

"బాగానేవుంది" లోతుగా నూతులోంచి మాట్లాడుతున్నట్టు అంది.

అతను మరోమాట మాట్లాడకుండా పైకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి అతనిక క్రిందికి రాలేదు. బామ్మ చెప్పటంవల్ల తెలిసింది—బొంబాయిలో పాకిస్తాన్‌నుంచి వస్తున్న కాందిశీకులతోపాటు ఓ కొత్త జ్వరం దిగుమతి అయింది. ఒళ్ళంతా నొప్పులు, మర్నాటికి తీవ్రమైనజ్వరం, కాళ్ళు పట్టెయ్యటం—ఇదీ, దాని లక్షణం. డాక్టర్లకి దాన్ని యెలా ఆపాలో, రాకుండా ఎలా నిర్మూలించాలో యింకా తెలియటంలేదు. జ్వరంనుంచి తేరుకునేసరికి మనిషిని శరీరంలో యేకాస్త శక్తీ లేకుండా పీల్చేస్తోంది. రాజశేఖరం చాలా ఆరోగ్యవంతుడుకాబట్టి దాని తాకిడికి తట్టుకుని ఆమాత్రం నిలబడగలిగాడు. ఈ పరిస్థితుల్లో ఎలా వెళ్ళిపోతామని అడగటం! అసలు ముందు బామ్మ అంగీకరిస్తుందా! అది అనుమానమే! జయంతికి సునందతో తను అన్నమాటలు గుర్తుకొచ్చాయి. హు! మనిషికి తన ఆలోచనమీద తనకెంత నమ్మకం! కాలం అనేది ఒకటి వుందని, దానిచేతుల్లో, అది సృష్టించే పరిస్థితుల మధ్య తను కీలు బొమ్మనని మర్చిపోయి యిది చేస్తాను అది చేస్తాను అంటూ ఛాతీ విరుచుకు తిరుగుతాడు. చివరికి అది ముక్కుపట్టించినట్టు ఆడ్తాడు. ఈ సంగతి మనిషికి ప్రతిక్షణం యెందుకు గుర్తుండదో!

శేఖరం కోలుకోవటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. బామ్మ అతన్ని కంటికి రెప్పలా చూస్తోంది. ఈనాలుగైదు రోజుల్లోనూ తను ఒక్కసారి గూడా అతని దగ్గరకు వెళ్ళలేదు. వెళ్ళే అవసరం రావటంలేదు.

ఒకసారి బామ్మకి బదులు తను మంచి నీళ్ళు తీసుకెళ్ళింది.

"నువ్వెందుకు తెచ్చావు?" అన్నా

డతను మంచంమీద లేచి కూర్చుంటూ.

"తేకూడదా?" అని అడగాలనిపించినా అతని కంఠస్వరం ధోరణికి అడగలేక పోయింది. "బామ్మకినొప్పి వచ్చింది" అంది.

"సరే!" అన్నాడతను ప్రక్కనున్న పుస్తకంతీసి చూసుకుంటూ. జయంతి గ్లాసు తీసుకుని బైటకి వచ్చేసింది. ఎందుకోగాని అతని కంఠంలో నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది.

ఆసాయంత్రంవంటచేయాలనుకు సిద్ధమౌతుండగా యింతలో నాయర్ వచ్చాడు.

"నువ్వెందు కొచ్చావు?" అంది వెనక్కి తగ్గుతూ.

"అయ్యగారు కబురుచేశారు. మీరు లేవండి" అన్నాడు. జయంతి మౌనంగా బైటకి వచ్చేసింది. అంటే తను చేసిన వంట తినాల్సివస్తుందని భయమా అతనికి?

● ● ●

శేఖరం బాగా కోలుకున్నాడు. మామూలుగా యథాప్రకారం అతని పనులు జరిగిపోతున్నాయి. బామ్మగారికికూడా కులాసాగానే వుంది. కాని, నాయర్ మళ్ళీ తిరిగి వెళ్ళిపోలేదు.

ఓ రోజు సునంద వచ్చినప్పుడు "ఇంకా వున్నావేం? అతను వూరునుంచివచ్చి యిన్నిరోజులైతే" అంది నవ్వు దాచుకుంటూ.

"కళ్ళు కన్పించటంలా నీకు? అతనేపరిస్థితుల్లో తిరిగివచ్చాడు?" అంది జయంతి కోపంగా.

"కోపం దేనికి-పోన్లే-ఇప్పుడు నయమైందిగా!" అంది సునంద.

"అవును. ఇవాళో రేపో అడుగుతాను. ఎక్కడ చెప్పు? ఉదయం వెళ్ళి రాత్రికి వస్తున్నాడు. భోజనం గూడా నాయర్ ఆఫీసుకే తీసుకువెడ్తున్నాడు."

"నీ మనసులో ఉద్దేశ్యం కనిపెట్టాడులావుంది. అందుకే తప్పించుకుంటున్నాడేమో!"

"ఛీ!—ఛీ.—" అంది జయంతి. పైకి కాదని తీసేసినా లోపల్లోపల అదే నిజమేమో అన్పించసాగింది.

● ● ●

రెండు రోజులనుంచి పిశ్వప్రయత్నంచేస్తే మూడోరోజున శేఖరంతో మాట్లాడే అవకాశం కలిగింది జయంతికి. ఆ రోజు అదృష్టం. ఎందుకో! అతను రోజూలా త్వరగా వెళ్ళిపోలేదు. పదిగంటల వరకూ యింట్లోనే వున్నాడు. జయంతి 'వెళ్ళిపోతాం' అని చెప్పటానికి యిదే మంచి అవకాశం అని తోచింది. బామ్మ పూజగదిలో వుంది. గంటకిగాని బైటకిరాదు. నాయర్ వంటయింట్లోవున్నాడు. వాడు బజారుకి యేదోపనిమీద బైట కెళ్ళిపోయాడు.

శేఖరంకి తనకి యేదయినా వాగ్యుద్ధం జరిగితే స్త్రీఅరిది యెవరి చెవిన పడదు.

దొడ్లోవున్న పూలుకోసి దేవుడికి మాలగా గుచ్చటం జయంతి దిన చర్యలో ఓభాగం. ఈరోజు గూడా పళ్ళెంనిండా పూలు పోసుకుని గుచ్చుతోంది.

పూలపళ్లెం చేత్తో అలాగేపట్టుకుని మెట్లెక్కి పైకివచ్చింది. గదిలో అతను అద్దంముందు నిలబడి టై కట్టుకుంటున్నాడు.

జయంతి గదిలోకి రావటం యెదురుగుండా అద్దంలో నుంచి కన్పిస్తూనేవుంది.

గుమ్మంలోనే ఆగిపోయింది జయంతి. అతను ఆత్రంగా వెనక్కు తిరగలేదు. ఎందుకొచ్చావు అని అడగలేదు. నిదానంగా టైకట్టుకో సాగాడు.

వళ్లు మండిపోయింది జయంతికి. పళ్ళెంలో పూలుగుచ్చే సూది తీసి వెనకగా వెళ్ళి భుజంమీద గట్టిగా గుచ్చాలన్నంత కోపం వచ్చింది. అసలేమైంది యితనికి? ఇదివరకు శేఖరానికీ యితనికి యెక్కడన్నా పోలిక వుందా! బామ్మ తన మాటలకి లోబడిపోయింది. కాబట్టి యిక యీ యింట్లో వుండటం తప్ప యింకేం గత్యంతరం లేదునాకు అనే గర్వమా అది? అతను చూసి చూడనట్టు వూరుకున్నాడు.

"మీతో ఒకమాట చెప్పాలని వచ్చాను." అంది తనే యిక గత్యంతరంలేక.

"యేమిటది?" కంఠంతోపాటు ముఖంగూడా గంభీరంగావుంది. అతని స్వరానికి గతుక్కుమంటూ "మాయింటికి వెళ్ళిపోతాం" అంది.

"మీ బామ్మ ఒప్పుకుందా?"

"ఆవిడకేం అభ్యంతరంలేదు?"

"అది నీకు తెలుసా?"

"తెలుసు."

"అయితే యిక అభ్యంతరం యెవరికి మరి?" నిశ్చలంగా అన్నాడతను.

జయంతి చురుగ్గా చూసింది. "ఈ సాయంత్రం వెళ్ళిపోతాం అని చెప్పటానికి వచ్చాను."

"సరె!" ఈ మాటకోసమే అతనూ యెదురు చూస్తున్నట్టువుంది అతని ధోరణి.

వచ్చిన పని యింత సూటిగా సులభంగా అయిపోతుందని కల్లో గూడా అనుకోలేదు తను. తను యెంత మూర్ఖురాలు! సునంద మాటల్ని ఆధారంగా చేసుకుని యేవేవో ఆలోచించుకుంది. పోన్లే! యిప్పుడు దానికి తనేం బాధపడటం లేదు. యెలాగో యిక్కడనుంచి తను వెళ్లిపోవాలని అనుకుంటోంది. రాజశేఖరం అంత నిర్లక్ష్యంగా మాట్లాడకుండా వుంటే కాస్త తృప్తిగా వుండేది.

వెనక్కు తిరిగి వెళ్ళిపోబోతూ ఆగి "మీరు చేసిన సహాయానికి కృతజ్ఞురాల్ని." అంది.

"అది నీ మనసులో ఉంచుకుంటే చాలు. లేచినతర్వాత నేను యెంత మందికో ఎన్నిరకాలుగానో సాయం చేస్తుంటాను. నీనుంచి ఏదో ఆశిస్తూ యిదంతా చేశానని నువ్వు అనుకోకుండావుంటే నేనే నీకు కృతజ్ఞతలు తెలుపుకుంటాను."

నిరుత్తరైన జయంతి పెదవి కొరుక్కుంటూ క్షణంసేపు నిలబడిపోయింది. "సరే! వస్తాను" అంటూ గిరుక్కున తిరిగి వచ్చేసింది. వచ్చే ముందు క్షణంలో సగంసేపు ఎదురుగుండా అద్దంలో కన్పిస్తున్న అతని ప్రతిబింబంవైపు చూసింది—ఆ మొహంలోనూ, కళ్ళలోనూ, పెదవుల చివర చిరునవ్వు స్పష్టంగా కన్పిస్తోంది.

జయంతికి ఒంటినిండా తేళ్ళూ—జెర్రులు పాకినట్టు కంపరంగా అన్పించింది. ఎవరినుంచీ యే సహాయం తీసుకోగూడదు. జీవితంలో యీ అనుభవాల్ని మనసులో ఎర్ర అక్షరాలతో రాసుకుని వాటిక్రింద గీత గీసుకోవాలి. భరించాలక పరిస్థితులకి లోబడి లొంగిపోతే మనుష్యుల్లో యిలాటి దర్పమే వస్తుంది. పోనీ—ఎలాగైనా మాట్లాడనీ! సాయంత్రం వరకూ ఎందుకూ—ఇప్పుడే వెళ్ళిపోతే సరి—బామ్మతో యిలాఅన్నాడని చెబితే యేమంటుంది! పిచ్చిబామ్మ! చాదస్తపుబామ్మ! "నే వెళ్ళి అబ్బాయితో మాట్లాడ్తాను" అంటుందేమో! ప్రాణం పోయినాసరే ఆవిడకి ఆ అవకాశం యివ్వకూడదు.

జయంతి క్రిందికి దిగివచ్చి సరాసరి పూజగదివైపు నడిచింది. బామ్మ పూజలో వున్నాసరే—పిలిచి యీ విషయం చెప్పాలి. బామ్మ వచ్చిం తర్వాత రాజశేఖరంయింట్లో చాలా సంవత్సరాలనుంచి మూసివేయబడిన పూజగది తలుపులు తెరుచుకున్నాయి. దేవుళ్ళకి ప్రతిరోజూ నైవేద్యం దొరుకుతోంది.

"నాలుగురోజులుండి వెళ్ళేవాళ్ళకింకేమిటిదంతా బామ్మా?" అంటూ జయంతి ఒకసారి విసుక్కుంది.

"పోనేవే! యెన్నిరోజులుంటే అన్ని రోజులుకే! అబ్బాయి సంతోషించేడేగాని బాధపడ లేదుగా" అంది.

"బామ్మా!" పూజగది ముందుకు వస్తూ పిలిచింది జయంతి. లోపల్నుంచి ఆవిడ పలకలేదు.

"బామ్మా!" గుమ్మంలో నిలబడి యింకోసారి పిలిచింది. క్షణంసేపు వెలుగులోంచి వచ్చిన జయంతికి లోపల చీకటిగా కన్పించటంతో యేం తెలియలేదు.

"బామ్మా!" గది లోపలకి అడుగు పెట్టబోతూ హఠాత్తుగా ఆగిపోయింది. లోపల ఆవిడ ఓ ప్రక్కగా

ఒరిగిపోయింది. "అదేమిటి మళ్ళీ గుండెనొప్పి వచ్చిందా నీకు!" లోపలికి పరుగెత్తుకెడుతూ అంది. బామ్మగారు అప్పటికీ పలకలేదు. జయంతి చేతిలో పళ్ళెం క్రిందవదిలేస్తూ దగ్గర "కళ్ళే భుజంపట్టి మెల్లగా కదుపుతూ పలకవేం? డాక్టర్‌కి ఖబురు చెయ్యాలా" అంది.

అప్పటికీ ఆవిడ పలకలేదు. ఆవిడ ఒరిగిపోయినతీరు, ఆ మాట్లాడలేక పోవటం చాలా కొత్తగా అన్పిస్తోంది. ఈ సారి కొంచెం గట్టిగా పిలుస్తూ "బామ్మా! మాట్లాడూ!" అంటూ అరిచింది.

సమాధానం రానేలేదు.

"ఏమిటుది?" అవతల గదిలో వంటచేస్తున్న నాయర్ పరుగెత్తు కొచ్చాడు.

"మాట్లాడు బామ్మా!" బిగ్గరగా అరిచింది.

"ఏమిటీ నొప్పివచ్చిందా!"

"అవును. ఎంతపిల్చినా మాట్లాడటంలేదు. నువ్వు పిలిచి చూడు" అంది.

నాయర్ దగ్గరగా వచ్చాడు. వంగి ఒకసారి "బామ్మగారూ" అన్నాడు. జయంతి అతని వైపేచూడ సాగింది. నాయర్ వెంటనే "అయ్యగారున్నారా" అన్నాడు.

"ఆ!"

"ఉండండి. పిలుచుకొస్తాను." మరో మాటకి అవకాశం యివ్వకుండా నాయర్ బైటకి పరుగెత్తాడు.

జయంతికి తనకి తెలియకుండానే గుండెల నిండా దుఃఖం నిండిపోయింది. కళ్ళు చెమర్చాయి. ఆవిడమీదపడి బలమంతా వుపయోగించి కదుపుతూ "మాట్లాడు బామ్మా! కనీసం ఊ! అనైనా అను. భయంతో చచ్చిపోతున్నాను నేను" అంటూ యేడవసాగింది.

శేఖరం పరుగెత్తుకొచ్చాడు. అతని కాళ్ళకి బూట్లు వున్నాయి. ఇంకా కోటువేసుకోలేదు. ఇన్‌షర్ట్‌తో వున్నాడు.

"ఏమిటుది?" అన్నాడు బూటుతోనే లోపలికివచ్చేస్తూ.

"మాట్లాడటం లేదు" జయంతి యేడుస్తూనే శేఖరంవైపు చూడకుండా అంది.

"ఆగు నువ్వు జరుగు" అంటూ జయంతినిపక్కకులాగి మోకాళ్ళమీద కూర్చుని ఆవిడ చేతిని తనచేతిలోకి తీసుకుని నాడి చూశాడు. అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

ముఖంలో బాధని సూచించే భావంతో జయంతి వైపు ఓసారి చూసి వెంటనే నాయర్‌వైపు తిరిగి "నాయర్! డాక్టర్ పరాంజపేని అర్జంటుగా రమ్మన్నానని ఫోన్ చెయ్యి" అన్నాడు. నాయర్ పరుగెత్తాడు.

డాక్టరువచ్చేలోపల శేఖరం బామ్మగార్ని నాయర్ సహాయంతో తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టాడు.

"ఏమిటిది? ఏమైంది?" అంది జయంతి.




శేఖరం జయంతి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ మృదువుగా "ఏం లేదు. నువ్వు ఖంగారు పడకు" అన్నాడు. హఠాత్తుగా జరిగిన యీ హడావుడికి జయంతిబుర్ర బొత్తిగా మొద్దుబారిపోయినట్లే వుంది.

డాక్టర్ వచ్చాడు. వస్తూనే ఆవిడని పరీక్షచేసి "ఇదేమిటి? ప్రాణం పోయిందని యింత స్పష్టంగా తెలుస్తుంటే—" అన్నాడు శేఖరంవైపు చూస్తూ. కాని, శేఖరం డాక్టర్‌వైపు చూడటంలేదు. రెప్ప వాల్చకుండా జయంతిని పరీక్షగా చూస్తున్నాడు.

"ఏమిటి? ఏమిటి మీరనేది?" తడబడుతూ అంది జయంతి.

"ఆవిడ ప్రాణంపోయి అప్పుడే గంట అయింది" అన్నాడు డాక్టర్ జయంతినిచూస్తూ.

(సశేషం)



ఆదర్శాలూ అనుభవాలూ

రేణూ! నా మీద కోపం వచ్చింది కదూ! ఎన్నో ఉత్తరాలకి నీకు సమాధాన మివ్వలేదు. ఇచ్చే స్థితిలో లేను.

నువ్వన్నట్టే నీ దగ్గర దాచాను. పరిష్కారం తెలియక, ఎవరితోనూ గుండెలని దహిస్తున్న ఈ సమస్యకి చెప్పలేక నాలో నేను క్రుంగి పోయాను. ప్రాణానికి ప్రాణమైన నీకుకూడా యింతకాలంగా చెప్పనందుకు మన్నించు.

కన్నె మనసుతో, పరుగులు తీసే ఊహలతో, అందమైన కోరికలతో, భవిష్యత్తుపై కొండంత ఆశతో, ఊహాలోకాల్లో తేలిపోతూ, బంగారు కలలు కంటూ, అవే నిజమవుతాయని పూర్ణ విశ్వాసంతో వుండే అనుభవ రహితమైన సున్నితపు హృదయానికి ఆశలు అడియాసలుగా, బంగారు కలలు ఎండమావులుగా కనబడినపుడు–ఆ హృదయావేదన ఊహించుకోవలసిందే తప్ప చెపితే అర్థంకాదు.

నా ఆశలు, ఆశయాలు, కోరికలు, నన్నొక పరీక్షకి నిలబెట్టాయి. ఇదివరకటి ఉత్సాహం, మనో ధైర్యం, ఆత్మ విశ్వాసం ఎక్కడికి. జారిపోయాయో! నిరుత్సాహంగా నిరాశా నిస్పృహలతో దారి తెలియని బాటసారిలా ఒంటరిగా చీకటి దారిలో మిగిలి పోయాను.

నా ఆశయాలని నిజజీవితంలో ఆచరణలో పెట్టాలని ఆశపడ్డాను. "ఉద్రేకంతో ఉపన్యాసాలిచ్చి ప్రథమ బహుమతి పొందడం కాదు, ఇప్పుడెంతో ఉన్నతంగా కన్పడే ఆదర్శాలు, ఆశయాలు నిజజీవితంలో ఆచరించబోతే ఎన్నో అడ్డంకులు, అడుగడుగునా కంటకాలు ఎదురవుతాయి. జీవితం వేరు, ఆశయాలు వేరు, అనే దానివి. ఆనాడు ఒప్పుకోని నేను ఈనాడు అదే అనుభవంతో బాధ పడుతున్నాను.

ఒక రోజు ఒక అమ్మాయి నా దగ్గరకొచ్చి "మీరు కథలు వ్రాస్తుంటారా" అని అడిగింది. గుర్తుందా? నన్ను చూడగానే ఆమెకి అలా అనిపించిందని చెప్పింది. ఆ రోజంతా నువ్వు నన్ను ఏడిపిస్తూనే వున్నావు, నీకు తెలియకుండా నేను వ్రాస్తున్నానేమోనని. ఆనాడు వ్రాయలేదు. కానీ యిప్పుడు వ్రాస్తున్నానో కథ. కథలంటే కేవలం కల్పనలు కాదు. జీవితాలే కథలవుతాయని యిప్పుడు తెలుస్తోంది.

మా యిల్లు విడిగా పట్నపు హడావుడికి దూరంగా ప్రశాంతంగా వుంటుందికదూ. చిన్నప్పుడు నాకు ఆడుకోవడానికి ఎవరూ తోడువుండేవారుకారు. మా యింట్లో పనిచేసే కాంతమ్మ తన కొడుకు మధుని కూడా తీసుకువచ్చేది. కాంతమ్మ ఎంతో శుభ్రంగా వుండేది. మధు కూడా గొప్పింటి పిల్లవాడిలానే

యెర్నేని జయలక్ష్మి

ఉండేవాడు; అందానికీ, శుభ్రతకి. మగసంతానం లేని అమ్మ మధూ-నేనూ ఆడుకుంటూవుంటే ఎక్కువగా అభ్యంతరం పెట్టలేకపోయేది.

సాయంత్రం బడినుంచి కారులో రాగానే టిఫిన్ తిని మధుతో ఆడుకునేదాన్ని. మధు నాకంటే రెండేళ్లు పెద్ద. ఒకనాడు ఆడుకుంటూ ఆటలో నేను ఓడిపోయానన్న ఉక్రోషంతో "ఒరే మధుగా! నీతో ఆడను ఫో" అన్నాను. "పోవే రాధీ, నేనే ఆడుకుంటా" అన్నాడు మధు. అమ్మ వింది. ఆవిడ కోపానికి హద్దు లేకపోయింది. కాంతమ్మ పని వదిలిపెట్టి వచ్చి నాలుగు బాదింది. మధు ఎదురు తిరిగాడు. "రాధ నన్ను ఒరే అనలేదా? నే నంటే తప్పేమిటి? తనంటే అన్నానుకానీ, లేకపోతే నే నెప్పుడైనా అన్నానా?" అన్నాడు ఏడుస్తూ. అమ్మ నన్నుకూడా తిట్టింది. ఇంకెప్పుడూ వాడితోకలిసి ఆడకని చెప్పింది. కాంతమ్మ ఎదురు చెప్పాడన్న కోపంతో మరి నాలుగు కొట్టి బరబరా లాక్కెళ్ళిపోయింది యింటికి. ముందు నాకు సంతోషమే అయినా పాపం, మరీ అన్నిదెబ్బలు తిన్నాడే అని బాధపడ్డాను.

మధు మా యింటికి రావడం మానేశాడు. నాకేమీ తోచేదికాదు. నాలుగురోజులకే నాలుగు యుగాలయినట్టనిపించింది. అమ్మకి తెలియకుండా వాళ్ళ యింటి కెళ్ళి మధుని రమ్మని బ్రతిమలాడాను. "మీరు గొప్పింటివాళ్ళు. మేముతక్కువకులంవాళ్ళంఆడకూడదు. "పో"మ్మన్నాడు. నేను ఏడుస్తూ అక్కడే కూర్చున్నాను. కాంతమ్మ మధుని మందలించి నన్నెత్తుకుని తీసుకుని వచ్చింది. అప్పటినుంచి మే మెప్పుడూ పోట్లాడుకోలేదు. అమ్మ మధుకికూడా నాతోపాటు చిరుతిళ్ళు పెట్టేది.

మేము పెద్దవాళ్ళమయినా మా స్నేహం మాసిపోలేదు. మధు స్కాలర్‌షిప్‌లతో బి. ఏ. ఫైనల్‌కి వచ్చాడు. ఫీజులకి నాన్నగారుకూడా సహాయం చేస్తూండేవారు. నేను బి. ఏ. లో చేరటంతో తన నోట్సు నాకు యిస్తూ అర్థంకానివి చెబుతుండేవాడు.

చిన్నప్పటినుంచి నాకు బొమ్మలంటే పిచ్చి. ఏదైనా అందమైన చిత్రం కనపడితే అలానే చూస్తూండిపోయేదాన్ని. అంత అందంగా ఎలా వేయకలుగుతారా అని ఆశ్చర్యపోయేదాన్ని.

మొదటిసారి నా చిత్రమొకటి పత్రికలో పడగానే మీ రంతా మెచ్చుకున్నారు. పోయిన ఏడాది చిత్రలేఖనం పోటీలో నా చిత్రానికి మొదటిబహుమతి వచ్చింది. అందరి ప్రశంసలతోపాటు నువ్వూ-మధూ కూడా అభినందించారు. ఈ మధ్య నా చిత్రాలు కన్పడటంలేదని ఎందరో అభిమానుల ప్రశ్నలు. యథావిధిగా పంపవలసిందని సంపాదకుల కోరికలు. కాని ఎలా? ఆ శక్తి నశించింది. ఆ ఉత్సాహం పోయింది. ఆ రాధే

డు. ఈ రాధలో ఉత్సాహం,ఆసక్తి తగ్గి నిరాశా, నిస్పృహలు పేరుకున్నాయి. కారణం—ఇది పూర్తిగా చదివితే నీకే తెలుస్తుంది.

'రాజేష్' కథలని మనిద్దరం ఎంతగానో మెచ్చుకునేవాళ్ళం-గుర్తుందా? అతని కథలలో కొన్ని సన్నివేశాలు నన్ను కదల్చివేసేవి. హృదయానికి హత్తుకుపోయేవి. నాకు తెలియకుండానే అతన్ని ప్రేమించడం మొదలెట్టాను. ఆ ప్రేమ దాచుకోలేక అతనికి ఉత్తరాలు వ్రాసేదాన్ని. కానీ, నాకేనాడూ సమాధానం రాలేదు. నే నెంతగానో బాధపడేదాన్ని. నా ఊహలతో అతని చిత్రమొకటి గీసి దాన్నే ఆరాధిస్తూ అతని సమాధానం ఏనాటికైనా రాకపోతుందా అని ఆశతో నిరీక్షించేదాన్ని. అతను వివాహితుడేమో నని భయమేసేది. ఐతే ఒక్క సమాధానంతో నా ఆశల నింకా పెరగనీయకుండా, నా ప్రేమలతని అల్లుకునిపోనీకుండా చేయవచ్చుకదా" అని అనుకునేదాన్ని.

నా మనసు విప్పి అతనిముందు పెట్టేదాన్ని. నా కోరికలు, ఊహలు అన్నీ తెలిపేదాన్ని. అతన్నెంతగా ప్రేమిస్తున్నానో, అతని సమాధానంకోసం ఎంతగా నిరీక్షిస్తున్నానో వర్ణించేదాన్ని. కాని, ఫలితం—శూన్యం. విసిగెత్తి, బాధపడి ఒక నెలరోజులపాటు అతనికి ఉత్తరాలు రాయ్యలేదు. "నా సామికోసం ఎదురుచూస్తి" అనే నా చిత్రం పత్రికలో ప్రచురించిన కొద్దిరోజులకే అదే పేరుతో అతని కథ ఒకటి ప్రచురిత మయింది. నాకు చాలా ఆశ్చర్యం, సంతోషం కలిగాయి.

ఒక అందమైన ధనవంతులమ్మాయి మరొక అందమైన యువకుడిని ఏదో పార్టీసందర్భంలో చూసి ప్రేమిస్తుంది. వారి పరిచయం ప్రేమని తెలుపుకునే స్థితికి రాకుండానే అతను విదేశాలకెడతాడు. వెళ్ళేముందు ఆమెదగ్గరకొస్తాడు. కానీ, ఆమె తన ప్రేమని వ్యక్తపరచ లేకపోయింది. అతని దగ్గరనుండివచ్చిన లేఖ—అందులోని ప్రేమని చూసి ఆ అమ్మాయి ఎగిరి గంతేస్తుంది. చూపులతో మొదలైనఅనురాగానికి లేఖలు వారిమధ్య ప్రేమలతని బలంగా అల్లుతాయి. అతని రాకకోసం ఎంతగానో నిరీక్షిస్తూ తల్లీతండ్రులు చూసే సంబంధాలన్నీ తిప్పికొడుతుంది. అతను తిరిగి వస్తాడు. ఆ అమ్మాయి ఆనందానికి అవధులుండవు. తండ్రిని పంపుతుందతని దగ్గరికి. పెద్దలతో సంప్రతించి ముహూర్తం పెట్టుకురావడానికి వెళ్ళిన తండ్రి సింహ గర్జన చేస్తూ తిరిగి వస్తాడు. అతని కేమీ ఆస్తిపాస్తు లుండవు. అయినా తండ్రి అభ్యంతర పెట్టడు. కానీ కులభేదం అడ్డు వస్తుంది. అతని కులం సంఘ దృష్టిలో చాలా తక్కువది. ఇంకా వివరాలు ఆరా తీయగా ఆయన తండ్రి కాలంలో పనిచేసిన

పాలేరు కొడుకే అతనని తెలుస్తుంది. ఆ అమ్మాయి క్రుంగి పోయింది. తల్లి తండ్రులను కాదనలేదు. ఎదురు తిరిగినా, తమ పాలేరుకొడుకుని చేసుకోవడమా అని బాధ పడుతుంది. తన ప్రేమని చంపుకోలేదు. ఎటూ నిర్ణయించుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె తన స్వామి కోసం ఎదురు చూసిన సన్నివేశం, ఆ తర్వాత మరో లోకంలోవున్న తన స్వామి కోసం నిరీక్షించే ఆ అభాగిని ప్రేమ, పాఠకుల హృదయాన్ని కట్టివేస్తాయి. ఆకథ నన్నెంతగానో కదిలించింది.

ఆ కథే యింకోసారి చదివి నా రాజేష్ చిత్రాన్ని ముందు వేసుకుని కూర్చున్నాను. ఆ చిత్రంలో రాజేష్‌ని నిజంగా భ్రమించి తదేకంగా చూస్తూ నన్ను నేనే మరచి పోయాను.

"రాధీ!" మృదువుగా ఎవరో పిలిచినట్లుంది. నాస్వామి నన్ను కరుణించాడన్న భ్రాంతితో ఆ చిత్రాన్ని ముద్దెట్టుకున్నాను. సన్నగా నవ్వు వినపడి ఉలిక్కిపడి చూశాను. ఎదురుగా మధు! నాకు సిగ్గు, కోపం ముంచుకు వచ్చాయి. అతనుచూసి నాచేతిలో చిత్రం చనువుగా లాక్కున్నాడు. క్రింద నేను అందంగా "నారాజేష్" అనిచెక్కాను. అది చూసి కొద్దిగా తెల్లబోయాడు. నేనది లాక్కుని పారిపోయాను. కొద్ది సేపుండి ఎంత పిలిచినా నేను రాకపోవడంతో అమ్మతో, మాట్లాడి వెళ్ళిపోయాడు మధు.

అప్పటినుంచి మధుతో సరిగ్గా మాట్లాడలేక పోయేదాన్ని. ఒకనాడు నా చిత్రాల విమర్శతో ప్రారంభమై "రాజేష్" కథల ప్రస్తావన తెచ్చాడు మధు. అంతకు ముందు నేనెన్నో సార్లు అతని కథలని పొగిడేదాన్ని. మధు చిరునవ్వుతో వింటుండేవాడు. కాని, ఆనాడు అతని పేరైనా ఉచ్చరించ లేకపోయాను. మధు "నా సామి కోసం ఎదురు చూస్తి" ప్రస్తావన తెచ్చాడు. నేను ఆగలేక ముగింపు మరీ అన్యాయంగా వుందన్నాను. "కాదు. అది సహజమే. అంత గొప్పింటి బిడ్డ చూస్తూ చూస్తూ ఒక పాలేరు గుడిసెలో అడుగుపెట్ట లేదు" అన్నాడు మధు. నా కావాదన నచ్చలేదు. "ఆ అమ్మాయి ప్రేమ అంత గొప్పదైతే ఆమెకి అంతస్తులు అడ్డురావు. ఐనా ఆమె వెళ్ళి గుడిసెలో కాపుర చేయనవసరంలేదు కదా. తను వేరుగాభర్తతో సుఖంగా వుండేది. అనవసరంగా ప్రాణాలు తీసుకుని అవివేకంగా ప్రవర్తించింది" అన్నాను.

"రాజేష్‌ని ప్రేమిస్తున్నావా?" సూటిగా అడిగాడు మధు. నే నేమీ మాట్లాడలేకపోయాను.

"అతన్నెప్పుడైనా చూశావా?" అతని ప్రశ్నలకి నాకు కోపంవచ్చింది. కానీ, ఏమనలేక "లే"దన్నాను. "మరెలాప్రేమిస్తున్నా"వన్నాడు. "అతన్ని



చూడకపోయినా అతనెలా వుంటాడో ఎలా మాట్లాడతాడో, అతని భావాలేమిటో నాకు తెలుసు" అన్నాను. కొద్దిగా గర్వంగా, కోపంగా నవ్వి వెళ్ళిపోయాడు మధు.

మధు బి. ఎ. తో ఆపి ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళ నాన్నకు వచ్చేదీ, ఇతనికివచ్చే జీతంతో వాళ్ళకి హాయిగా గడిచిపోతుందని కాంతమ్మని బలవంతంగా మానిపించాడు మధు. ఐనా వాళ్ళిద్దరూ రాకపోకలు మానలేదు. ఏదో తెలియని అనుబంధం మా రెండుకుటుంబాలమధ్య పెనవేసుకునివుండేవి. మధు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే నాన్నగారు ఎంతో సంతోషించి, ఏ పెన్నో, బట్టలో కొనిపెట్టేవారు. నాకు కొద్దిగా జ్వరంవచ్చినా కాంతమ్మ ఖంగారుపడిపోయేది. మధు పెద్దవాడైనాక అమ్మ "ఒరే మధూ" అనటం మాని "మధూ" అనేది. "మధుగాడు" "అతను" అయ్యాడు. వాళ్ళు యిల్లు మారి మాకు కొద్దిగా దూరంగావున్న మంచియింట్లోకి వెళ్ళేరు.

ఒకనాడు పబ్లిక్ గార్డెన్స్‌లో మధు మరో అమ్మాయితో కూర్చుని ఉండటం చూశాను. నాకెలాగో అనిపించింది. మధు ఖంగారుపడటం చూసి నేను చూడనట్టు వెళ్ళిపోయాను. మరునాడే మధు వచ్చాడు. "కాంతమ్మ

నీకు త్వరలో పెళ్ళిచేయాలని వుందని అమ్మతో చెప్పిందట. జాగ్రత్తపడు" అన్నాను నవ్వుతూ. మధు అదోలా అయిపోయాడు.

"రాధా! నా మాట నమ్మాలి" అన్నాడు జాలిగా.

"ఏమని?" కొంటిగా అడిగాను.

"ఆ అమ్మాయి మా ఆఫీసులో పనిచేస్తోంది. నేను వ్రాసుకుంటూ వుంటే తనుచూసి అప్పుడే వచ్చింది—"

"నన్నూ అప్పుడే చూసి ఖంగారు పడిపోయావు నువ్వు. పానకంలో పుడకలా నేనెందుకని వచ్చేశాను. ఐనా రసభంగం చేస్తే పాపం చుట్టుకుంటుంది" అన్నాను నవ్వుతూ.

"అయితే నాకూ ఒకసారి చుట్టుకుంది" అన్నాడు మనసారా నవ్వుతూ. "ఎప్పుడూ?" అనబోయి నాలిక్కరుచుకుని కోపంగా చూశాను.

"అయిందా అమ్మాయిగారి పని. మరి కాస్త పూర్తిగావిను.

ఆవిడని నేనుకాని, నన్నావిడ కాని ప్రేమించలేదు. అసలా ప్రసక్తేలేదు. మా మధ్య. ఏవో తెలిసిన ముఖం కాబట్టి పలకరించింది. దాన్ని పట్టుకుని ఏవో ఆరాలుతీస్తున్నావ్ నువ్వు."

"ఉహుఁ నమ్మను" అన్నాను కొంటెగా నవ్వుతూ.

"నీ రాజేష్‌కి ఉత్తరం వ్రాస్తా" మెరిసే కళ్ళతో నవ్వుతూ బెదరించాడు మధు.

"ఆ రాజేష్ సంగతి నాదగ్గర తేకు" అన్నాను కళ్ళల్లో తిరుగుతున్న నుడులు కన్పడనీయకుండా ఎటో చూస్తూ.

మధు తెల్లబోయి చూశాడు. "అంత కోపం వచ్చిందా?" అన్నాడు నెమ్మదిగా నవ్వుతూ.

అప్రయత్నంగా నా కళ్ళనుండి అశ్రువులు జలజలా రాలి పడ్డాయి.

మధు అదిచూసి ఖంగారుపడ్డాడు. "అదేమిటి రాధా?" అంటూ దగ్గర కొచ్చి కన్నీరు తుడిచాడు. అంతలోనే ఏదో తప్పుచేసినవాడిలా వెనక్కి తగ్గాడు. నా కందులో తప్పేం కనిపించలేదు. చిన్నప్పటినుండీ కలసి మెలసి వున్నాం. మా మధ్యవున్న అనుబంధం అలాటి దనిపించింది. అంతవరకూ దాచుకున్న ఆవేదన అతని ముందు దాచలేకపోయాను. అంతా విని నిట్టూర్చాడు మధు.

"అతని కథలలో కులమత భేదాల ప్రసక్తి యెక్కువగా కన్పడుతోంది" అన్నాను. "నేను మా కటువంటి పట్టింపులు లేవని స్పష్టంగా ఎన్నోసార్లు వ్రాశాను. మా కులం వ్రాస్తూ అతనే కులంవాడైనా నాకేం అభ్యంతరం వుండదని వివరంగా వ్రాశాను" అన్నాను. అతనికి వివాహం అయిపోయిందేమోనన్న సందేహం, భయం, అవలేదనిపిస్తోందన్న ఆశా—రెండూ వెళ్ళగ్రక్కాను. తనకీ—వివాహం అయివుండదనే అనిపిస్తోందన్నాడు మధు.

రేణూ! నవ్వుతావుకదూ—కథలు చదివి యిలా ప్రేమించావని? కానీ, అసహజంగా, అసంభవంగా కన్పడేవే సహజమైసంభవమవుతుంటాయి కొన్నిసార్లు.

మధు ఏ సంబంధము యిష్టపడటంలేదని కాంతమ్మ గోలచేస్తూ చెప్పింది. నా వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో అనుకోకుండా నాకు ఉత్తరంవచ్చింది. ఆత్రుతతో విప్పాను.

"ప్రియమైన రాధీ!

ఎన్నాళ్ళకో నీకు సమాధానం యిస్తున్నందుకు మన్నించు. ఇన్నాళ్ళు ధైర్యం చేయలేక పోయాను. మన ప్రేమకి మధ్యగా ఎన్నో అడ్డుగోడలు లేస్తున్నాయి. పెద్ద అగాధానికి చెరోవైపు నిలబడి వున్నాం. అందుకే యింతకాలం నీకు లేఖ రాయడానికి, నా ప్రేమని చెప్పుకోడానికి సందేహించాను.

మన దేశం ఎంతగా అభివృద్ధి చెందినా, ఎన్ని అభ్యుదయ భావాలను నినాదం చేసినా మన సమాజంలో యింకా పాత సంప్రదాయాలు, ఆచారాలు తొలగి పోలేదు. ఉన్నత కుటుంబానికి చెందిన యువతికి, తక్కువ కులానికి చెందిన యువకుడికి మధ్య ప్రేమ ఎలాటి ఫలితమిస్తుందో ఊహించలేక పోతున్నాను. నువ్వు ఉన్నత వంశజవి కాకపోయినా, నే నీ కులంలో పుట్టక పోయినా మన మధ్య ఈ దూరం వుండేది కాదు. మన సమాజం ఆదర్శాలని వల్లెవేయ గలదుకానీ, ఆచరణలో సహించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రేమ ఏ విధంగా పరిణమిస్తుందో, ఎట్టి ఫలితమిస్తుందో?

నువ్వు "రాజేష్"ని ప్రేమించావు. నీకు సమాధానం రాలేదని విలపించావు. చివరికి విసిగెత్తి విరక్తితో అతని ప్రసక్తే తేవద్దన్నావు. నేనూ నిన్ను ప్రేమించాను. కాని అది ఎలావ్యక్తపరచను? అది నీ మీద ఎలాటి ప్రభావం కలిగిస్తుందోనని భయపడ్డాను. కానీ నువ్వు నా కథలని—మరోవిధంగా నన్ను, ప్రేమిస్తున్నావని తెలిసిననాడు నా ఆనందం వర్ణనాతీతం. కాని మరో సమస్య. నీకు "రాజేష్" ఎవరో తెలియదు. తెలిస్తే ఆ ప్రేమ నిలుస్తుందా?

నీ ఉత్తరాలు నన్ను కవ్వించేవి. నీ ప్రేమకి జోహార్లు అర్పించాను. ఆరాధించాను. కాని యింతకాలంగా నా ప్రేమని గుప్తంగా వుంచాను. గుండెల్లో దాచుకున్నాను. కానీ, యిలా ఎంతకాలం దాగుడుమూతలు ఆడను? అందుకే ధైర్యం చేసి నిజాన్ని బయటు పెడుతున్నాను. చెదరిన నా హృదయానికి "నా సామి కోసం ఎదురుచూస్తి" మీద నీవిమర్శ ధైర్యాన్నిచ్చింది, ప్రోత్సాహం పరిచింది. తన పాలేరు కొడుకుని చేసుకుని సుఖపడవచ్చన్న నువ్వు నీ పనిమనిషి కొడుకుని కూడా అదే ఉదారతతో ఆదరిస్తావన్న విశ్వాసం వుంది. ఇంకేం వ్రాయను? నీ సమాధానం కోసం పరితపిస్తూ— నీ

రాజేష్—మధు.

అ క్షణంలో నే నేస్థితిలోవున్నానో ఊహించుకోగలవు. నా మెదడు పని చేయటం మానివేసింది. తలుపులు వేసుకుని పడుకున్నాను. అమ్మ హడావిడిగా వచ్చి ముఖం కడుక్కొని పట్టు చీరకట్టుకోమంది. తెలివుండేచేశానో, ఎల్లా వెళ్ళి అతనిముందు కూర్చున్నానో నాన్నగారు అడిగినప్పుడు ఆలోచనా రహితంగా "సరే" అని ఎలాఅన్నానో నాకు తెలియదు. కాని జరిగిందేమిటంటే, నేను ఆ ఇంజనీరుగారికి నచ్చానుకాబట్టి ప్రదానం, ముహూర్తం పెట్టుకోవడం అన్నీ జరిగిపోయాయి. మరో పదిహేనురోజులలో నేను శ్రీమతిని కాబోతున్నాను.

ఆత్మద్రోహం చేసుకున్నా నంటావా? ఆదర్శాలని గొప్పలుచెప్పి ఆచరణలో పెట్టలేక పారిపోయిన పిరికి నంటావా? నా ప్రేమకి అర్థం లేదంటావా? లేక నాది పవిత్రమైన ప్రేమ కాదనీ, అయితే అంతస్థులు అడ్డువచ్చేవి కావంటావా? నీ రాధ బాధపడుతుందని నువ్వనకపోయినా నా మనసే నన్ను సవాలు చేస్తోంది.

అతని కథలోలాగా ముగింపుచేద్దామనుకున్నాను. కానీ, ఈ ప్రాణాలు అంత త్వరగాపోవు. ఈ రంపపుకోతను యిలా అనుభవించవలసివుండగా అప్పుడే ఎలా మరణిస్తాను.

అత నెన్నోవిధాల తన పరిస్థితి, మా ప్రేమ సఫలమవటానికి వున్న అభ్యంతరాలని ఎత్తి చూపించాడు. కాని, నేను సరిగ్గా అర్థంచేసుకోకుండానే నా ఆదర్శాలని వల్లించాను. అతడిని పరోక్షంగా రెచ్చగొట్టాను. అతని ప్రేమలతకి నీరుపోసి స్వయంగా పెంచి, యీ నాడు గొడ్డలితో సమూలంగా నరికివేశాను. నా కెవరిచ్చారీ అధికారం?

"ఒరేయి మధూ!" అన్న నాలుకతో "ఏమండీ" అనలేను. అమ్మా నాన్నలతో అనిపించలేను. ఐనా ప్రేమించింది రాజేష్‌ని, మధుని కాదనుకుంటాను నేను. కాదు—అంతరంగంలో మధుమీద అనురాగంవుంది కానీ, అంతస్తులభేదం గుర్తుకువచ్చి భయపడ్డావని—ఎదురుతిరుగుతోంది మనసు.

పెళ్ళిపనులకి కాంతమ్మని పిలిపించింది అమ్మ. మధుకి నా పెళ్ళికి ఉండటానికి వీలు లేదని వచ్చిన ట్రాన్స్‌ఫరుని తిట్టింది కాంతమ్మ. సెలవు పెట్టి వుండిపొమ్మని బలవంతం చేసింది అమ్మ. నాన్నగారు ట్రాన్స్‌ఫరుని మార్పించి తిరిగి యిక్కడికే వేయిస్తానన్నారు. ఆ క్షణంలో నా వైపు చూసిన చూపులకి అర్థం చెప్పలేను. కళ్ళల్లోని బాధ నన్ను శపించలేదు, నాశనం చేయలేదు. కనీసం నా మీద నాకు కోపమైనా రాలేదు. జాలిగా నవ్వుకున్నాను. ఎండి బీటలు బారిన హృదయం అంటే ఏమిటో, కఠిన పాషాణం అంటే ఏమిటో ఇప్పుడు నాకుబాగా తెలుసు.

పెళ్ళికి రావాలనిపిస్తే రా. ఇంతకంటె ఎలా ఆహ్వానించను? మరో విషయం. మధు వివాహం నిన్ననే అయింది. ఆత్మహత్య చేసుకోబోతున్న ఒక అనాథను రక్షించి దేవాలయంలో పెళ్ళాడాడట. నా ఆశయాలని, ఆదర్శాలని వెక్కిరించటానికేమో! ఇక వుంటాను,

రాధిక.

□□□

పరీక్ష

వడ గాడ్పులు చండ్ర నిప్పుల్ని తూర్పార పడుతున్నాయి. చెట్టూ చేమా నిశ్చలంగా వున్నాయి. నిప్పులు పరచినట్లున్న తారురోడ్లు శూన్యంగా వున్నాయి. ఆదివారం పూట, గాలి పారాడని యింట్లో వేసవి పెట్టే బాధ ఇబ్బడి ముబ్బడిగా వుంది.

"నమస్కారమండీ!" ఎండ యింట్లోకి రాకుండా వేసిన తలుపును తోసుకుంటూ ఒకతను లోపలికొచ్చాడు.

"రండి-కూర్చోండి" అన్నాను.

కూర్చున్నాడు.

"మీరు... ..." అతడు నా ప్రశ్నను వినటంలేదు. గోడకు వేలాడుతున్న నా పెళ్ళి ఫొటోను తదేకంగా చూస్తున్నాడు.

"మీ రెవరో చెప్పారు కారు! సభ్యంగా ధ్వనించే కంఠంతో ప్రశ్నించాను.

"ఒక బీద బ్రాహ్మణ్ణి" ఏదో ఆలోచనల్లోనుంచి మాట్లాడాడు.

ఎండకు మగ్గిపోయిన దేహచ్ఛాయ. ఈ బ్రతుకును నిరసించి ఎక్కడో చూస్తున్న కళ్ళు. రాలిపోయిన కనుబొమల క్రింద నిశ్చలమైన గాజు కళ్ళు. ఆలోచనతో తెరుచుకున్న నోట్లో అరిగి పోయిన పళ్ళు-కానీ ఏదో ఆకర్షణ... ... ఆమాట తెలుస్తూనే వుంది. కానీ అది గాను.

"ఏ పనిమీద వచ్చారు?"

"ఈ నెల పదిహేనో తారీఖున నా కూతురికి పెళ్ళి. బీదబ్రాహ్మణ్ణి. మీరే

దైనా కాస్త సాయం చేయాలి. కన్యాదాన ఫలం చాలా దొడ్డది...' వినయంతో నవ్వుతూ లగ్న పత్రికను తాంబూలంలో పెట్టి అందిచ్చాడు.

అందుకొని టేబిలు మీద పెట్టాను.

మళ్ళీ అతడు గోడకువేలాడుతున్న నా పెళ్ళిఫోటోను చూస్తూకూర్చు న్నాడు. ఇప్పుడతని వాలకం చూస్తే యిందాకా మాట్లాడిన వ్యక్తి యితడేనా అనిపిస్తుంది.

"అమ్మాయిని ఏ వూళ్ళో యిస్తున్నారు ?" అడిగాను. నాప్రశ్న అతడికి వినిపించలేదు.

"మన సీతారాముల కల్యాణము... ..." లోగొంతులో పాడుకుంటున్నాడు. చూపులు మాత్రం నిశ్చలంగా పెళ్ళి ఫోటో మీదే వున్నాయి.

"కుమార్తె పెళ్ళి మనసులో తిరుగుతున్నది కాబోలు" అనుకున్నాను.

రాయల సీమలో వర్షంలా వచ్చిన గాలి తెరకు పెళ్ళి పత్రిక ఎగిరి క్రింద పడింది... అప్పుడు అతనికి డబ్బివ్వాలన్న విషయం జ్ఞాపకం వచ్చింది. కానీ ఎంతివ్వాలో ... రూపాయో అర్ధో యిస్తే నొచ్చుకుంటాడేమో ! ఎక్కువ యివ్వటానికి ,నావద్ది లేదు. ఇంట్లోకెళ్ళి మా ఆవిడను అడిగాను. తనవద్దకూడా లేదన్నది. ఇక మరోదారి లేదు. ఎండలో అప్పుకోసం బయలుదేరవలసిందే !

అతడు ఫోటోను చేతికందుకొని కిటికీవద్దకు వెళ్ళి కళ్ళు చికిలించి చూస్తున్నాడు.

"అలా బజారుదాకా వెళ్ళొస్తాను. ఒక్క క్షణం కూర్చోండి" అన్నాను.

ఉలిక్కిపడి కనుబొమల ముడిలో నుంచి శూన్యంగా నా ముఖంలోకి చూశాడు.

"ఆలస్యం కాదులెండి" అంటూ బయటికి నడిచాను... ...


అప్పు దొరికేసరికి ఆలస్యమే జరిగింది. అరగంట తర్వాత చెమటతో దొప్పదోగుతూ యిల్లు చేరాను.

అతడు లేడు !

చుట్టూరా వెదికితే కనిపించలేదు! మా ఆవిడను అడిగితే తనకు తెలియదన్నది !

వీధిలోకెళ్ళి చుట్టుపట్ల వెదికాను. అతడు కనిపించలేదు. ఉసూరుమంటూ ఇంటికొచ్చేసరికి నా పెళ్ళిఫోటో కనిపించలేదు. మిట్టమధ్యాహ్నం

వల్లంపాటి వెంకటసుబ్బయ్య



ఇంద్రధనుస్సు కనిపించినంత ఆశ్చర్యపోయాను. అతనికి నా పెళ్ళిఫోటో దొంగిలించి పారిపోవాల్సిన అవసరమేమి కలిగింది ? అతడెవరు ? ఇంతకుముందు నాకెప్పుడూ పరిచితుడు కాడే ! మరి ఎవరు ? ?

మేఘంలేని వర్షంలా యెందుకొచ్చాడు ? అతనికి నా పెళ్ళి ఫోటోతోవున్న అవసరమేమిటి ? తేనెతుట్టెచుట్టూ తిరుగుతున్న తుమ్మెదల్లా వేయిప్రశ్నలు నా మెదడులో ఝుంకారం చేస్తున్నాయి. ఆలోచ

నలు ముందుకు సాగక, కుర్చీలో కూలబడ్డాను.

టేబిలుమీదున్న లగ్నపత్రికనన్ను వెక్కిరించింది!

చదివిచూచి ఆశ్చర్యపోయాను. ఆ లగ్నపత్రిక గతసంవత్సరం జరిగిపోయిన పెళ్ళికిసంబంధించింది. వధువు గాయత్రి, వరుడు నాగలింగశాస్త్రి. అమ్మాయి తండ్రిపేరు పున్నయ్యశాస్త్రి. మనస్సు తేలికపడింది. శంకామేఘాలు చెదరిపోయి నిర్మలమయింది... ...

రెండురోజులతర్వాత దీప దీపాలవేళ సూర్యనారాయణగారు పిలుస్తున్నారని జవాను వచ్చాడు. వారు పిలిచారంటే మన పనులన్నీ మూటకట్టిమూలపెట్టి బయలుదేరవలసిందే!

"అక్కడ ఎవరెవరున్నారు?" జవాన్ని అడిగాను.

"రోజూ వచ్చేవారు యెవరూ లేరండి. ఎవరో కొత్తమనిషి వుండాడు."

వాణ్ణడిగి లాభంలేదనుకొని నేనే బయలుదేరాను. సూర్యనారాయణగారివద్ద కెళ్ళటమంటే ఆ వూళ్ళోని కవితాపక్షుల కందరికీ చాలా సరదా. వారితో కూర్చొని గంటలతరబడి కాలక్షేపం చేయవచ్చు— మధ్యలో వేరుసెనక్కాయలూ, ఉప్పుసెనగలూ తింటూ.

నేను వెళ్ళేసరికి సూర్యనారాయణగారూ, పున్నయ్యశాస్త్రీ మౌనంగా కూర్చొని వున్నారు.

"రండిరండి. మీకోసమే ఎదురుచూస్తున్నాము. వీరి పేరు పున్నయ్యశాస్త్రిగారు. వీరిది తిరుపతి. ఈలోగా ఈవూరువచ్చారు. వీరుసంస్కృతంలో చక్కని కవి. వీరి కవిత్వం చదివించాలనుకున్నాను. మీరు లేకపోతే సభకు పరిపూర్ణత లేదుగా..." సూర్యనారాయణగారు నవ్వారు.

పున్నయ్యశాస్త్రి నా వైపు తిరిగి చూడనైనా లేదు!

"శాస్త్రిగారూ! చదువుతారా!" అన్నారు సూర్యనారాయణగారు.

"ఏమిటి?" చెట్టుమీద కూర్చున్న జంటపక్షుల్ని కిటికీలోనుంచీ చూస్తూ ప్రశ్నించాడు పున్నయ్యశాస్త్రి.

"అవే! మీ పద్యాలు."

"నా పద్యాలా?"

"ఆఁ... నేను తిరుపతిలోవున్న రోజుల్లో వినిపించేవారు చూడండి - అవి-దుర్గాసహస్రం లోనివి."

"ఓ! అవా?" నవ్వాడు పున్నయ్యశాస్త్రి.

"ఆఁ అవే. చదవండి."

"మర్చిపోయాను."

సూర్యనారాయణగారు దీనంగా నావైపు చూచారు.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చున్నాము. పున్నయ్యశాస్త్రి లేచి మెల్లిగా అడుగులేస్తూ గేటు దాటి వెళ్ళిపోయాడు.

"పాపం!" అన్నారు సూర్యనారాయణగారు.



"కాదండీ అదృష్టం. అతడు పడుతూ లేడుతూ ఏ గడియారమో వంకన పెట్టుకెళ్ళలేదు."

సూర్యనారాయణగారు ఆశ్చర్యంగా నా వైపు చూచారు. నేను జరిగిన సంగతంతా చెప్పాను. వారు అంతా విని ప్రశ్నించారు.

"వారిని మీరు దొంగనే అనుకుంటున్నారా?"

"మరేమనుకోమంటారు?"

"వారు దొంగ కారు. జీవితం కాటేసిన మనిషి. అతని జీవితం ఒక విషాదగీతం—ఆలపించమంటారా?" సూర్యనారాయణగారు స్వయానా మంచి కవి. అందువల్ల వారి మాటలు కూడా కవితామయంగా వుంటాయి"

సరే నన్నట్లు తల వూపాను.

"శాస్త్రిగారితో నాలుగు సంవత్సరాల క్రితం పరిచయం కలిగింది. వారిది సంపన్న కుటుంబం కాకపోయినా సాహిత్యమంతా వారి సంపదే. అందువల్ల వారితో నా పరిచయం ప్రగాఢమైపోయింది. రోజూ సాయంకాలం ఇద్దరూ కలుసుకొనే వాళ్ళం.

"వారి ఇల్లు తమాషాగా వుండేది. ఏవేళలో విన్నా ఎవరో శిష్యుడు శ్లోకాలు వల్లెవేస్తుండేవాడు. శాస్త్రిగారు పెద్దగొంతుతో పాఠం చెబుతుండేవారు. అప్పుడప్పుడూ వారి కూతురు కనిపించేది..."

"పేరు గాయత్రి కదండీ?"

సూర్యనారాయణగారి కళ్ళలో ఆశ్చర్యం ఒక క్షణం తళుక్కుమంది.

"ఔను. కనిపించి చిరునవ్వుతో నమస్కారంచేసి వెళ్ళిపోయేది. శాస్త్రిగారి శిష్యుల్లో భక్తవత్సలం అని ఒక అబ్బాయి వుండేవాడు. అతడు కాలేజీలో సంస్కృతం చదువుతూ శాస్త్రిగారి వద్దకు ట్యూష

నుకు వచ్చేవాడు. అతడంటే, శాస్త్రి గారికి పరమ వాత్సల్యం. ఇక గాయత్రి సంగతి సరేసరి! వారిద్దరూ ఒకర్నొకరు చూచుకున్నప్పుడు వారి కళ్ళలో తళుక్కుమనే ప్రేమను చూడాలి. అతనికు శాస్త్రి గారికికనిపించేది కాదనుకుంటాను.

"ఒక రోజు రాత్రి పదిగంటల సమయంలో గాయత్రి మాయింటికి పరుగెత్తుకొచ్చింది.

"ఏమిటమ్మాయ్ ఇంతరాత్రి పూట వచ్చావు?" అన్నాను.

"మీతో మాట్లాడాలి" అన్నది చుట్టూరాచూస్తూ.

"ఇక్కడ ఎవరూ లేరు. నిరభ్యంతరంగా మాట్లాడవచ్చు" అన్నాను.

గాయత్రి తలవంచుకొని కూర్చుంది. కానీ గొంతు విప్పలేదు.

"చెప్పు గాయత్రీ ఫరవాలేదు." అన్నాను.

"మా విషయం మానాన్నగారికి తెలిసి పోయింది" అంతకంటే ఎక్కువ చెప్పలేక పోయింది. వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఇక్కడ "మా" అన్న అక్షరం అర్థంకాక. ఒక్క క్షణం తికమక పడ్డాను" సూర్యనారాయణ గారు ఆగారు.

సూర్యనారాయణగారు చెబుతున్న పున్నయ్య శాస్త్రి జీవితం చాలా చిత్రంగా వుంది. అతనిది సందు బ్రతుకు. వెలుగు చీకట్లు తలంత్రాలు పోసుకున్న సాయంసంధ్య ... కానీ ఒక సందేహం కలిగింది.

"సూర్యనారాయణగారూ! గాయత్రి మీ ఇంటికి వచ్చిందన్నారే—ఆ అమ్మాయికి మీవద్ద అంత చనువెక్కడిదండీ?" ప్రశ్నించాను.

సిగరెట్టు ముట్టించుకోవటం పూర్తిచేసి సూర్యనారాయణగారు చెప్పసాగారు—

"అందుకొక కారణం వుంది. ఒక సారిఏదోసభకెళ్ళాలని నేనూమాశాస్త్రి గారూ నిశ్చయించుకున్నాం. కానీ నేను శాస్త్రిగారి ఇంటికెళ్ళేసరికి కాస్త ఆలస్యం జరిగింది. శాస్త్రిగారు సభకెళ్ళి పోయారు కాబోలు అనుకుంటూ వారి ఇంట్లోకి అడుగు పెట్టాను. ఒక్కసారిగా శరీరం జలదరించింది. భక్తవత్సలం శాస్త్రిగారి పడక కుర్చీలో పడుకొని వున్నాడు. గాయత్రి కుర్చీపట్టెమీద అతని మీదకు వంగికూర్చుని వుంది. గాయత్రికి హస్త సాముద్రికం చెబుతున్నాడు భక్తవత్సలం.

"అలాగైతే నాకు పెళ్ళి కాదంటారు?" అన్నది గాయత్రి.

"కాదు" అన్నాడు భక్త వత్సలం కృత్రిమ గాంభీర్యం నటిస్తూ.

"ఏలాగు దేవా! నా బ్రతుకు ఎడారియేనా? ఓ దేవా! దయామయా! భక్తవత్సలా నీవే దిక్కు."

గాయత్రి, భక్తవత్సలం భుజాల మీదకు వాలుతూ అన్నది.

"ఆ భక్త వత్సలుడే నీకు దిక్కు"

ఇద్దరూ నవ్వుకున్నారు. శబ్దార్థాల్లో వున్న వాళ్ళను చూస్తే ముచ్చటకలిగింది... చిన్నగా దగ్గాను. భక్తవత్సలం నన్నుచూచి అదిరిపోయాడు. పైటచెరుగుతో బుగ్గలు తుడుచుకుంటున్న గాయత్రిఅలాగే స్తంభించిపోయింది. తర్వాత శాస్త్రిగారితో చెప్పవద్దని బ్రతిమాలారు. నవ్వుతూ సరేనన్నాను. వీలుంటే ఆ మూడుముళ్ళూ వేయించేస్తానన్నాను. ఇద్దరూ నా పాదాలంటి నమస్కారం చేశారు. గాయత్రికి నా వద్ద అంత చనువు వుండటానికి ఇదీ కారణం... ... ...తర్వాత గాయత్రి అంత రాత్రిపూట నావద్దకు ఎందుకొచ్చిందో మీకు అర్థమయిందనుకుంటాను." ప్రశ్నించారు సూర్యనారాయణగారు.

"... ... ..."

"తర్వాత నేనేం చేశాననుకుంటున్నారు?" సిగరెట్టు చివరిదమ్ములాగి పారేస్తూ మళ్ళీ ప్రశ్నించారు.

"వీలుచూచుకొని ఆ మూడు ముళ్ళూ వేయించమని శాస్త్రిగారికి సలహా యిచ్చివుంటారు" అన్నాను.

"అలాగే చెప్పాను. ఆశ్చర్యం! వారుకూడా సరేనన్నారు. పదిరోజులు తిరక్కముందే లగ్నపత్రిక చేతికందింది. గాయత్రికి—భక్తవత్సలానికి కాళహస్తీశ్వరుని సన్నిధిలో వైశాఖ శుద్ధ పంచమి, మిథునలగ్న పుష్కరాంశమందు వివాహం... ... ఆ రోజు సాయంకాలం పున్నయ్య శాస్త్రిగారింటి కెళ్ళాను. శ్రీనాథుని సీసపద్యంలా ఎదురొచ్చిందిగాయత్రి. అనుతం నా కాళ్ళు తాకి నమస్కారం చేసింది.

"కల్యాణమస్తు" అన్నాను.

ఏదో చెప్పబోయి సిగ్గుతో వణికే పెదవులు యేం చెప్పాలనుకుంటున్నాయో నా కర్థమైంది.

"ఇందులో నేను చేసిందేముందమ్మా. అంతా మీ అదృష్టం" అన్నాను.

గాయత్రి సిగ్గుగా నవ్వింది.

"ఇంతకూ భార్యావత్సలుడేడీ?"

"పెళ్ళి ముగిసిందాకా ఈ ఛాయలకు రావద్దన్నారు నాన్నగారు" సిగ్గుతో కందిపోతున్న బుగ్గల్ని చెరుగుతో కప్పుకుంటూ అన్నది గాయత్రి... ...

పెళ్ళి రెండురోజు లుందనగా పిల్లను తీసుకెడుతూ మరొక్కసారి చెప్పిపోయారు శాస్త్రిగారు.

"పున్నయ్యశాస్త్రి జీవితంలో నిరంతరం ఓటమినే పొందుతున్నాడు. బంగారంలాంటి ఉద్యోగం నాశనం చేసుకున్నాడు. వలచివచ్చిన కవితను తిరస్కరించాడు. భార్యను చంపుకున్నాడు... ..."

"భార్యనా? ఎందుకూ?" సూర్యనారాయణగారికి అడ్డంతగులుతూ ప్రశ్నించాను.

"ఏదో మాటామాటా భార్యాభర్తలమధ్య పెరిగింది. అమాత్రానికే జందెం తెంపేసి వెళ్ళిపోయారు. ఆవిడ

వేచినన్నాళ్ళూ వేచి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటికి గాయత్రి చిన్నపిల్ల—వయస్సు నాలు గేళ్ళట" అన్నారు సూర్యనారాయణ గారు.

పున్నయ్యశాస్త్రిమీద ఇందాక కలిగిన సానుభూతి గాలి కెగిరిపోయింది. రోజూ తెలుగుపద్యం సౌందర్యం మొదలుకొని ఖగోళశాస్త్రం వరకూ అన్ని విషయాలనూ చక్కగా వివరించే సూర్యనారాయణగారు ఈ పున్నయ్య భాగోతంచదవటం నాకు విసుగేసింది. దానికితోడు రోళ్ళు బద్దలయ్యే వడ గాడ్పులు!

"వెళ్ళుతానండీ!" అన్నాను.

"అలాకాదు. తీరా వినిపోండి. జీవితం త్రాచుపాములాంటిది. మనము దాని జోలికి పోయి చెరలాటం ఆడేమా—కాటేస్తుంది. పున్నయ్య శాస్త్రిగారు ఆ పనే చేశారు... పెళ్ళి ముందురోజు కాళహస్తి వెళ్ళాను. అక్కడ భక్తవత్సలంగానీ, అతని స్నేహితులుగానీ కనిపించలేదు... గాయత్రికూడా కనిపించలేదు! శాస్త్రిగారుమాత్రం అదోరకంగా కనిపించారు. ఆ వాలకంచూస్తే ఎవరికైనా అనుమానం, భయం కలుగుతాయి. నన్నెవరూ అక్కడ ఆదరంగా పలకరించనైనాలేదు. అందరూ కొత్తమనుషులు. ఒక మూలకెళ్ళి పడుకున్నాను... ...గాలిలేనికొంపలావుంది మనస్సు... ...అర్ధరాత్రి దాటి వుండవచ్చు. అరుపులూ, పెడబొబ్బలూ చెలరేగాయి. గాభ్రాగా నిద్రలేచి విచారించాను. గాయత్రిబావిలోదూకిందట... నాశరీరం గంగజగజ లాడిపోయింది. భయంతో కాలూచెయ్యి ఆడలేదు. నాకు నాళ్ళు తెలిసే సరికి నలుగురూ సాయంపట్టి గాయత్రిని బావిలోనుండి పైకి తీశారు. ఎవరో ప్రథమ చికిత్స చేస్తున్నారు. ఎవరో ఒక యువకుడు—పున్నయ్యశాస్త్రిని నానా బూతులు తిడుతున్నాడు.

"ఎవరయ్యా నువ్వు—వారి నెందుకలా మాట్లాడతావు?" అని అడిగాను.

"నువ్వెవరోయ్ మధ్యన! నేనెవరో కనిపించటం లేదూ? పెళ్ళికొడుకుని" అన్నాడు నన్ను పురుగును చూచినట్లుగా చూస్తూ.

"పెళ్ళికొడుకా?" ఆశ్చర్య పోయాను.

"ఆశ్చర్యంగా వుందా. ఇదిగో" జేబులో నుంచి ఒక పెళ్ళి పత్రిక నా ముఖాన విసిరాడు.

పున్నయ్య శాస్త్రిగారిని చూచాను. నీరసమైన చెక్కిళ్ళ మీదికి కన్నీరు కారుతోంది. లగ్న పత్రికను చదివాను—

... ... చి॥ సౌ॥ గాయత్రిని—చి॥ నాగలింగ శాస్త్రికిచ్చి ... ...

భార్యతో పోట్లాడి పారిపోయిన పున్నయ్య శాస్త్రి తిరిగివచ్చింది ఇందుకోసమేనా అనిపించింది..." మనసు భారమై సూర్యనారాయణగారు కూడా మాట్లాడలేక పోయారు. నేనూ యిల్లు చేరాను... ...

కొద్దిరోజుల తర్వాత మళ్ళీ ఒకరోజు సూర్యనారాయణగారివద్ద కెళ్ళాను. షికారుకు వెళదామని ఇద్దరమూ చెరువుగట్టువైపుకు బయలుదేరాము. వారు శ్రీనాథుడు నెల్లూరివాడేనన్న విషయాన్నిగురించి గట్టిగా వాదిస్తూ నడుస్తున్నారు. ఒకచోట హఠాత్తుగా ఆగి అన్నారు.

"శాస్త్రిగారున్నారేమో చూద్దామా?"

నేను జవాబుచెప్పేలోగా వారు యిరుకుసందులోకి దారితీశారు... ఒక యింటిముందు ఆగి—

"శాస్త్రిగారూ!" అని పిలిచారు.

"లేరండీ—" అంటూనే తలుపు తీసిందొక అమ్మాయి. ఆవిడ మసిగుడ్డలో చుట్టిన మాణిక్యంలా వుంది.

"నాదొక పుస్తకం వుందమ్మా, తీసుకోవాలి" అన్నారు సూర్యనారాయణగారు.

"తీసుకోండి" అన్నది.

ఇద్దరమూ గదిలో కెళ్ళాము. గదినిండా ఎవరెవరివో పెళ్ళిఫొటోలు—మరికొన్ని పత్రికలలో అచ్చయిన వాటి కత్తిరింపులు.

సూర్యనారాయణగారు గూట్లో వున్న ఒక ఫొటో నందుకొని చూస్తూ మీ ఆవిడకు చాలా సిగ్గుగా వుందే—అన్నారు.

ఫొటోను తీసుకున్నాను.

సూర్యనారాయణగారు ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు.

"ఏమండీ! మీ పెళ్ళిఫొటో తప్పకుండా మీకు కావాలా?" ఫొటోను తిరిగి ఇచ్చేశాను.

"అమ్మాయి గాయత్రీ! ఈ ఫోటోను గూట్లో నే వుంచు." అన్నారు సూర్యనారాయణగారు.

గాయత్రి ఫొటోనూ, నన్నూ ఒక్కసారిచూచి కళ్ళు తుడుచుకుంది. మేమిద్దరమూ వెనుదిరిగాము. తలుపుకు లోపలి వైపుకు పూర్తిగా లగ్న పత్రికలు అతికించ బడివున్నాయి. వాటిలో ప్రతిదాంట్లోనూ "నాగలింగశాస్త్రి" అన్న పేరు కొట్టి "భక్తవత్సలం" అని వ్రాయబడింది.

నేనూ నూర్యనారాయణగారు వీధిలోకొచ్చాము. తలుపు కావేపు నుంచీ ఎక్కిళ్లు వినిపిస్తున్నాయి.

సూర్యనారాయణగారి వైపు ఏమిటున్నట్లు చూచాను.

"గాయత్రి ఏడుస్తున్నది" అన్నారు

"ఎందుకూ?"

నూర్యనారాయగారు నిశితంగా నావైపు ఒక్క చూపు చూచారు. కానీ జవాబు చెప్పలేదు.

□□□

శిఖరాలా సరిహద్దులా

(గతసంచిక తరువాయి)

8

గూడెంలో ఇళ్ళు వందకుమించి ఉండవు. కొండప్రదేశం కావటంవల్ల ఇళ్ళు ఒక వరుసలో, ఒక ఎత్తులో లేవు. ఎగుడు దిగుళ్ళుగా, చెల్లాచెదురుగా ఉన్నాయి. కొన్ని ఇళ్ళు గుట్టలమీద, కొన్ని పల్లంలో ఉన్నాయి. వాటిని కలుపుతూ చిన్న చిన్న కాలిబాటలే కాని, వీధులని చెప్పుకోతగ్గవేమీ లేవు. ఇళ్ళు అన్నీ చిన్న చిన్న పూరిళ్ళులాంటివే. గూడెంమధ్య జనం సమావేశమై లోకాభిరామాయణం చెప్పుకోడానికి వీలైన సమతలం కొంత వుంది. మేజర్, కెప్టెన్, లెఫ్టినెంట్ గూడాన్ని వింతగా చూస్తూ నడుస్తుంటే ప్రజలు గుడిసెల్లోంచి బయటకువచ్చి అభివాదాలు చేస్తున్నారు. శత్రువులనుంచి తమను రక్షించటానికి వచ్చిన దేవుళ్ళలాగా చూస్తున్నారు వీరిని.

సీరియల్

మేజర్, కెప్టెన్ ముందు నడుస్తుంటే లెఫ్టినెంట్ వెనకవుంది, కొత్తగా నేర్చుకున్న కొద్దిమాటలతో ప్రజలను పరామర్శిస్తున్నాడు. జేబులోంచి బిస్కట్లు తీసి, అక్కడి పిల్లలందరికీ పంచిపెట్టి మంచి చేసుకుంటున్నాడు. గూడెం నాయకుడు చిరునవ్వుతో ఎదురువచ్చి వీరిని తన ఇంటికి ఆహ్వానించాడు. నాయకుని కూతురు పదేళ్ళ పిల్ల నవ్వుతూ లెఫ్టినెంట్ చెయ్యి పట్టుకుని ఇంట్లోకి తీసుకువెళ్ళింది. మేజర్, కెప్టెన్ కూడా అనుసరించారు.

కెప్టెన్ ప్రసాద్ లోపలకు అడుగు పెట్టగానే తలుపుచాటునుంచి రెండు కళ్ళు మెరుపులా తళుక్కున మెరిసి మాయమైపోయాయి. ప్రసాద్ కు గబుక్కున ఏదో జ్ఞాపకంవచ్చి మరిచిపోయినట్లు అనిపించింది. మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకునే ప్రయత్నంలో పడిపోయాడు.

ఇల్లు కొంచెం పెద్దదే. మూడు నాలుగు గదులున్నాయి. మేజర్ రాయ్ ఇంటిని విచిత్రంగా చూస్తూ నిల్చున్నాడు. ప్రసాద్ పరధ్యానంలో ఉన్నాడు. లెఫ్టినెంట్ శివరామ్ వచ్చీరానిభాషలో పిల్లతో మాట్లాడుతున్నాడు. ఇంటియజమాని పక్కగదిలో ఉన్న ఎవరినో "సీమా" అని పిలిచి ఏదో చెప్పాడు. కొద్దిసేపటికి ఒక యువతి ఒక గిన్నె, నాలుగు చిన్న చిన్నపాత్రలు తీసుకుని అక్కడికి వచ్చింది. గిన్నెలోనుంచి ఏదో వేడి పానీయాన్ని పాత్రలలో పోసి, అందరికీ అందించింది. యజమాని ఆమెను వారికి పరిచయం చేస్తున్నట్లుగా చిరునవ్వుతో "సీమా" అని చెప్పాడు. ప్రసాద్ ఒక్కసారి తల ఎత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు. అవే కళ్ళు. మెరుపులా మెరిసినకళ్ళు. తనకేదో జ్ఞాపకం చేసిన కళ్ళు. ఆమె ఒక్కసారి అతనివంక చూసి, అతను తనను చూస్తున్నట్లు గ్రహించి, సిగ్గుతో తల దించుకుంది. ప్రసాద్ ఆమె రూపాన్ని ఆపాదమస్తకం చూశాడు. అదే రూపం—తనకు బైనాక్యులర్స్‌లో దర్శనమిచ్చిన రూపం. ఆ పాట పాడిన అమ్మాయి. ఆ రూపం ఎందుకో తనకు బాగా పరిచయమైనట్లు కనిపించింది. తమ ఇద్దరికీ పూర్వం ఎప్పుడో ఎంతో స్నేహం ఉన్నట్లూ ఇన్ని రోజులూ ఏదో విస్మృతి ఆవహించి ఈ రోజు తొలగిపోయినట్లూ అనిపించింది. ఆమెకు పద్ధెనిమిదేళ్ళు ఉంటాయి. కానీ, ఆమె ముఖం పసిపాపముఖంలా అమాయకంగా, ప్రశాంతంగా, నిర్మలంగా ఉంది. ఆమె కదలికల్లో ఏమీ తెలీని లేడిపిల్ల స్వభావం స్ఫురిస్తోంది.

పానీయం తాగటం కాగానే ఆమె పాత్రలు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళినవైపే చూస్తూ ఉండిపోయాడు ప్రసాద్. మేజర్ రాయ్ భుజం తట్టి హెచ్చరించటంతో ఉలిక్కిపడి మేలుకొన్నాడు. ముగ్గురూ యజమానివద్ద సెలవు తీసుకుని బయలుదేరారు. కొంతదూరం వెళ్ళి ప్రసాద్ వెనక్కి తిరిగి చూసేసరికి, మిలమిల మెరుస్తూ తనవంకే చూస్తున్న రెండు కళ్ళు గుమ్మంలో కనిపించాయి.

9

స్థావరానికి చేరే సరికి చీకటి పడిపోయింది. సైనికులు దీపాలు వెలిగించారు. ప్రసాద్ తన శిబిరానికి

నండూరి పార్థసారథి

వచ్చి చెల్లెలికి ఉత్తరం రాయటం ప్రారంభించాడు. ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని గురించి, మనుషులను గురించి, స్నేహితులను గురించివర్ణిస్తూ రాశాడు. ప్రసాద్ ప్రతి ఉత్తరంలోనూ ముఖ్యంగా మేజర్ రాయ్‌ని గురించి రాస్తాడు. అతనిపట్ల తనకు గల గౌరవాన్ని వ్యక్తం చేస్తాడు. ఒకసారి మేజర్ ఫొటోని కూడా చెల్లెలికి పంపించాడు. యుద్ధం ముగిసి బ్రతికి బైటపడితే తన చెల్లెలిని మేజర్‌కి ఇచ్చి పెళ్ళిచేయాలని అతని కోరిక. అందుకని మేజర్‌కి తన చెల్లెలి ఫొటోలు చూపిస్తూ, ఆమెను గురించి వర్ణిస్తూ ఉంటాడు. ఫొటోలద్వారా, వర్ణనల ద్వారానే వారిద్దరి మనస్సుల్లో స్నేహాన్ని నెలకొల్పాడు.

ఉత్తరంలో ఇక్కడి స్థావరం స్థితిగతులనూ, తన కొత్త అనుభవాలనూ వర్ణిస్తూ సీమా విషయం రాయాలా వద్దా, ఏం రాయాలి, ఎలా రాయాలి అనే ఆలోచనలో పడిపోయాడు. కలం ఆగిపోయింది.

రాత్రి పదిగంటలు దాటింది. సైనికులు నిద్రకు ఒరిగారు. డ్యూటీలో ఉన్నవాళ్ళు గస్తీ తిరుగుతున్నారు. ప్రసాద్ పడకమీద కళ్ళు మూసుకుని పడుకున్నాడు. మళ్ళీ మళ్ళీ ఆ అమ్మాయి రూపమే కనిపిస్తోంది. మనస్సునిండా 'సీమా సీమా' అనే పిలుపు ప్రతిధ్వనిస్తోంది. సుమ్మంలో నుంచుని తనవంక చూస్తున్న ఆమె చూపు ఎంతో గొప్ప అనుభవంగా అనిపించింది. ఆచూపులో వినయం, భక్తి, స్నేహం, దైన్యం ఉన్నాయి. ఆ చూపు సూటిగా తనహృదయంలోకి చొచ్చుకుపోయి ఏదో రహస్యం చెప్పినట్లు అనిపించింది. "ఎన్నో జన్మలుగా నువ్వు నాకు తెలుసు. నేనూ నీకు తెలుసు. ఈ జన్మలో ఇంతకాలానికి నిన్ను చూడగలిగాను. అయినా చూడగానే గుర్తించాను. నువ్వింకా నన్ను గుర్తించలేదా? నేనెవరో నీకు తెలీదా? ఇంకా ఆలోచిస్తూనే ఉన్నావా? నేను నేనేనని ఎలా నీతో చెప్పటం? నాకు నీభాష రాదుగా. అందుకే ఈ చూపుతోనే భాషిస్తున్నాను. పదిలంగా ఈ చూపును స్వీకరించు. నన్ను అర్థం చేసుకో" అని చెప్పినట్లుంది. ఆ చూపు తనను ఏదో పవిత్ర భావంతో పరవశింప చేస్తున్నది. ఆమె చూపులో జాలవాడే చల్లదనం ఉంది. ఆ చల్లదనం విశ్వమంతా ఆవరించుకుంది. ఆమె తనకు ఏమవుతుందో కొద్ది కొద్దిగా అర్థమవుతున్నది.

మనస్సులో ఎన్నెన్నో ఆలోచనలను మథిస్తున్నాడు, మథన పడుతున్నాడు. నిద్రరాదు. తాను యుద్ధరంగానికి పదిహేను మైళ్ళ దూరంలో పడుకున్నాడన్న భావం ఒకవైపు, ఇల్లు, తల్లి, చెల్లి, తండ్రి ఇంకొకవైపు, తనూ, తనబాధ్యతలూ ఒకవైపు, సీమాచూపు మరొకవైపు.

సరిగ్గా ఆసమయంలో మేజర్ రాయ్ కూడా సీమాను గురించే ఆలోచిస్తున్నాడు. ఆమెను చూడగానే అతనికి తన చెల్లి మళ్ళీ కనిపించినట్లయింది. చెల్లెలు అక్కడ అంతర్థానమై ఈగూడెంలో వెలిసినట్లు అనిపించింది. తన చెల్లికీ ఈమెకూ స్వరూపంలో పోలికలు లేకపోయినా, స్వభావంలో పోలికలు కనిపించాయి. నిజంగా ఆమె తన చెల్లెలయితే ఎంత బావుండును? గొప్ప రాజకుమారుణ్ణి తెచ్చి పెళ్ళి చేసేవాడు. ఎవరా రాజకుమారుడు? కెప్టెన్ ప్రసాదా? తన చెల్లెలు బతికే వుంటే దాదాపు సీమా వయస్సే ఉండేది. ఆమెను ప్రసాద్‌కు ఇచ్చి పెళ్ళిచేసేవాడు. కానీ ఆమె లేదు. సీమా ఉంది.

కొందరు వ్యక్తులను చూసినపుడు వాళ్ళని గురించి ఆలోచించకుండా ఉండటం అసంభవమనిపిస్తుంది. వారు మన మనస్సులో పదిలమైన చోటు సంపాదించుకుంటారు. అటువంటి వ్యక్తే సీమాకూడా.

10

తెల్లవారు ఝామున బ్యూగిల్స్ సంకేతంతో సైనికులంతా నిద్ర లేచారు. ప్రసాద్ ఆలోచనలను నిద్రవచ్చి తాను మేలుకొన్నాడు. కాలకృత్యాల అనంతరం పెరేడ్‌కి హాజరయాడు. రాత్రి యుద్ధరంగంలో మరణించినవారు, గాయపడ్డవారి సంఖ్యా వివరాలు మెసెంజర్ తీసుకువచ్చాడు. జాబితాలోని పేర్లు వరసగా చదివి వినిపించాడు మేజర్ రాయ్. వింటున్న సైనికుల ముఖాలు కొద్దికొద్దిగా వివర్ణమైనాయి. ప్రాణమిత్రులను కోల్పోయిన వారు మౌనంగా కన్నీరు కార్చారు. క్షణకాలం పాటు సైనికు లందరికీ భయం ఆవహించినట్లు అనిపించింది. కానీ ఎవరూ దానిని వ్యక్తం చేయలేదు. మరణాలను గురించి ఆ తర్వాత కూడా ఎవరూ చర్చించలేదు.

సూర్యోదయం వేళకు పోర్టర్లు యుద్ధరంగంనుంచి శవాలనూ, క్షతగాత్రులనూ మోసుకు వచ్చారు. మేజర్, కెప్టెన్ గాయపడ్డ వారందరినీ పరామర్శించారు. వైద్య శిబిరంలో డాక్టర్ చికిత్సలు ప్రారంభించాడు. రాజీ ఆయనకు సాయపడుతోంది. ఆమెపై డాక్టరుకు చాలా నమ్మకం కుదిరింది. నర్సు చేయవలసిన పనులన్నీ ఒక్కొక్కటే చాలా శ్రద్ధగా నేర్చుకుంటోంది. బాధ భరించలేక ఆక్రందనలు చేస్తున్న సైనికులకు ఎంతో దయగా సేవలు చేస్తున్నది.

క్రితంరాత్రి జరిగిన యుద్ధం విశేషాలు తెలుసుకునేందుకు సైనికులు క్షతగాత్రులచుట్టూ మూగుతున్నారు. వారు చైనా సైనికులు ఏవిధంగా దాడి చేశారో, ఎటువంటి వ్యూహాలు పన్నుతున్నారో చెబుతున్నారు. తాము పొందిన అనుభవాన్నిబట్టి, చైనా వారిని యెలా ప్రతిఘటించాలో హెచ్చరిస్తున్నారు. సైనికులు మళ్ళీ

ధైర్యాన్ని కూడదీసుకుంటున్నారు.

ముందు స్థావరాలలో మూడు రోజులపాటు పర్యవేక్షణచేసి కల్నల్ మహేశ్ తిరిగి వచ్చారు. ఆఫీసర్లందరినీ మళ్ళీ సమావేశపరిచి పరిస్థితి వివరించారు. గడచిన మూడు రోజుల అనుభవందృష్ట్యా ఈ రాత్రి దాడిని ఎలా ఎదుర్కోవలసి ఉంటుందో చెప్పారు. తన వ్యూహాన్ని తెలియజేశారు. ముందు స్థావరాలవద్ద కందకాలు తవ్వడానికి, ఇక్కడనుంచి అవసర వస్తువులను అక్కడకు మోసుకుపోవడానికి గూడెంమనుషులు కొందరు కావలసివుంటారనీ, వారిని సేకరించవలసిందనీ కెప్టెన్‌కు పురమాయించాడు. ఢిల్లీనుంచి, ఇతర కేంద్రాలనుంచి కొత్త వైద్యబృందాలు ఇక్కడికి చేరేవరకు క్షతగాత్రుల సేవకు మరికొందరు కుర్రవాళ్ళు అవసరమనికూడా చెప్పాడు.

రాజీకి, లెఫ్టినెంట్ శివరామ్‌కూ స్నేహం కలిసింది. తీరిక దొరికినప్పుడూ ఏకాంతం చిక్కినప్పుడూ అతను ఆమెను కలుసుకుంటున్నాడు. ఆమె వినయాన్నీ, స్నేహభావాన్నీ మెచ్చుకుంటూ,అందరూఆమెను ఎలా మెచ్చుకుంటున్నారో చెబుతూ పసివాడిలా ఆమె వెంట తిరిగేవాడు. ఆమె దగ్గర మోన్‌పా భాష నేర్చుకునేవాడు. తన విషయాలన్నీ ఆమెతో చెప్పుకునేవాడు. తన ఆశలు, కలలు, ఊహాలూ అన్నీ వర్ణించేవాడు. కెప్టెన్ ప్రసాద్ గురించి, కల్నల్ మహేశ్ గురించీ, దాడి నెదుర్కోడానికి చేసుకుంటున్న సన్నాహాలు గురించి, తన ధైర్య సాహసాలను గురించి సోదిగా చెప్పేవాడు. అతని మాటలపై ఆమె ఏమీ వ్యాఖ్యానాలు చేసేది కాదు. మౌనంగా విని ఊరుకునేది. తనను గురించి తను ఎప్పుడూ చెప్పుకునేది కాదు. అడిగినదానికి ముక్తసరిగా సమాధానం చెప్పి ఊరుకునేది.

శివరామ్ నిజంగానే ప్రేమలో పడిపోయాడు. కాని ప్రేమను అతను వ్యక్తం చేయలేదు. చేయడానికి అది సందర్భం కాదని అతనికి తెలుసు. మాటల్లో చెప్పకపోయినా, కన్నుల్లో ప్రేమ వ్యక్తమవుతూనే ఉంది. అతని ప్రేమ ఆమెకూ తెలుసు. అతనంటే ఆమెకు స్నేహభావం, ఆపేక్ష తప్ప ఏమీలేవు. అతను తనకంటే చాలా చిన్నవాడిలాగా కనిపిస్తాడు. అతని అమాయకత్వాన్ని చూస్తే ఆమెకు వాత్సల్య భావం కలుగుతుంది. పాపం పసివాడు ప్రేమలో పడ్డాడే అని జాలి కలుగుతుంది. అతను సోది చెబుతుంటే "నేనెవరినో నన్ను గురించి నీకు ఏమీ తెలీదుకదా. ఏదిపడితే అది ఇలా నాతో చెప్పవచ్చా. తప్పు కదూ" అని మధ్య మధ్య మందలిస్తూ ఉంటుంది. "నీతో కాకపోతే ఇంకెవరితో చెప్పుకుంటాను. నీకంటే మంచి స్నేహితులు నాకు ఎవరున్నారు. నీతో కాకపోతే

అసలు ఎవ్వరితోనూ మాట్లాడేవని లేదు నాకు" అంటాడు శివరామ్.

రాజీ నిరాడంబర స్వభావం, మితభాషిత్వం ఒక్క శివరామ్‌నే కాదు— స్థావరంలో అందరినీ ఆకర్షించింది. అందరికీ ఆమెపై గౌరవం కలిగింది. ముఖ్యంగా—ఆమె సేవలు పొందుతున్న క్షతగాత్రులకు ఆమె దేవతలా కనిపిస్తోంది.

11

సాయంత్రం రాజీవెంట కెప్టెన్, లెఫ్టినెంట్ గూడానికి వెళ్ళారు. గూడెం నాయకుని ఇంటికి వెళ్ళి, రాజీ సహాయంతో చెప్పవలసిన విషయాలన్నీ చెప్పారు. ముందు స్థావరాల వద్ద పనులకు కొందరు మనుషులను పంపించ వలసిందని కోరారు. నాయకుడు సరేనని మనుషుల కోసం కబురు పంపాడు.

మళ్ళీ తలుపు చాటునుంచి రెండు కళ్ళు తళుక్కు మన్నాయి. మళ్ళీ అదేచూపు, అదే భావం. ప్రసాద్‌ను పారవశ్యం ఆవహించుకుంది.అంతబీద దుస్తులలోనూ, అంత అమాయకత్వంలోనూ ఎంతో గాంభీర్యం, పవిత్రత, సంస్కారం ఆమెలో కనిపించాయి. తనకు ఎన్నో వేల మైళ్ళ దూరాన, ఎన్నో వేల అడుగుల ఎత్తున ఈ ప్రదేశంలో, ఈజాతిలో ఆమె పుట్టడం యెలా సంభవించిందా అని ఆశ్చర్యం కలిగింది. అసంకల్పితంగా తాను యింత దూరం ఆమెకోసం వెతుక్కుంటూ రావటం మరీ ఆశ్చర్యంగా ఉంది.

గూడెంలో పని ముగించుకుని తిరిగి వెళ్తుంటే దారిలో ఒక చిన్న గుట్టదగ్గర నుంచుని కనిపించింది సీమా. తనవెంట రమ్మని పిలిచినట్లుగా ఉంది ఆ చూపు. లెఫ్టినెంట్‌ని పంపేసి తను ఆమెను అనుసరించాడు. చీకటి పడుతోంది. గూడెంనుంచి చాలా దూరం నడిచారు.నిర్జనమైన ఆ ప్రదేశంలో ఆమె ముందు నడుస్తుంటే అతను వెనక అనుసరిస్తున్నాడు. మెలికల మెలికల దారివెంట, కొండల మధ్యనుంచి తీసుకువెడుతోంది. ఒక కొండవద్ద చిన్న గుహలాంటిచోటుకు రాగానే ఆగింది. అది గుహకాదు. ఒక పెద్ద కొండరాయి అర్ధచంద్రాకారంగా తొలిచి ఉంది. అక్కడకు వచ్చి చెకుముకురాయి కొట్టి ప్రమిద వెలిగించింది. అక్కడ ఏదో దేవత ఉంది. ఏం దేవతో తెలీలేదు కెప్టెన్‌కి. దూరంగా నుంచుని గమనిస్తున్నాడు. దగ్గరగా రమ్మని పిలిచింది సీమా. వెళ్ళాడు. దేవతముందు మోకరించమనీ, కళ్ళు మూసుకోమనీ సంజ్ఞలతో చెప్పింది. ఆమె ఆజ్ఞను శిరసావహించాడు. దేవత పాదాలదగ్గరనుంచి ఎర్రని బొట్టు తీసి అతని ముఖానికి పెట్టింది. ఆమె హస్తస్పర్శకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. ఆమె అలాగే అతని కళ్ళల్లోకి చూస్తోంది. "ఇప్పటికైనా నన్ను గుర్తించావా ?" అని ప్రశ్నించినట్టుగా వుంది ఆ చూపు.



ఆమెమీది భక్తితో, ప్రేమతో అతని కళ్ళు వెలుగుతున్నాయి. ఆపుకోలేని ఆవేశంవల్ల అతని కన్నులవెంట నీళ్ళు కారుతున్నాయి. ఆమె పాదాలమీద వాలాలని అనిపించింది. ఆమె అతని కన్నీళ్ళు మెల్లగా తుడిచివేసింది.

మళ్ళీ నడక ప్రారంభించింది. అతను అనుసరిస్తున్నాడు. మళ్ళీ అన్ని మెలికలూ తిప్పి గూడెం చేరువకు తీసుకు వచ్చింది. "ఇక నేను వెళతాను"అన్నట్టుగా చూసి ఇంటిదారి పట్టింది. ఆమెను చూస్తూ కొంతసేపు అక్కడే నుంచుని మళ్ళీ స్థావరానికి బయలుదేరాడు ప్రసాద్.

12

అర్ధరాత్రి సమయం. వెన్నెల విరగకాస్తోంది. వెన్నెల్లో హిమ శిఖరాలు వెండికొండల్లా తళతళ మెరుస్తున్నాయి. ప్రకృతి గంభీరంగా, మౌనంగా తపస్సు చేసుకుంటోంది. ఆకు కూడా అల్లల్లాడటం లేదు. నిశ్శబ్దంగా హిమవర్షం కురుస్తోంది. శిఖరాంచలాలపై మంచు దూదిపింజెలుగా పడి పేరుకుంటోంది. చెట్ల గూళ్ళల్లో పక్షులు వెచ్చగా అదమరిచి నిద్రిస్తున్నాయి. అది మొదటి స్థావరంవద్ద దృశ్యం.

ధ్యాననిమగ్నుడైన శంకరుని పై ఎవరో బాణం విసిరినట్లు శంకరుడు రుద్రుడై ప్రళయాన్ని సృష్టించినట్లు ఒక్కసారిగా అక్కడ వేలాది తుపాకులు భయంకరంగా ప్రేలాయి. కొండలు, లోయలు తుపాకుల శబ్దంతో మారుమ్రోగుతున్నాయి. ప్రకృతి గజగజ వణికిపోయింది. నిద్రపోతున్న పక్షి పిల్లలు ఒక్కసారిగా అదిరిపడితల్లిరెక్కల క్రిందకు దూరాయి. ఈ ప్రళయం ఇలా ఎందుకు ముంచుకు వచ్చిందో వాటికి తెలీదు. భారత చైనా వివాదం వాటికి తెలీదు. ఎన్నో సహాస్రాబ్దాలుగా ఇక్కడి పక్షిసంతతి ఈ శబ్దాలను వినలేదు.

బ్రెన్‌గన్‌ల గుండ్లు ఎడ తెరిపి లేకుండా వర్షిస్తున్నాయి. చెవులు చిల్లులుపడిపోయేటట్లు పెద్ద హోరు. బ్రెన్‌గన్ గుళ్ళ తాకిడికి కొండల మీది మంచు కరుళ్లు కరుళ్ళుగా రాలి పడుతోంది. డైనమైట్ ప్రేలుళ్ళతో కొండల కండలు విరిగిపడుతున్నాయి. తుపాకి దెబ్బతిన్న సైనికుని శరీరంనుంచి రక్తం కారినట్లు, డైనమైట్ దెబ్బ వేడికి కొండలమీది మంచు కరిగి కారుతోంది.

చైనా సేనలు అకస్మాత్తుగా, వెనకవాటుగా వచ్చిపడి ఈ బీభత్సాన్ని సృష్టించాయి. దాడిని ఊహించలేని భారత సేనలు ఆశ్చర్యంనుంచి తెప్పరిల్లేలోగానే చాలా నష్టం జరిగి పోయింది. భారత సైనికులు వీరోచితంగా పోరాడారు. ఒక్కొక్కరూ పదేసిమందిని చంపినా చైనామంద తరగలేదు. ఇక స్థావరాన్ని రక్షించటం సాధ్యం కాదని తెలిసి, దాన్ని శత్రువులకు దక్క నివ్వకుండా ధ్వంసంచేశారు. ఆరాత్రి యుద్ధంలో మామూలుగా కంటే ఎక్కువగా మన పక్షానికి నష్టం కలిగింది. మరణించినవారు కొద్దిమంద్దే అయినా, గాయపడ్డవారు చాలా మంది ఉన్నారు. కొందరు ఖైదీలుగా పట్టు

బడిపోయారు. మిగిలినవారు తప్పించుకుని వెనకనున్న రెండవ స్థావరానికి చేరుకున్నారు. నాటి యుద్ధంలో నేలకూలి, నడవలేని స్థితిలో ఉన్న భారత సైనికులను కొందరిని చైనావారు పట్టుకొని ఈడ్చుకు వెళ్ళారు. కొందరు చెట్ల మాటుకు పాక్కుంటూ వెళ్ళిప్రాణాలు కాపాడుకున్నారు. చనిపోయిన వారి నుంచి తుపాకులూ, దుస్తులూ కూడా ఊడపెరుక్కున్నారు చైనావారు.


13

కల్నల్ హడావుడిగా ముందు స్థావరాలకు సరఫరాలు పంపుతున్నాడు. తెల్లవారేసరికి ఢిల్లీ కేంద్ర కార్యాలయంనుంచి మళ్ళీవ్యానుల్లో ఆయుధాలూ, మందుగుండూ, ఇతర అవసరవస్తువులూ చేరాయి. స్థావరం అంతా అలజడిగా వుంది. మొదటి స్థావరంలో రాత్రి జరిగిన యుద్ధం తాలూకు వార్తలు మెసెంజర్ మోసుకువచ్చాడు. సైనికులంతా ఆందోళన పడుతున్నారు. కల్నల్ మాత్రం ఆందోళనను వ్యక్తంచెయ్యకుండా నిబ్బరంగా వుండి, అందరికీ ఉత్తర్వులు జారీచేస్తున్నాడు. ముందు స్థావరాలలో సన్నాహాలు పర్యవేక్షించడానికి మేజర్ రాయ్‌ని పంపించారు. రాత్రి యుద్ధంలో చనిపోయిన వారినీ,గాయపడ్డవారినీ స్ట్రెచర్లమీద తీసుకొస్తున్నారు పోర్టర్లు. వైద్యశిబిరంలో డాక్టర్‌కు పని చాలా ఎక్కువయింది. ఇతర నర్సులతోపాటు రాజీకూడా నిర్విరామంగా పనిచేస్తోంది. గాయపడ్డ సైనికు లందరినీ పరామర్శించి, ధైర్యం చెబుతున్నాడు కెప్టెన్ ప్రసాద్.

యుద్ధం మరింత తీవ్రమయిందనీ, శత్రువులు యింకా ముందుకు చొచ్చుకు వచ్చారనీ తెలిసేసరికి గూడెంలోకూడా అలజడి పెరిగింది. గూడెంలో ప్రజలందరూ భారతసేనలకు సహాయంచేసే పనుల్లోనే వున్నారు. యువకులంతా స్థావరాల వద్ద పనులు చేస్తున్నారు. స్త్రీలూ, వృద్ధులూ ఇళ్ళల్లోనేవుండి సైనికుల కోసం ఉన్నితో దుప్పట్లూ, టోపీలూ తయారుచేస్తున్నారు.

14

స్థావరంలో ఒకవరండా చివర లెఫ్టినెంట్, రాజీ ఒంటరిగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. క్రితం రాత్రి జరిగిన యుద్ధంలో భారతసేనకు చాలా నష్టం కలిగిందనీ, వ్యూహం విఫలమైనందుకు ఆఫీసర్లంతా ఆందోళనగాఉన్నారనీ, చెబుతున్నాడు శివరామ్. రాజీ మౌనంగా ఎటో చూస్తూ వింటోంది. ఇంతలో ఏదో పనిమీద అక్కడకు వచ్చిన కెప్టెన్ వీరిని చూశాడు. ఆమె తొట్రుపాటుతో లేచి వెళ్ళిపోయింది. తనవల్ల ఆ జంట విడిపోయినందుకు నొచ్చుకుంటూ "సారీ లెఫ్టినెంట్



అన్నాడు ప్రసాద్. శివరామ్ కొంచెం సిగ్గుపడ్డాడు. తనూ అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు.

రాజీ స్థావరంనుంచి తిన్నగా గూడెంలోని తన గుడిసెకు వచ్చింది. అప్పటికి బాగా చీకటి పడింది. దీపం వెలిగించి, ఒక కాగితం మీద ఏదో రాసి, జాగ్రత్తగా మడతపెట్టి జాకెట్‌లో దాచింది. మళ్ళీ దీపం ఆర్పి, తలుపులు వేసి బయలుదేరింది. అడవిలో కొండలమధ్యనుంచి నడుస్తోంది. కొద్ది కొద్దిగా వెన్నెల వస్తోంది. చెట్లకొమ్మల సందునుంచి వెన్నెల పొడలు పొడలుగా పడుతోంది. నిర్జనంగా, నిశ్శబ్దంగా ఉంది అడివి. రాజీ చెట్ల నీడల్లోంచి నడుస్తోంది. వొంక తిరుగుళ్ళుగా ఉన్న ఇరుకు దారుల వెంట నడిచి నడిచి ఒక చోటికి వచ్చి ఆగింది. ఆ ప్రదేశం గూడానికి నాలుగైదు మైళ్ళు దూరంలో వుంది. రాజీ ఒక్కసారి చుట్టూచూసింది. ఎవ్వరూ లేరు. అక్కడ ఒకరాయిమీదకూర్చుని ఎవరికోసమో నిరీక్షిస్తోంది. కాసేపటికి ఒక బొచ్చుకుక్క తోక ఆడించుకుంటూ వచ్చి ఆమె దగ్గర నిలబడింది. రాజీ మళ్ళీ ఒకసారి చుట్టూ చూసి, జాకెట్‌లోంచి కాగితం తీసింది. దానిని సన్నగా చుట్టి, కుక్క మెడలో పటకాకి ఉన్న చిన్నగొట్టంలో దూర్చింది. కుక్కని ఒకసారి ప్రేమగా దువ్వి, ఏదోసంజ్ఞచేసి పంపేసింది. కుక్క వెళ్ళిపోయింది. ఆమె ఆలోచనలోపడి కాసేపు అక్కడే కూర్చుండిపోయింది. తర్వాత నెమ్మదిగా లేచి, నీరసంగా


అడుగులు వేసుకుంటూ గూడానికి నడక సాగించింది.

ఊరి బయట దేవతకు పూజ చేస్తూ సీమా కనిపించింది. అక్కడ అంతా చీకటిగా ఉంది. ప్రమిద వెలుగులో సీమాముఖం మాత్రం కనిపిస్తోంది. ఆమె కన్నులు మూసుకుని ఉంది. రాజీ నిశ్శబ్దంగా అక్కడకు వెళ్ళి ఒక పక్కగా చీకటిలో నుంచుంది. సీమా కన్నుల వెంట నీరు కారుతోంది. ధర్మం జయించేటట్లు చేయమనీ, తన ప్రసాద్‌కు ఏ ఆపదా రాకుండా చూడమనీ ఆమె దేవతను ప్రార్థిస్తోంది. సీమా ప్రార్థనలు విన్న రాజీ తలవంచుకుని నిశ్శబ్దంగా తన ఇంటికి నడిచి వెళ్ళిపోయింది.

సీమా అక్కడ నుంచి స్థావరానికి బయలు దేరింది. స్థావరం వెలుపల ఒంటరిగా ఏదో ఆలోచిస్తూ నిల్చున్న కెప్టెన్ ప్రసాద్ సీమానుచూసి చకితుడయ్యాడు. ఆవేళప్పుడు ఆమె అక్కడకు రావలసిన అవసరం ఏమిటో అతను ఊహించ లేక పోయాడు. తన వెంట రమ్మన్నట్టుగా చూసి ఆమె ముందు నడిచింది. అతను అనుసరించాడు. ఇద్దరూ వెన్నెలలో ఒక రాయి మీద కూర్చున్నారు. దేవత పాదాల దగ్గర్నుంచి తెచ్చిన బొట్టుతీసి అతని ముఖానికి పెట్టింది. "ఇందు కోసమే వచ్చాను" అన్నట్లుగా అతని కళ్ళలోకి చూసింది. ఇద్దరూ మౌనంగా అలా చాలా సేపు కూర్చున్నారు. మౌనభాషలోనే ఏవో మాట్లాడుకున్నారు. "ఈ రోజు నా కోసం నువ్వు రాలేదు. అందుకోసం నేనే వచ్చాను నీ దగ్గరికి" అని చెప్పింది ఆమె. కొంతసేపయాక "ఇక వెళతాను" అన్నట్లు చూసి లేచింది. అతనూ లేచాడు. చేతిలో చేయి వేయమని చెయ్యి చాపింది. అతను చేతిలో చేయి వేశాడు. "ఇక మనకు వివాహం అయిపోయింది. మనల్ని ఎవ్వరూ విడదీయలేరు. జన్మ జన్మలకి ఇద్దరం ఒక్కటి" అన్నభావం ఆ క్షణం ఇద్దరిహృదయాలలో స్పందించింది.

సీమా మెల్లగా నడిచి చెట్లనీడల చీకటిలో కలిసిపోయింది. కాసేపటికి తేరుకున్నాడు కెప్టెన్. కల తొలగినట్లు, నిద్ర మేలుకొన్నట్లు అనిపించింది. ఇప్పుడు జరిగినదంతా, తను పొందిన అనుభవమంతా నిజమేనా కేవలం కలేనా అని సందేహం కలిగింది. అసలు మొదటినుంచీ తనూ ఆమె కలుసుకున్న సంఘటనలన్నీ కలల్లాగానే కనిపించాయి. వాస్తవానికి చాలా దూరంగా కనిపించాయి. కానీ, ఒక్కొక్కప్పుడు కల్పనకంటే వాస్తవమే విడూరంగా ఉంటుందన్న మాట జ్ఞాపకంవచ్చింది. శిబిరానికి వచ్చి అద్దంలో చూసుకుంటే సీమా పెట్టిన బొట్టు నుదుట మెరుస్తూ కనిపించింది. మనస్సు చేసిన కల్పన కాదు, నిజమే అనడానికి అది నిదర్శనంగా కనిపించింది.

(సశేషం)



నాటిక

భర్త మార్కండేయ

బి. వి. రమణారావు

1 వ రంగం

[తెర తీసేటప్పటికి రంగస్థలం ఖాళీగా వుంటుంది. రంగస్థలం ఓ వీధి. తెర వెనకనుంచి, అంటే ఓ యింట్లోనుంచి హనుమంతరావు, అతని భార్య మధ్య జరిగే సంభాషణ వినబడుతూ వుంటుంది.]

హ. భా— ఎంతసేపూ మీ స్నేహితులూ, మీ క్లబ్బూ, మీ పేకాట, మీసరదా లేకాని, ఓ రోజు కాపోతే ఓ రోజయినా యింట్లో ఏం కావాలో కనుక్కొడం వుంటేనా!

హ— ఓ! అదా! ఏం కావాలి?

హ. భా— ఏం కావాలేమిటండి! నా మొహం! ఎన్నిసార్లు చెప్పమంటారు! ఇంట్లో సరుకులు నిండుకున్నాయని చెప్పి వారం రోజులయింది.

హ— అలాగే.

హ. భా— కుర్రదానికి డాక్టరు రాసిచ్చిన మందు చీటీ అలాగే పడుంది. దానికి రోగం తగ్గిలోగా మందింటికి వచ్చేదారి కనపడదాయె!

హ— అలాగే.


హ. భా— చంటాడికి వొచ్చే మంగళారం పుట్టినరోజు. ఓ చొక్కాగుడ్డ కొని పడెయ్యమంటే వినిపించుకోరు కదా!

హ— అలాగే.

హ. భా— అన్నింటికి అలాగే అంటే ఎలాగండి!

హ— ఏం చెయ్యమంటావ్ ?

హ. భా— ఏంచెయ్య మంటా



వనకపోతే ఈపూట శలవు కదా, బజారుకెళ్ళి రాకూడదూ చెప్పండి.

హా— ఓ! అదా! ఇదుగో ఇప్పుడే (అంటూ రంగస్థలం మీదకి ప్రవేశిస్తూ, అంతకి ముందే వచ్చి, ఈ సంభాషణ పొంచి వింటున్న కుటుంబరావునుచూసి) ఎంత సేప యిందిరా వచ్చి,?

కు— ఇప్పుడే. ఇంట్లో ఏమిట్రా గందరగోళం!

హా— నిలయ విద్వాంసుల వాద్య సమ్మేళనం.

కు— ఎవరిమీదరా మీ ఆవిడలా విరుచుకు పడుతుంది!

హా— పై వాళ్ళెవరి మీదా కాదు. నామీదే. కొత్తేమీలేదు. పరిపాటే. పొద్దున్నే దాసీ మనిషి మీద మాఆవిడ ఏకధాటిగా వర్షించే తిట్లతోటి నాకు మెలుకువొస్తుంది. తర్వాత పాలవాడు నీళ్ళ పాలు పోస్తున్నాడని చేసే ప్రళయ తాండవంతాలూకు సప్తస్వరాలతోటీ మత్తు వొదుల్తుంది. ఆపైన మాఅమ్మాయి టూత్‌పేస్టు ఐస్క్రీంలాగ తినేసినందుకో, లేకపోతే ఫ్లాస్కుగ్లాసు తన్నేసినందుకో, దెబ్బలుతిని జేర్ మంటూ నాదగ్గిరికి రాగానే ఒళ్ళు విరుచుకు లేస్తాను. ఇంతట్లోకే వొంటింట్లోంచి 'అర్ధరాత్రయితేనే కాని యిల్లు జ్ఞాపకంరాదు, తొమ్మిదయితే కాని తెల్లారదు. చూడు నాన్నగారు లేచి మొహం కడుక్కున్నారేమో'అన్నమాఆవిడ కేకవినపడగానే పళ్ళు తోముకోవాలన్న విషయం జ్ఞాపకమొస్తోంది. ఇప్పుడు నువ్వు విన్నావుచూడు. ఇది రోజూ ఆఫీసుకు బయలుదేరే టైములో జరిగేవీడ్కోలు కార్యక్రమమన్నమాట.

కు—బాగుందిరా బ్రదర్. నవరసభరితంగా వుంది నీసంసార జీవితం. ఒద్దురా బాబూ పెళ్ళిచేసుకోవద్దురా అని తల మొత్తుకు చెబితే విన్నావూ! అయితే యిప్పుడు గతితప్పిన గ్రహం లాగా బజారమ్మట పడిపోయి మీ ఆవిడ చెప్పినవన్నీ కొనుక్కురావడానికి పోతున్నావన్నమాట!

హా— చూడు, మా ఆవిడచెప్పిన పనులన్నీ చేసేస్తే రేపట్నుంచి నా సంసారజీవితం యెంత పేలవంగా వుంటుందో ఆలోచించు. అసలు తెంపోయే పోతుంది. ఈ పనన్నీ చెయ్యకపోవడమే నాకూ ఘంసారానికీ బంధం. ఈ బంధం తెగిపోకుండావుండటానికైనా ఈ పనన్నీ చెయ్యకపోవడం నా విధి. ఇంతకీ ఇంత పొద్దున్నే తగులడ్డావు, ఏమిటి విశేషం!

కు— మన మార్కండేయుడి సంగతి తెలుసా?

హా— ఏం చచ్చేడా!

కు— నిన్నటివరకూ అలాంటి శుభవార్త వినలేదు. కాని ఆ ప్రయత్నంలోనే వున్నాట్ట.

హా— పాపం! అదేం!

కు— మొన్న నెందుకో ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాట్ట. "ఆత్మహత్య మహాపాపం" అన్న సినీమా డైలాగ్ జ్ఞాపకంవొచ్చి మళ్ళీ విరమించుకున్నాట్ట. అలాంటి చవట చస్తేనే మంచిది.

హా— పదికాలాలపాటు బతకాలని మంచి ముహూర్తంచూసి వాళ్ళ వాళ్ళు మార్కండేయుడని బారసాల చేస్తే తీతువుపిట్టలాగా చావాలి చావా లంటా వేమిట్రా!

కు— బ్రదర్! మనవాళ్ళుపేర్లు పెట్టడంలో దేవతలపట్ల ఘోరమైన మహాపాపం చేస్తున్నారనుకో. కొంప మునిగిపోయినట్టు పుట్టిన పదిరోజులకే సార్థకనామ డవ్వకపోతాడా అని వాళ్ళకి నచ్చిన దేవుళ్ళపేర్లు తగిలించేస్తూంటారు. తీరా చూస్తే శ్రీరామచంద్రుడని పేరున్నవాడు, భార్య వుండగా ఏ పక్కింటి అహల్యనో లేవదీసుకుపోతున్నాడు. హరిశ్చంద్రుడని పేరెడితే వాడు ఏ నల్లబజారు వర్తకసంఘానికి ప్రెసిడెంటుగానో తయారవుతాడు. మృత్యుంజయుడని పేరెట్టిన కుర్రాడు అన్నప్రాశనకే వుండడు. ముద్దు ముద్దుగా అమ్మాయికి "సుందరి" అని పేరెడితే ఎదిగి శూర్పణకని మరిపిస్తుంది. నా పేరు కుటుంబరావు. నేనుచూస్తే ఘోటకబ్రహ్మచారిని. నీ పేరు హనుమంతరావు. మీ ఆవిడపేరు సీత. ఇంతకంటె దైవదూషణ మరోటుందా! ఎన్నో సాంఘిక దురాచారాల్ని సంస్కరించిన మహానుభావులదృష్టిలో ఈ విషయం పడకపోడం శోచనీయం.

హా— అయితే ఎలాంటి పేర్లెట్టాలంటావ్!

కు— వెరీ సింపుల్. పిల్లలు పెద్దవాళ్ళయి ఏదో వృత్తో, ఉద్యోగమో, వ్యాపారమో, కాలక్షేపమో మొదలెట్టేక, పంచతంత్రంలో విష్ణుశర్మ పెట్టినట్టు: వాళ్ళ అభిరుచుల్నిపట్టి, రూపురేఖల్నిపట్టి, పార్టీ బలాల్నిబట్టి వాళ్ళకి నచ్చినపేర్లు వాళ్ళే పెట్టుకుంటారుగా. అంతవరకూ యింటిపేర్లతో నెంబర్లు పెట్టి పిలుచుకుంటే తప్పా! దీనికి కూడా ఓ చట్టం కావాలా! (అప్పుడే ఓ నౌకరు కుర్రాడు ఓ ఉత్తరం పట్టుకొచ్చి హనుమంతరావు కిస్తాడు. వాణ్ణి చూసి) ఎవడీ యమదూత!

హా— మార్కండేయుడి దగ్గిర పనిచేసే కుర్రాడు. (ఉత్తరం తీసుకుని చదువుకుంటూ వుంటాడు.)

కు— నీ పేరేమిట్రా?

నౌ— సన్నాసి.

కు— శహభాష్! గుణానికి, రూపానికి తగ్గ పేరు. ఒరేయి సన్నాసీ, నీ తల్లితండ్రులు ధన్యులు. ఇంతకీ మార్కండేయుడు ఎప్పుడు చచ్చేడు?

— చావడమేమిటంటి బాబూ! రాయిలాగుంటే. నిలబడ్డ పళంగా ఈ యనుమంత్రావుగార్నీ, నాలుగిళ్ళవతల అదేదో పేరు చెప్పేరండి ఆర్నీ తీసుకు రమ్మన్నారండి.

కు— నా పేరే అయ్యుంటుంది. కుటుంబరావు అన్నాడా!

స— అ౯... అవునండి. అదే యదవపేరు నోరు తిరగలేదండి.

కు— వెధవ నోరనబోయి వెధవ పేరని వుంటావు. నీ వ్యాకరణ దోషాన్ని క్షమించేనుకాని, నీ గులాబ గుంయ్యిమనీలోగా పరిగెత్తు కెళ్ళి వొస్తున్నారని చెప్పు.

స—(పోతూ పోతూ) మిమ్మల్ని ద్దర్నీ కూడా యంటబెట్టుకు రమ్మన్నారండి. చాలా బయ్యంపడు తున్నారు.

కు— వాడికి నీకుకూడా అభయ హస్త మిచ్చేను. పో. (హనుమంత రావుకేసి తిరిగి) ఏమిత్రా! అలా ఏడుపు మొహం పెట్టేవు! ఏం రాశాడు ఉత్తరంలో?

హ— వాళ్ళ నాన్నదగ్గిర్నుంచి వుత్తరం వొచ్చిందిట. వీడి మేన మామ కూతురికి ఆరోజు కారోజు పెళ్ళీడు ముంచుకొస్తుందని - గంతు లేస్తున్నాట్ట. వెంటనే ఆ సంబంధాని కొప్పుకోపోతే తన విల్లులోంచి వీడి పేరు కత్తిరించిపారేస్తానని చిందులు తొక్కుతూ వీళ్ళ నాన్న వీడికి నోటీ సిచ్చేడుట.

కు— ఆహా! ఎంత మహా ఘోర పాతకం! పురాణయుగంలో నూటికీ కోటికీ తపోభంగం చెయ్యడానికి ఆడదాన్ని మొగాడిమీదికి ఉసికొల్పే వారు. ఈ పెళ్ళనే సాంఘిక దురాచారం పేరిట ఆడదాని దౌర్జన్యం నుంచి తప్పించుకున్న బ్రహ్మచారి మచ్చుకు కనబడడు. ఇంటికీ, కంటికీ, వొంటికీ, వంటకీ ఆడది బాగుంటుం దని పొగుడ్తుంటే నిజమేనని నమ్మి మోసపోతాడు మొగాడు. పెళ్ళంటే మొగాడి అమాయకత్వానికి సమాజం జరిపే సన్మానసభ అని తెలుసుకో లేక, దానికి జరిపే కట్నాలూ కానుకలు మొదలైన ఏర్పాట్లన్నీ విని మురిసిపోయి ఈసంసారమనే కబంధ హస్తాల్లో ఇరుక్కుంటాడు. పాపం! మార్కండేయుడి కెంత కష్టం వొచ్చింది! ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాడంటే ఆశ్చర్యమేముందీ!

హ— నేనూ మార్కండే యుడూ ఇంటర్మీడియట్ చదివిన నాలుగేళ్ళూ కలిసి-మెలిసి ఒకే రూంలో వుండేవాళ్ళం. వాడు మంచి స్పోర్ట్స్‌మన్. టెన్నిస్, ఫుట్‌బాల్, క్రికెట్ ఆటల్లో మేధావి. పైగా బోలెడు బుద్ధిమంతుడూ. క్లాసులో వెనకబెంచీమీద కూర్చుని వేరుశెక్కాయలో, బఠానీలో తింటూ బుద్ధిగా సినిమాపత్రికలో, స్పోర్ట్స్ పత్రికలో చదువుకుంటూ పాఠాల జోలికిపోయి అల్లరి చెయ్యకుండా కాలక్షేపం చేసేవాడు. ఎకనమిక్స్, హిస్టరీ లెక్చరర్లయెడల కడు వినయ విధేయతలతో వుంటూ అటెండెన్స్ తీసుకున్న మరుక్షణంలోనే శలవు తీసుకుని వెళ్ళిపోయేవాడు. చెట్టంత విద్యార్థి అలా గౌరవిస్తుంటే మురిసి పోయి లెక్చరర్లు చిరునవ్వుతో వీడ్కోలిచ్చేవారు. తెలుగు లెక్చరరయితే చెప్పనే అక్కర్లేదు. అటెండెన్స్ అవగానే "నాయనా... మార్కండేయా! నా క్లాసులో కూర్చుని నీవిలువయిన కాలం పాడుచేసుకోకు. వెళ్ళి ఫుట్‌బాలాడుకో" అనిదీవించి పంపేవాడు పైగా వాడికి ఆడపిల్లలంటే మహా భయం. ఆడదంటే ఆదిశక్తనీ, దగ్గిరిగా వెడితే ప్రేమనే నోటితో మింగేస్తుందనీ వాడి నమ్మకం.

కు— వాణ్ణిగురించి నాకు చెప్పాలా! బ్రహ్మచర్య ధర్మసంస్థాపనోద్యమంలో నాకు ముఖ్య శిష్యుడు. హుఁ! అలాంటి మహాతపస్వికా యిలాంటి ప్రమాదం! ఇంకా ముహూర్తం పెట్టలేదుకదా!

హ— ఇంకా లేదు. కాని వాళ్ళ నాన్నధోరణిచూసి భయపడి పెళ్ళిచేసుకుంటానంటాడేమో. పెళ్ళిమీదకి వెళ్ళేవాడి మనస్సుని బ్రహ్మచర్యం మీదకి లాగి తాపరం చెయ్యాలి. దానికి నువ్వే సమర్థుడివి.



కు— ప్రయత్నం పురుష లక్షణం అన్నారు. పైగా అభయ హస్తం కూడా యిచ్చేనామరి.? పద పోదాం.

◆ ◆ ◆

2 వ రంగం

[మార్కండేయుడి గది. కాలేజి విద్యార్థికి ఉండవల్సిన హంగులూ అలంకారాలూ గదిలో వుంటాయి. మార్కండేయుడు తడిటర్కిష్ టవల్ నెత్తిమీద వేసుకుని కుర్చీలో కూర్చుని దిగులుగా ఆలోచిస్తూ వుంటాడు. నౌకరు సన్యాసి గ్లాసుతో మధ్య మధ్య కొంచెం నీళ్ళు మార్కండేయుడి నెత్తిమీదున్న టవల్ మీద జల్లుతూ వుంటాడు.]

మా— (దిగులుగా) ఒరేయి సన్నాసీ! నీకూ నాకూ ఋణం తీరిపోయిందిరా. నాకు మళ్ళీ చచ్చిపోవాలని వుందిరా.

స— అంతమాటనకండి బాబూ. మీరు చస్తే, నేమాత్రం బతుకుతానా.

మా— మరయితే మా నాన్న చెప్పినట్టు పెళ్ళి చేసుకోమంటా వుర్రా !

స— ఛ. ఛ! తమ కర్మ షేమం కాలింది బాబూ! ఢిక్కుమాల్ని పెళ్ళి. ఇన్నాళ్ళూ యింత దర్జాగా బతికిన కళ్ళతోటి తమరా యదవ సంసారం బతుకు బతుకుతుంటే సూళ్ళేను బాబూ.

మా— నాకీ గండం గడిచే ఉపాయం కనబడ్డం లేదురా.

స— ఎంత కట్టమొచ్చింది బాబూ! తమ బాద సూత్తుంటే గుండె తరుక్కుపోతోంది. దేవుడు లాంటి మనిషికందా! తమ కా యీ పెళ్ళి బాద !

మా— సన్యాసీ! నే చచ్చిపోతే నా పర్సులో డెబ్బయి రూపాయి లున్నాయి. అవి నువ్వు తీసుకో.

స— (చొక్కా కొసతో కళ్ళు ఒత్తుకుంటూ) ఇంకెక్కడి డెబ్బయి బాబూ! ఇంక ఏ భయ్యే వుంటా యండి. పొద్దున్నే తమకి తెలియ కుండా, పాపిష్టోణ్ణి, యిరవై తీసేసును కున్నానండి. తమరిలాగంటారని తెలుస్తే తమ డబ్బు అగ్గిలా చూసు కునేవాణ్ణి.

కు— (హనుమంతరావుతో ప్రవేశించి) ఏమిట్రా ఈ నెత్తిమీద జలపాతం! గంగావతరణం సీనులా గుంది!

మా— హృదయంలో అగ్ని జ్వాలలు! మనస్సులో మారణ హోమం! మెదడులో అగ్ని పర్వ తాలు! బుర్రవేడి! ఒళ్ళుమంట! ఇక నే బతకను.

హ— ఒరేయి మార్కండేయుడూ! కష్టాలొచ్చినప్పుడే ధైర్యంగా వుండాలి. కష్టాలు కల కాలం మంచి వాళ్ళకి ఏ సినిమాలో నేనా వున్నాయా! ఇంటర్వెల్ వరకూ కష్టాలుంటే తర్వాత సుఖాలుంటాయి. ఇంటర్వెల్ వరకూ సుఖాలుంటే తర్వాత కష్టాలు, చివర్న మళ్ళీ సుఖాంతం అవుతుంది. ఏమంటావురా కుటుంబ్రావ్!

కు— సెంట్ పర్ సెంట్ కరెక్ట్. ఇంతకీ భయపడవలసి నంత ప్రమాద మేమొచ్చింది!

స— ఇంతకంటే ప్రమాదమేం రావాలిబాబూ!

మా— ఏరా హనుమంతూ! వుత్తరంలో సంగతులు వాడికి చెప్ప లేదూ?

కు— చెప్పేడు, గ్రహించేను. దాన్ని గురించే ఆలోచిస్తున్నాను.

మా— హనుమంతూ! వాడా లోచిస్తూ కూర్చుంటాడుగాని, ఈ లోగా ఏదైనా విషం తెచ్చిపెట్రా, తకిమని చంపేసేది.

హ— అబ్బబ్బ! అంత బెంబేలు పడిపోతావేమిట్రా! పోనీ

అంత చావుకు తెగించిన వాడివి పెళ్ళాడేసెయ్యకూడదూ !

స— ఛ ఛ. అదేం సలహా బాబూ! పెళ్ళైనా ఆపండి. లేదా మా అయ్యగార్ని దర్జాగా చావనీండి. (మార్కండేయుడి వైపుతిరిగి) పోనీండి బాబూ ఆయన విషం తేక పోతే తమచావు ఆగుతుందా! తమరు ఊఁ అన్న క్షణంలో నాబొందిలో పాణం వుండగా తమర్ని పేణాలతో వొదిలేస్తానా!

కు— నీ ప్రభుభక్తికి సంతోషిం చాంకాని, నువ్వు నోరు మూసు కుంటావా నిన్ను నిలువునా యిక్కడ పాతెయ్యమంటావా! (మార్కండేయుడితో) ఒరేయి ఈ ఫళంగా నువ్వు-"మీరందరూ కట్ట కట్టి గంగలో దూకినాసరే నేను పెళ్ళాడను" అని మీనాన్నకి వుత్తరం రాస్తే ఏమౌతుంది?

మా— మా అమ్మ గుండాగి పోతుంది. మా మేనమామ ఉరేసు కుంటాడు. వాడి కూతురు నూతిలో దూకుతుంది. మానాన్న నన్ను ఉప్పు పాతరేస్తాడు.

కు— గట్టి చిక్కే వొచ్చిందే !

హ— చస్తే చస్తావు. నా మాట విని పెళ్ళాడేసెయ్యరా. మీ వాళ్ళం దరూ సంతోషిస్తారు.

కు— తాచెడ్డకోతి వనమంతా చెరిచిందని ! ... ఇదా నీ బోడి సలహా !

మా— (నిస్పృహతో) వాడు చెప్పినమాటకొట్టెయ్యడానికి వీల్లేదు. నా బతుకెలాగా చెడింది. తల్లితండ్రుల్ని సంతోషపెటడాని కైనా పెళ్ళాడేస్తా.

కు— పెళ్ళంటే నూరేళ్ళమంట. మీ నాన్నేదో రాశాడని మంటలో దూకేస్తావా! ఏదో ఉపాయం ఆలో చించాలికాని.

మా— ఇంకా ఎప్పుడు ఆలో చిస్తావురా! ప్రళయంలాగ పెళ్ళి మీదకి విరుచుకు పడిపోతుంటే ! ఇదిగో మా నాన్న రాసిన ఉత్తరం చదువు.

కు— (ఉత్తరం పైకి చదువుతూ) "చిరంజీవి మార్కండేయుణ్ణి ఆశీర్వ దించి వ్రాయునది. ఉభయకుశలోపరి. నిన్ననే కాంతారావు వద్దనుంచి ఉత్తరం వచ్చినది..." ఎవడీ కాంతా రావు !

మా— నా ప్రాణాంతకరావు. మా మేనమామ.

కు— "...ఉత్తరం వచ్చినది. చిరంజీవి మూలకి... ..." మూల ఏమిట్రా! మూలా, సందూను !

మా— మా మేనమామకూతురు. ఏ నక్షత్రానికి పుడితే ఆ నక్షత్రం పేరెట్టడం వాళ్ళ వంశంలో ఆన వాయితీ.

హ— అయితే ఏరి ఏరి మూల నక్షత్రాన్ని పుట్టిందన్నమాట! భేష్ ! ఊఁ... చదువు.

కు— "చిరంజీవి మూలకి పెళ్ళీడు వొచ్చింది కనక ఇక ఆలస్యం చెయ్యకుండా ముహూర్తం పెట్టించమని తొందర చేయుచున్నాడు..."

హ— ఏడవలేక బోవుచున్నాడు...!

మా— (ఏడుపు ధోరణిలో) వీడేరా నా పాలిటి యముడు. వీడో మూలా వీడి కూతురు మూలో మూలా పెళ్ళో పెళ్ళో అని పీక్కుతినేస్తున్నారు.

హ— ఎక్కడో కొండచిలువలాగున్నాడే!

స— అసలు యీ మావఁలమూలాన్నే బాబూ యీ పెళ్ళిళ్ళ పేచీలు. ఊ... ఆళ్ళ కూతుళ్ళు కొంచెం అడ్డం పొడుగూ ఎదిగేటప్పటికి, కాస్తంత ఒడ్డూ పొడుగూ వున్న మొగాడు కనబడితే లటుక్కున గేలంవేసి లాగేసి పెళ్ళిళ్ళు చేసెయ్యడం! చ ఛ! యదవమావఁలూ యదవలోకం! బాబూ నాకు తెలీకడుగుతాను-ఇలా అల్లుళ్ళని యేటాడ్డం మనదేశంలోనే వుందా దొరలదేశంలోకూడా వుందాండీ?

కు— ఇదే ఇంగ్లండులోనో అమెరికాలోనో అయితే అలాంటివాళ్ళని కాల్చిపారేద్దురు. అక్కడ ఎవరిష్టం వాళ్ళది. ఒళ్ళు కొవ్వెక్కితే పెళ్ళాడొచ్చు, లేకపోతే నాలాగ హాయిగా యావజ్జన్మ బ్రహ్మచారిగా వుండిపోవచ్చు.

స— అఁ!... చూసేరా! అమెరికా అంటే స్వొర్గమున్నమాట. ఎదవ ఇండియా ఎదవ ఇండియాని... పెళ్ళి తప్ప మారుమాటే లేదు. అందుకే దేవుడిలాంటి నెహ్రూగారు చచ్చిపోయారు.

మా— [విసుగ్గా] ఉత్తరం చదివి తగులడ నివ్వండిరా.

కు— (చదువుతూ) "...కట్నం నిషేధించిన సందర్భంలో పెళ్ళికూతురుపేర ఐదెకరాలమాగాణి..."

హ— ఐదెకరాలే! బ్రదర్ పెళ్ళాడెయ్యరా. ఐదెకరాలంటే పాతిక వేలరూపాయి లాస్తి. ఏటేటా వెయ్యి రూపాయిలు సిస్తు లొస్తాయి.

కు— ఏటేటా వాళ్ళావిడికి కాన్పులుకూడా వొస్తాయి. ఆస్తి చూసి పెళ్ళాడేడా వాళ్ళావిడ గంపల కొద్దీ పిల్లల్ని కని పారేసి వాడి దుంపతెంచి, చివరికి చిప్పా-దొప్పా చేతికిస్తుంది. ఇదిగో మన హనుమంతుగాణ్ణి చూడు ఎలా మారిపోయాడో. చదువుకొనేరోజుల్లో ఎప్పుడూ సూటూ, బూటూ, టై, సెంటూతోటి ప్రతీ కొత్త సినిమాకి ఫస్ట్‌డే, ఫస్ట్‌షో, ఫస్ట్‌క్లాస్‌లో ప్రత్యక్షమయ్యేవాడుకదా! ఇప్పుడు చూడు... ...రెండేళ్ళయిందట పబ్లిగ్గా సినీమా కెళ్ళి. మొన్న ఏమీ తోచక వీడింటికెళ్ళి చదువుకోడాని కేదైనా పుస్తకం దొరుకుతుందేమోనని వెతికితే స్త్రీల

వ్రతకథలూ, భక్త విజయం తప్పించి పుస్తకం లేదు.

హ— మధ్య నా గోడవెందుకురా! ఉత్తరం చదువు.

కు— (ఉత్తరంలోంచి) "పెళ్ళికూతురుపేర ఐదెకరాల మాగాణి పసుపు కుంకంనిమిత్తం రాశాట్ట..."

మా— ఇంకెక్కడి పసుపూ కుంకంరోయ్! పెళ్ళాడకపోతే నన్ను బతక నివ్వరు. పెళ్ళాడితే, నే బతకను.

కు— "...పసుపుకుంకం నిమిత్తం రాశాట్ట. శ్రావణమాసంలో మంచి ముహూర్తా లున్నాయనీ, జాతకాలు చూపెట్టి ముహూర్తం నిర్ణయించి మనకి వ్రాస్తానన్నాడు."

మా— జాతకరీత్యా పెళ్ళికూతురు కెంత త్వరగా వైధవ్యం రాసివుందో అంత దగ్గర ముహూర్తం పెట్టుకోమను.

కు— "... ... మనకి వ్రాస్తానన్నాడు. నేనూ మీ అమ్మా అంగీకరించేం..."

స— ఎంత అమ్మా బాబూ అయితే మాత్రం చెట్టంత కొడుకుని, పెళ్ళిచేసి ప్రాణాలు తియ్యడం నాకేం నచ్చలేదు బాబూ.

మా— నీకు నచ్చడమేమిట్రా చచ్చు సన్నాసి. వాళ్ళకి నచ్చాలిగాని.

కు— "...అంగీకరించేం, చిరంజీవి మూల కూడా నిన్ను వరించి నిన్ను తప్ప ఎవ్వరినీ పెళ్ళాడనని శపథంపట్టి పూజలు చేస్తోందిట..."!

స— అమ్మనాతల్లోయ్! కొంప ముంచేసింది! పూజలే!

మా— ఇదేదో మంత్రాలమారిలా వుందిరోయ్! నాకు పెళ్ళి తప్పదు.

హ— పెళ్ళా, పెళ్ళంటే ఏమిటి! భూతలనరకానికిసింహద్వారం. భార్యనే తిమింగిలం, సంతానమనే మొసళ్ళూ, అత్తమామలనే జలగలూ పీక్కుతింటూంటే సమస్యల్ని తలకి చుట్టుకుని ఓపిగున్నంత వరకూ ఈసంసార సాగరంలో నిలువీత యీదడమే గృహస్థు యొక్క జీవిత కథా సంగ్రహం.

మా— ఓరి నీ కవిత్వం తగలెయ్యోయ్! ఎప్పుడో చచ్చేవాణ్ణి ముందే భయపెట్టి చంపేస్తున్నావ్రోయ్!

కు— (సీరియస్‌గా ఏదో రాస్తూ) గందరగోళం చెయ్యకండిరా. మంచి అయిడియా వొచ్చింది. ఉత్తరం రాస్తున్నా.

మా— నువ్వేం రాసినా, నా మొహాన్ని పెళ్ళిరాసివుంది. సరే కానీ పెళ్ళాడే చస్తాను.

హ— పెళ్ళాడిన తర్వాత చావడం సీతరంకాదు. ఆ అమ్మాయిచూస్తే కలియుగ పతివ్రతలాగుంది. పెళ్ళికాకముందే పతిపూజ మొదలెట్టిందిట. ఒకవేళ నువ్వు చచ్చినా, సావిత్రిలాగ, యముడుతో దెబ్బ

లాడీ నిన్నుబతికించి, చావగొట్టి చెవులుమూసి నీ చేత సంసారం చేయించి తీరుతుంది.

మా— అమ్మ నాయినోయ్! నీకూ నాకూ ఋణం తీరిపోయింది రోయ్ సన్నాసీ!

స— (మార్కండేయుడి కాళ్ళు చేతులతో పెనవేసి) బాబూ!

కు— (తను రాసిన వుత్తరం చేత్తో పట్టుకుని) సైలెన్స్! డామిట్! ఏమిటీ ఏడుపులూ పెడబొబ్బలూ! ఇక్కడెవరైనా చచ్చేరేమో ననుకుంటారు.

మా— నా బతుక్కంత అదృష్టం కూడానా!

కు— షడప్! నేనురాసిన ఉత్తరం చదువుతా, శ్రద్ధగా వినండి. "శ్రీ కాంతారావుగార్కి, (అంటే మార్కండేయుడి మేనమామకి) నమస్కారములు. మీరు మీ అమ్మాయిపేర ఐదెకరాల భూమి వ్రాసియిచ్చి వైభవంగా పెళ్ళిచేయ దలచుకున్నట్టు మార్కండేయుడు మాకందరికీ చెప్పేడు. పెళ్ళవగానే పదిహేను వందల రూపాయలు ఖర్చుతో ఒక పెద్ద వెట్ పార్టీ అనగా బ్రాందీ విస్కీ మొదలయిన మద్య సంబంధమైన పానీయాలతో ఏర్పాటు చేస్తాట్ట. నిన్నరాత్రి తప్పతాగి ఒళ్ళుతెలియని మైకంలో రోడ్ మీద పడివున్న మీ మేనల్లుడు లేవదీయడానికి వెళ్ళిననాతో సినీమాలో దేవదాసులాగ శపృతూ తనకి పెళ్ళాం అంటే యిష్టంలేదనీ, బ్రహ్మచర్యోపాసనే తన జీవిత పరమార్థమనీ, మీ బలవంతంమీదే ఈ పెళ్ళి జరగబోతూంది కనక, పెళ్ళాడి మీకూ మీ అమ్మాయికీ ఓ పాఠం నేర్పుతానని అన్నాడు. ఆ మత్తులోనే వాళ్ళ తండ్రి రాసిన వుత్తరం నా చేతి కిచ్చేడు. దీనికి సాక్ష్యంగా ఆ వుత్తరం యిందులో జతపర్చి పంపుతున్నాను ..."

మా— నీ వుత్తరంతగలెయ్యోయ్! ఆ వుత్తరం తీసుకెళ్ళి మా మేనమామ, మా నాన్నకి చూపెడితే!

కు— ఉత్తరం పూర్తిగా విని చావరా! "మార్కండేయుడు వాళ్ళ తల్లితండ్రులకి ఏకైక పుత్రుడనీ, అన్ని ఆశలూ అతనిమీదే పెట్టుకున్నారనీ విన్నాను. ఈ విషయాలు తెలుస్తే వారి గుండెలు బద్దలవుతాయనీ ఆ పాపం నాకుచుట్టుకుంటుందనీ వాళ్ళకి వ్రాయలేదు. ఒక అమాయిక భారత సోదరిజీవితం సర్వనాశనం కాకుండా కాపాడదామన్న వుద్దేశ్యంతో మీకు వ్రాస్తున్నాను. ప్రతిఫలంగా మీవద్ద నుండి రెండు వాగ్దానాలు కోరుతున్నాను. ఈ రెండు వాగ్దానాలలోనూ ఏది అతిక్రమించినా, ఆయొక్క ఏడుకొండలవాడి ఆగ్రహానికి గురయ్యి మీరు సకుటుంబంగా సర్వనాశనమయ్యేదరని హెచ్చరిస్తున్నాను. మొదటిది—ఈ విషయం మార్కండేయుడి తల్లిదండ్రులకు మీరు తెలప

కుండా వుండటం. తెలిపితే జరిగే అనర్థంతాలూకు ఉసురు మీ అమ్మాయికి తగుల్తుందని గ్రహించెదరు గాక!... ..."

మా— అదిసరే బాగుంది. మరి మా మేనమామే ఇక్కడికొస్తే!

కు— అలా గిలగిల కొట్టుకు తగులడిపోకురా, చచ్చుతొందరగద్దమ్మా! ఉత్తరం పూర్తిగా చదవనీ. "ఇక రెండవవిషయం. మీరు స్వయంగా ఇక్కడికివొచ్చి మార్కండేయుణ్ణి చూడటం మంచిదే. అయితే ఇక్కడికి వచ్చి స్వయంగా అతని ప్రవర్తన చూసికూడా అతని తల్లిదండ్రులకు చెప్పకపోవడం మహాపాపం. అలాక్కాకుండా చెప్పేరా, వాళ్ళు హృదయాలు పగిలి చస్తారు. అది మరీ మహా ఘోరపాపం. దీనితాలూకు ఉసురు పైదానికి రెట్టింపుంటుందని జ్ఞాపకముంచుకొనెదరుకాక!

మా— అయిపోయిందా? ఇంకా ఉందా?

కు— మాట్లాడితే ఉత్తరం చింపేస్తా.

మా— చింపేస్తే చంపేస్తా. బ్రహ్మాండంగా వుంది ఉత్తరం. చదువు.

కు— "పితృ సమానులైన మీకు వాత్సల్య పూర్వకమైన ఒక సలహా. మా అనుంగు సోదరి మాలాదేవికి వెంటనే మరో మంచి సంబంధము వెదకి పెళ్ళి చేయమని ప్రార్థిస్తున్నాను, లేనియెడల ఆమెకు బావ యెడల ఉండుకుంటూవుండే ప్రేమ రానురాను వైరితలలేయుటంజేసి భగ్నప్రేమికగా జీవితం దగ్ధమొనర్చుకొనుట తథ్యం. ఇంత అర్థాంతరముగా మరో సంబంధం చూసుకోవలసిన అగత్యమేమొచ్చెనని మార్కండేయుడి తల్లితండ్రులు మిమ్ముల్లను నిలదీసి యడిగినచో వారి ఉభయ జాతకముల పరీక్ష రీత్యా గ్రహబల దృష్ట్యా పెండ్లికొమారైకు అనతికాలములోనే వైధవ్యం పొడసూపుచున్నట్లు విజ్ఞులు శలవిచ్చినట్టు వారికి వర్తమానమంపగలరు. నిజమునకు ఇంతకంటే పదునైన కారణములు కూడ తమవంటి అనుభవజ్ఞుల కల్పనాశక్తి కతీతములు కావు. భవత్ శ్రేయోభిలాషి." ఎలాగుంది మన పథకం! 'కన్యాశుల్కం' స్టైయిల్లో వేశాను. దీనికింక తిరుగులేదు.

హ— బ్రదర్ నీ బుర్ర అమోఘంరా. నువ్వు చచ్చేక నీ మెదడు సైంటిస్టులు పరిక్షచెయ్యడం దేశానికెంతో అవసరం.

స— చచ్చేవరకూ ఎందుకు బాబూ! ఈలోగానే అలాంటి ఏర్పాటు చేయిస్తేసరి.

మా— మొత్తంమీద ప్రస్తుతానికి నా గండం గడిపించేవు. నా బ్రహ్మచర్యం నిలబెట్టేవు.

స— మా అయ్యగారి బెమ్మచర్యానికి జై! బెమ్మచర్యానికి ...

హా—

కు— జై!

మా—

◆ ◆ ◆



3 వ రంగం

[మార్కండేయుడు, సంధ్యా చెరోవైపునుంచీ ప్రవేశిస్తారు. రంగస్థలంరోడ్డు. ఒకళ్ల నొకళ్ళు చూసికూడా చూడనట్టు నటిస్తూ మౌనంగా ఎవళ్ళ దారిన వాళ్ళు వెడుతూ వుంటారు. సంధ్య అతనికి కనబడే లాగా చేతులో రుమాలు కిందకి జారవిడుస్తుంది]

మా— (తడబడుతూ) న...నమస్కారం!

సం— (వెనక్కి తిరిగి) ఓ! మిస్టర్ మార్కండేయ్! గుడ్ మార్నింగ్.

మా— గుడ్ మార్నింగండి.... మీ చేతిరుమాలు ... ...

సం— నా చేతిరుమాలేమిటండీ, అవసరమైతే నాప్రాణాలుకూడా మీ కిచ్చేస్తాను. మీలాంటి కాలేజీ స్పోర్ట్సు ఛాంపియన్ అడగాలేకాని ఏదివ్వకుండా వుండగలం! (తడుముకుని) అరె! కనబడ లేదే!

మా— అబ్బెబ్బె! అలాంటిదేం కాదండి. మీచేతి రుమ్మాలు కింద పడింది. అది చూపెడదామని.

సం— ఓహ్! మైగాడ్! ఎప్పుడు పడిపోయిందీ!

మా— ఇప్పుడే ఇక్కడే, ఇదిగో.

సం— థేంక్యూ మిస్టర్ మార్కండేయ్! ఏదీ (చేతి కందివ్వమన్నట్టు చెయ్యి జాపుతుంది).

మా— (తటపటాయించి, రుమాలు వైపు చూపెడుతూ) ఇదిగోనండి. ఇక్కడేవుంది ...తీసుకోండి.

సం— అదిగో మీకాళ్ళదగ్గిరే వుంది. ఇలా యివ్వండి.

మా— (తప్పని సరైనట్టుగా, తన చేతికి తగలకుండా జేబులోంచి పెన్‌తీసి దాని సహాయంతో రుమాలు తీసి అందిస్తూ) ఇదిగోనండి. మళ్ళీ పారేసు కోకండి.

సం— (పెన్ లాక్కుని, రుమ్మాలు మార్కండేయుడి మీదకి గిరవాటేడుతూ) అది మీ దగ్గిరుంచండి. ఇది నా దగ్గిరుంటుంది.

మా— అహఁ హఁ! వొద్దండీ, కావలిస్తే యిదికూడా మీ దగ్గిరే వుంచుకోండి. నా దగ్గిర చాలా రుమాళ్ళున్నాయి.

సం— ఎంత మాట! మీ దగ్గిర జేబురుమాళ్ళుండవనా! చూశారూ, ఇవ్వాళ నాకు మీరెదురవ్వటం, ఎప్పుడూ జాగ్రత్తగా వుండే నాకు మైమరపు రావడం, రుమాలు కింద పడటం, అది మీరు చూడటం, పెన్‌తోసహా నాకివ్వడం... ఇదంతా దైవికంగా జరిగింది. భగవంతుడు ఏదో ఓ మహత్తరమైన లక్ష్యంతో ఈ సంఘటనని కల్పించి వుంటాడు. అంచేత ఈ సంఘటనకు స్మృతిచిహ్నంగా మీరు నాకు ప్రేమతో పార్కర్ పెన్ బహూకరించినట్టుగానే ఈ స్వల్పమైన బహుమానాన్ని నా దగ్గర్నుంచి మీరు కూడా, తీసుకోవాలి.

మా— పెన్ నేను అలాంటి వుద్దేశంతో ...

సం— నాకు తెలుసు. మీశరీరం ఎంత గట్టిదో మీ హృదయం అంత మెత్తటిది. ఇది కేవలం నా సంతోషంతో యిస్తున్నది.

మా— (అటూ యిటూ చూసి రుమాలు జేబులోకి తోసుకుంటూ ఖంగారుగా) నే వెళ్ళొస్తానండి.

సం— మీ వేళాకోళానికేంగాని, రండి అలా పార్క్ కేసి వెడదాం. నిజానికి మీరింత సరదా అయిన మనుషు లనుకోలేదు.

మా— మీరెళ్ళండి. నాకు వేరే పనుంది.

సం— చాలెండి, సరసాలు. ఇలాంటి మధురఘడియల్లో మనిద్దరం పార్కు కెళ్ళటంకంటే మంచి పనేముంటుంది! (చెయ్యందుకుని) రండి వెడదాం.

మా— [తేలుకుట్టినట్టు చెయ్యి వొదిలించుకుని] అమ్మబాబోయ్! నేను మీతో వంటరిగా పార్కుకు రావడం కుదరదండి.

సం— వంటరిగా ఏమిటండీ! జంటుగా మనిద్దరం వెడదాం. సర్దాగా మాట్లాడుకుందాం.

మా— ఇంతవరకూ మాట్లాడుకున్నది చాలండీ. మరోసారి వెడదాం. లేకపోతే మీరు వెళ్ళండి. నేను తర్వాత వస్తాను.

సం— (తీక్షణంగా) ఏమిటీ! మీరు నిజంగానే రానంటున్నారా!

మా— అవునండీ! నాకు పనుంది.

సం— (స్వరం హెచ్చించి) హుఁ ...రమ్మనడం నాదే తెలివితక్కువ. భారతదేశం అనాదిగా ధైర్య, శౌర్య పరాక్రమవంతులకి పుట్టిల్లు. నీ ఒడ్డూ పొడుగూ చూసి, తోటి కాలేజీ విద్యార్థివనీ, రక్షిస్తావనీ అనుకున్నాను. ఆపదలోవున్న స్త్రీకి సహాయం చెయ్యడానికి నిరాకరించే కిరాతకుడ వనుకోలేదు.

మా— (విస్తుపోయి) ప్లీజ్! కొంచెం నెమ్మదిగా మాట్లాడండి.

మీకొచ్చిన ఆపదేమిటి? నా సహాయమేమిటి? నాకేం అర్థం కావడం లేదు.

సం— హృదయం వుంటేకదా అర్థమవ్వడానికి. నడిరోడ్డుమీద నిలబెట్టి ఒక ఆడదాన్ని పట్టుకు యిలా అవమానిస్తారా?

మా— (దీనంగా) చూడండి. మీరలా ఆవేశంలో మాట్లాడుతుంటే, వంతరిగా చూసి మిమ్మల్ని ఏ బలాత్కారమో చేసేననుకుని అందరూ నన్ను పట్టుకుంటారు.

సం— (గట్టిగా) అయితే అన్ని అవమానాలూ, అన్ని ఆపదలూ నాకే కాని మీ మీద ఈగయినా వాలకూడదన్నమాట!

మా— (బతిమాలుతూ) ఏమండీ! ఏమండీ! నెమ్మదిగా మాట్లాడండి. అసలు మీకొచ్చిన ఆపదేమిటో చెప్పండి.

సం— నన్ను రక్షిస్తానని మాటయిస్తారా?

మా— చచ్చినట్టు... ఐమీన్... తప్పకుండా.

సం— అదికాదండి. "ఎ" అనే అందమైన బుద్ధిమంతురాలయిన ఓ అమ్మాయి "బి" అనే అందమైన మంచి అబ్బాయిని ప్రాణప్రదంగా ప్రేమించిందనుకోండి. అలాంటప్పుడు "సి" అనే దుర్మార్గుడైన అబ్బాయొచ్చి ఆ "బి" అనే అబ్బాయిని నానాతిట్లూ తిట్టి "ఎ" అనే అమ్మాయిని బలవంతం చేస్తే అప్పుడు "బి" అన్నవాడు "సి" అన్నవాణ్ణి ఏం చెయ్యాలంటారు?

మా— చూడండి. నాకు తల తిరుగుతోంది. రెండ్రోజులయింది తిండితిని. డాక్టర్‌దగ్గిరకి వెళ్ళాలి. దయుంచి నన్ను పోనీండి.

సం— (అనునయంగా) ఏమండీ! కొన్నాళ్ళు మీ రా తాగుడూ జూదం మానెయ్యండి.

మా— తాగుడూ జూదమూనా! దైవసాక్షిగా అవంటే ఏమిటో నాకు తెలియవండి. నాకు కొంచెం గుండె దడగావుంది. నే వొస్తా. శలవు!

సం— (గట్టిగా) ఇలా నా జీవితం సర్వనాశనంచేసి, సంఘంలో నవ్వులపాలు చేద్దామని... ...

మా— అమ్మనాయినోయ్! అంత గట్టిగా కేకలేస్తూ మాట్లాడకండి.

సం— అయితే నే నడిగినదానికి సమాధానం చెప్పండి. అలాంటప్పుడు "బి" అన్నవాడు "సి" అన్నవాణ్ణి ఏం చెయ్యాలి?

మా— మీరేం చెయ్యాలంటారు?

సం— చీల్చి చెండాడాలంటాను.

మా— కరెక్ట్! డొక్కచీల్చి డోలు వాయించాలి. మరి నాకు శలవా!

సం— అయితే మీరు కుటుంబ్రావ్ డొక్కచీల్చి నన్ను రక్షించాలి.

మా— కుటుంబ్రావునా!

సం— అవును. అతనేకదా మిమ్మల్నిగురించి, మీరు తాగుబోతనీ, అన్ని వ్యసనాలకీ అలవాటుపడ్డారనీ ఊరంతా టాంటాం చేస్తున్నాడు. "అదేమిటండీ అలాంటి మహానుభావుడిమీద ఇలాంటి అభాండాలు వేస్తున్నారూ? ఆయన మంచితనాన్ని గురించి ఎరగని కాలేజ్ గర్ల్‌వుందా!" అని నేను ఆ మధ్య రోడ్డుమీద నిలబెట్టి అడుగుతే "ఆ రాక్షసుణ్ణిగురించి ముందుముందు మీకే తెలుస్తుంది" అంటూ మిమ్మల్నిగురించి ఎన్ని దుర్మార్గపుకూతలు కూసేడనుకున్నారూ!

మా— మైగాడ్! నిజంగానా?

సం— పనిగట్టుకొచ్చి మీతో అబద్ధమాడతానా! అదంతా నిజమనుకుని నమ్మి మా గరల్సందరూ "దేముడులాంటి మార్కండేయులుగారు ఇలా మారిపోయారేమిటా!" అని ఒకటే కంట తడిపెట్టడం!

మా— మీరెలా నమ్మారండీ!

సం— నమ్మక ఏంచెయ్యమంటారు! రోజూ ఆకుటుంబ్రావు నన్ను వెంటాడుతూ ఇదే గొడవ.

మా— కుటుంబ్రావ్ మిమ్మల్ని వెంటాడుతున్నాడా!

సం— నేనో అబ్బాయిని ప్రేమించేననుకోండి. పని కట్టుకుని వెంటబడి ఆఅబ్బాయికి ఆడదంటే భయం, పెళ్ళంటే వొణుకూ, ప్రేమంటే ఏడుసుకుంటాడూ, చిన్న చిన్న ఆడపిల్లలు వంతరిగా కనబడితే పీకనులిమేస్తాడూ, పచ్చితాగుబోతూ, అంటూ ఒకటే సొద!

మా— ఏడవ లేకపోయాడు. అసలు వాడో పెద్ద బ్రహ్మచారినని అఘోరిస్తాడుగా!

సం— ఆఁ... ఏమిటో మీ పిచ్చి. అందరికీ మాటల్లోనే బ్రహ్మచర్యం. మాటవరసకి చెబుతా. మీరే వున్నారండీ, మంచి బుద్ధిమంతురాలయిన అమ్మాయి, మంచి అందంగా వుండి, భర్తే దైవం అనుకుంటూ మిమ్మల్ని పెళ్ళాడుతుందనుకోండి...

మా— నా గొడవెందుకు లెండి!

సం— అదేం మాటండీ! మీకేం లోటు! మంచి రూపం, చదువూ సంస్కారం, సంపదా, సద్గుణాలూ...

మా— (సిగ్గు అభినయిస్తూ) అవుననుకోండి. అయినా అంత మంచి ఆడాళ్ళుం డొద్దండీ!

సం— అదేం మాటండీ! నేను మంచిదాన్ని కాదా? అందంగా వుండనా?

మా— మీరా! ఓయస్! వెరీ బ్యూటిఫుల్!

సం— నాకు చదువుంది, సంస్కారముంది. ఏమంటారు.

మా— అవునండి ... అవును. అన్నీ వున్నాయి.

సం— అలాంటి నేను 'ఎ' అనే అబ్బాయిని ప్రేమిస్తుంటే, మధ్య ఈ

కుటుంబ్రావెవడండీ పానకంలో పుడకలాగ!

మా— (నిరుత్సాహంగా) అసలు ఆ 'ఏ' ఎవరండీ?

సం— మీ ఎదురుగుండా చెప్పడానికి సిగ్గుగా వుందండీ.

మా— (బిక్క మొహం వేసి) పర్వాలేదు చెప్పండి.

సం— వేనిటీ బేగ్ కేసి చూపెడుతూ) ఎప్పుడూ ఆయన ఫొటో నాదగ్గరే వుంచుకుంటాను.

మా— ఏదీ ఆ ఫొటో యిలా చూపెట్టండి.

సం— నాకు సిగ్గేస్తోందండీ! ఎంతయినా ఆడదాన్నికదా! ఇంతకీ మీ హృదయం తెలుసుకోనివ్వండి. లేకపోతే నా జీవితమంతా నవ్వుల పాలవుతుంది.

మా— అయితే ఏం కావాలో అడగండి.

సం— అడగడాని కేముందండీ! మీరోసారి ఆ కుటుంబ్రావుగార్ని కలుసుకుని నన్ను వెంటాడొద్దనీ, నాదార్ని నన్ను వదిలెయ్యమనీ గట్టిగా చెప్పండి. ఈ విషయం చెప్పడానికే మిమ్మల్ని పార్కుకు రమ్మన్నాను.

మా— దానికేంలెండి. ఇవ్వాళే వెళ్ళి వాణ్ణి దులిపేస్తాను. మీరేం భయపడకండి. మీ యిష్టమొచ్చిన వాణ్ణి మీరు ప్రేమించుకుంటుంటే, రాస్కెల్! మధ్య వాడి అడ్డేమిటి.

సం— మిమ్మల్నే నమ్ముకున్నాను. మరిమీరేం చేస్తారో!... ఇందాకా తొందరపడి మిమ్మల్నేమి టేమిటో అన్నాను. క్షమించాలి.

మా— ఆ మాటకొస్తే మీరే క్షమించాలి.

సం— ఈనాడు నాహృదయం ఆనంద పరవశమయింది. వస్తా. శలవు,

మా— వెడతారా! పదండి అలా పార్క్ వరకూ దిగపెట్టొస్తాను.

సం— ఇంకెందుకులెండి. మరోసారి వెడదాం. శలవు.

[సంధ్య వెళ్ళిపోగానే మార్కండేయుడు తన ఛాతీ ఒక్కసారి పూరించి చేతుల దండలు చరుచుకుని ముసిముసి నవ్వులతో నిష్క్రమిస్తాడు. అదేసీను. మార్కండేయుడు నిష్క్రమించగానే మరో వైపునుంచి సంధ్యా కుటుంబరావు ప్రవేశిస్తారు. కుటుంబరావు మొహంలో గాంభీర్యం, నిరసన వ్యక్తమవుతూ వుంటాయి. సంధ్య ప్రాధేయపూర్వకంగా కుటుంబరావుని అనుసరిస్తుంది.]

కు— మిస్ సంధ్యా! ఇలా నడిరోడ్‌మీద నిలబెట్టి మాట్లాడటం నాకిష్టంలేదు.

సం— నాకుమాత్రం యిష్టంవుటండీ!... పోనీ అలా పార్క్ కేసి పోయి... ...

కు— శ్కండలస్! నేనేమిటి! మీకూడా ఏమిటి! పార్క్ కేమిటి! రావడమేమిటి! ఏమిటి దంతా! నేను ఘోటకబ్రహ్మచారిని. ఆడదంటేనాకు పరమ అసహ్యం.

సం—నాకు మొగాడంటే మరింత అసహ్యం. సరిగ్గా మనవిద్దరివీ ఒకే మాదిరి హృదయాలు. అందుకే మీ సహాయంకోసం వచ్చాను.

కు— ఏమిటా సహాయం?

సం— రోడ్‌మీద ఒంటరిగా ఆడది కనబడిందికదా అని నోటి కొచ్చినట్లల్లా కూసిన మొగాణ్ణేం చెయ్యాలంటారు?

కు— దండలేసి ఊరేగించాలంటాను! సంగతేమిటో చెప్పమంటే యీ కట్టుకథ లన్నీ ఎందుకూ?

సం— (దీనంగా) అవున్లెండి. మీ రాయనకి గురువేగా! మీరే నేర్పుంటారీ విద్యలన్నీ.

కు— వాడెవడు! ఏమిటీగొడవ? నాకు చాలా అర్జెంట్ పనుంది. మీకు త్వరగా చెప్పడం రాకపోతే కాయితంమీద రాసి పోస్ట్ చెయ్యండి. ఇదిగో నా ఎడ్రస్ (విజిటింగ్ కార్డు ఇస్తాడు).

సం— ఏమీతెలియనట్టు మాట్లాడతారే! ఆ మార్కండేయులు మీ శిష్యపరమాణువేగా! పైకిమాత్రం బ్రహ్మచారిని బ్రహ్మచారిని అంటూ నటాయించడం. దార్లో ఒంటరిగా ఆడపిల్ల కనబడితే ప్రేమా పెళ్ళీ అంటూ వెంటబడటమూనా!

కు— మార్కండేయుడా! మీకేమైనా మతిపోయిందా!

సం— నాకేంగాని అతనికి మతిపోయుంటుంది. (సాలోచనగా) అవునండోయ్! అతనికి పిచ్చెత్తి వుంటుంది. లేకపోతే నిన్న మొన్నటి వరకూ ఆడపిల్లలంటేనే హడిలి చచ్చేవాడు. ఇందాక అలా నా వెంటపడి తరమడం, పైగా మిమ్మల్ని వెధవా, బోడీ అని నానామాటలూ అనడం... అవును. అవన్నీ పిచ్చిలక్షణాలే!

కు— ఆఁ!...నన్ను తిట్టేడా?

సం— అవన్నీ ఇంకెందుకులెండి! మీ రన్నట్టు అతనికి పిచ్చెత్తి వుంటుంది. మీ కనవసరంగా శ్రమ కలిగించి విసిగించేను. క్షమించండి. శలవు!

కు—ఉండండి. అసలు ఏం జరిగిందీ?

సం— అవన్నీ నేను కాగితంలో రాసి పంపిస్తాను.

కు— నాపని ఎలాగా పాడయ్యింది. సంగతేమిటో చెప్పండి.

సం— నాకు త్వరగా చెప్పడం రాదండీ.

కు— గుడ్ గ్రేషస్! సరే సావకాశంగానే చెప్పండి.

సం— ఇందాకా యిక్కడే యీ రోడ్ మీదే ఆయనలా వొస్తున్నాడు. నేనిలా ఎదురుగా వెడుతున్నాను. ఎవళ్ళదార్ని వాళ్ళు పోతున్నా మనుకుంటే, అదేం

పొయ్యేకాలమో చటుక్కున రోడ్‌కి అడ్డంతిరిగి ధన్నుమని యిలా నన్ను ఢీకొట్టేడండీ. (అంటూ కుటుంబరావుని ఢీకొడుతుంది.) ఇదేమయినా బాగుందాండీ!

కు— చాలా బాగుందండి.

సం— (కోపంగా) బాగుందా!

కు— ఐ మీన్! మార్కండేయుడు డేష్ కొట్టటం మాట కదూ! ఏడిసినట్టుంది. రాస్కెల్! ఎన్ని వేలగుండెలున్నయ్! ఎంత మదం!

సం— అప్పుడు నే నాయనతో అన్నాను... "ఏమండీ ఇదేం ధర్మం కాదు. నేను అబలని, నిస్సహాయురాల్ని. మీరందమైన వాళ్ళే కావచ్చు..."

కు— వాడి బొంద. అందం! బకాసురుడు! వాడి అందాన్నే మెచ్చుకోవాలి! రౌడీ వెధవ! బ్రహ్మచర్యంట! వాడి శ్రార్ధం! ఊఁ... ఇంకా ఏమన్నారూ?

సం— "మీరందమైన వాళ్ళే కావచ్చు, ధైర్యమయిన వాళ్ళే కావచ్చు—"

కు— ఎవడు! వాడా ధైర్యవంతుడు! రెండు సార్లు పెళ్ళంటే హడలి ఆత్మహత్య చేసుకోబోతుంటే... రక్షించేను. పిరికి వెధవ... ఊఁ...

సం— "అందమైన వాళ్ళే కావచ్చు' ధైర్యమయిన వాళ్ళే కావచ్చు, పెద్ద రొమాంటిక్, హీరోయే కావచ్చు..."

కు— రొమాంటిక్ హీరో! గుడ్ హెవెన్స్! ఫుట్‌బాలూ, లాంగ్ జంపూ హైజంపుల్లో హీరో. రొమాన్స్‌లో మాత్రం జీరో. వాడికి రొమాన్సేమిటీ; నాన్‌సెన్స్! తర్వాత ఏమన్నారూ?

సం— "తప్పండీ... అలా చెయ్యకూడదు" అన్నానండి.

కు— ఇంకా అనడమేమిటండి! లాగి లెంపకాయ కొట్టాలికాని!

స— ఏమిటో ఆయన మొహం చూస్తే కొట్టబుద్ధవ్వలేదండీ. అమాయికుడిలాగుంటాడు.

కు— వాడా అమాయికుడు! కాలాంతకుడు! శుద్ధ కరోడా! కన్న తల్లిదండ్రులు కంటికీ మంటికీ ఏకధాటిగా కన్నీరు కారుస్తూ బంగారంలాంటి మేనరికంవుంది చేసుకోరా అని బతిమాల్తే ఆజన్మబ్రహ్మచారిగా వుండిపోతానంటూ వెధవ రాతలురాసిన కిరాతకుడు.

సం— నాతో ఎన్ని అబద్ధాలాడేరనుకున్నారూ! ఆకాశరామన్న ఉత్తరం రాసి మీరే ఆయన పెళ్ళి చెడగొట్టేరుట.

కు— ఓరి వీడి నాలిక తెగెయ్యా!

సం— మీరో పెద్ద బ్రహ్మచర్యోపాసకులనీ, మీ సహవాసం

వల్లనే పాడైపోయానని అన్నాడండాయన.

కు— మాటిమాటికీ 'ఆయన ఆయన' అంటూ ఆ శ్యాంప్‌ను మన్నిస్తారెందుకూ. వాడనండి చాలు. ఇంతకీ వాడిదగ్గర నా ప్రసక్తి ఎందుకొచ్చిందీ!

సం— అది చెప్పడానికే సిగ్గేస్తోందండి.

కు— ఛ! సిగ్గెందుకూ! నే నేం పరాయివాణ్ణా! చెప్పండి.

సం— మీరు మాటిమాటికి 'అండి అండి' అంటుంటే పరాయివాళ్ళు కాకపోతే దగ్గర వాళ్ళవుతారా!

కు— ఓ! అదా—చెప్పు!

సం— ఆయన అన్నాడూ "సంధ్యా నిన్ను నేను ప్రేమించాను..."

కు— ఏమిటీ! సంధ్యా అని పిల్చేడేం! పరస్త్రీని నడిరోడ్డుమీద పేరెట్టి పిలుస్తాడా! స్కౌండ్రల్!

సం— "సంధ్యా నిన్ను నేను ప్రేమించాను. పెళ్ళిచేసుకుంటాను. లేకపోతే నేను బతకలేను." అంటూ చెయ్యి పట్టుకుని ఒకటే లాగడం!

కు— ఆఁ...... చెయ్యి పట్టుకున్నాడా! ఎంత బరితెగించేడూ! చూడు సంధ్యా ఇంకమీదట వాడు కనపడ్డా పలకరించినా వాడికేసయినా చూడొద్దు. వాడి ధోరణి వింటుంటే పిచ్చెమోనని అనుమానంగా వుంది... ఇవ్వాళ చెయ్యి పట్టుకున్నాడు. రేపు కరుస్తాడు. అయినా చెయ్యెందుకు పట్టుకోనిచ్చేవు?

సం— నేను పట్టుకోనివ్వడమేమిటండీ! మంచివారే! మీదగ్గిర ఇంత చనువుగా వున్నానని ఆయనదగ్గిరా వుంటాననుకున్నారా ఏమిటి!

కు— అబ్బెబ్బె! నీ సంగతినాకు తెలీదూ! మనస్నేహం మన ప్రేమానురాగాలూ వేరు. ఇంకేమన్నాడూ?

సం— "నన్ను పెళ్ళాడటానికి నీ కభ్యంతరం ఏమిటి? అందం తక్కువా? చదువు తక్కువా? ఐశ్వర్యం తక్కువా?" అని ఒకటే నిర్బంధం.

కు— ఓరి వీడి ప్రణయ సాహిత్యం పాతెయ్యా! వీడో శుద్ధ 'సింపుల్టన్' అనుకున్నానిన్నాళ్ళూ. అప్పుడు నువ్వేమన్నావు?

సం— "మీరలా బలవంతం చెయ్యడం తప్పు. నన్నాలోచించుకోనివ్వండి. నాకు ప్రేమ ముఖ్యం. ఇక చదువు అందం ఆస్తీ అన్నారా. మీకంటె అన్నింటిలోనూ మించిన వాళ్ళెంతమందో వున్నారు. ఆమాట కొస్తే... (సిగ్గుపడుతూ ఆగిపోతుంది)

కు— ఊఁ... ఆమాటకొస్తే.

సం— మీపేరు చెప్పేనండి.

కు— భేషయినపని చేశావు.



కుక్క కాటుకు చెప్పు దెబ్బన్నట్టు బుద్ధొచ్చీలా సమాధానం చెప్పేవు.

సం— దాంతోటి రెచ్చిపోయి మిమ్మల్ని "అల్ఫాబెటికల్ అర్డర్"లో "ఏన్స్, బ్రూట్, క్రూక్, డన్స్" అంటూ ఒకటే తిట్లు. (కళ్ళుతుడుచు కుంటూ) వినలేక పోయాను.

కు— విచారించకు.

సం— నన్ను గురించికాదండి విచారం... మిమ్మల్నలా నోటి కొచ్చినట్లు... ...

కు— తిడతాడు. తిడతాడు. తిట్టడూ. వాడికి రోజులు దగ్గర పడ్డాయి. రేపే వాళ్ళ మేనమామకి ఉత్తరం రాస్తా.

సం— వాళ్ళ మేనమామేం చేస్తాడండీ!

కు— చావగొట్టి చెవులుమూసి పెళ్ళిచేస్తాడు. దాంతో వాడిరోగం చప్పగా కుదురుతుంది.

సం— (దెబ్బతిన్న ధోరణిలో) అఁ!... పెళ్ళాడితే రోగం కుదురుతుందా! అయితే ఆయన చెప్పినట్టు మీరు నిజంగా బ్రహ్మచర్యోపాసకులే నన్నమాట! దేవుడిలాంటి మార్కండేయులుగార్ననుమానించాను. వెళ్ళి ఆయన కాళ్ళమీదపడి క్షమాపణ చెప్పుకుంటాను. (వెళ్ళిపో బోతుంది.)

కు— అఁ అఁ అఁ!... (చెయ్యి పట్టుకు లాగి)ఏమిటా తొందర; నన్ను సమాధానం చెప్పనియ్యి. ఒకప్పుడు బ్రహ్మచారిగా వుండిపోటానికి నిర్ణయించుకున్నమాట నిజమే. కాని, నిన్నుచూసిన క్షణంలో ఆ నిర్ణయం పటాపంచలైపోయింది.

సం— ఏమో బాబూ! నాకు భయంగా వుంది. అసలు మీతో ఇంతసేపు మాట్లాడదామనుకోలేదు. నాకు తెలియకుండానే నేను నా హృదయంవిప్పి మీతో చెప్పేశాను.

కు— అదే ప్రేమంటే. మొదట్లో కొంచెం భయం భయంగానే వుంటుంది. రాను రాను అదే మన హృదయాల్లో అమృతవర్షం కురిపిస్తుంది.

సం— నా కేమిటో కొత్తగా వుంది. మీ కేమిటో చాలా అనుభవం వున్నట్టుంది. (చెయ్యి విదిలించుకుని) మార్కండేయుడి మేనమామకి ఉత్తరం పత్రం వొద్దుకాని, ఓ సారి ముఖాముఖీన కల్సుకుని చివాట్లు పెట్టండి. నే వస్తా.

కు— సంధ్యా! సంధ్యా!

(వెంబడిస్తాడు.)

♦ ♦ ♦

4 వ రంగము

[హనుమంతరావు యింట్లో సావిడి. రెండు మూడు కుర్చీలు ఓ టీ పాయి వుంటాయి. హనుమంతరావు సావకాశంగా సిగరెట్టు కాల్చుకుంటూ పేపరు చూస్తూవుంటాడు. చేతులో కూరగాయల సంచీతో సన్యాసి ప్రవేశిస్తాడు.]

స— నమస్కారం సార్.

హ— ఏరోయి సన్నాసీ! ఏవిటి విశేషాలు. చేతులో ఈ కూరగాయల సంచీ ఏమిటి! మార్కండేయుడి మఠంలో వంటా గింటా కూడా పెట్టేవా యేమిటి!

స— ఛ ఛ! ఆయనక్కాదు బాబూ, మాయింటికి. నెల్లాళ్ళయింది సార్ పెళ్ళిచేసుకున్నానండీ.

హ— పెళ్ళా! మైగాడ్. అయితే సన్యాసి సంసార య్యేడన్నమాట. వెనక మార్కండేయుడి పీకల మీదికి పెళ్ళొచ్చి నప్పుడు పెళ్ళొద్దని నెత్తి మొత్తుకున్నావు కదరా!

స— అవునను కోండి. కాని ఎన్నాళ్ళీ ఒటేలు మెతుకులు తినమంటారు సార్! అదీకాక నావయస్సోళ్ళందరూ పెళ్ళాడి మొగుళ్ళూ పెళ్ళాలూ చెట్టా పట్టా లేసుకుని సినీమాల్లోలాగా సిలకా గోరింకలాగ నాకళ్ళ ముందే తిరుగుతుంటే ఏటయితే అయిందని పెళ్ళాడేసేను బాబూ.

హ— ఓరి చవటా! నీతప్పేముందిలే. ప్రపంచంలో ప్రతీ మొగాడూ పడ్డగోతిలోనే నువ్వూ పడ్డావు. కానుకే అనుకుంటావో కనికరమే అనుకుంటావో యిందఈ పదిరూపాయలు తీసుకో.

స— కట్టంతెలిసిన మారాజులు. మాయావిడి పదిరోజుల్నుంచి పెర్లిన్ రయిక గుడ్డతెమ్మని పోరెడుతోంది. ఇప్పుడే అది కూడా కొనుక్కుపోతా.

హ— సెభాష్! అయితే రక్తి కట్టిందన్నమాట నీసంసారం. ఏమిటి ఇలా కొట్టుకొచ్చేవు?

స— నామొహం. సంతకెళ్ళా! మాయావిడి ఊసులోపడి అసలు పని మరిచిపోయాను. మా బాబుగారిక్కడి కొస్తానని చెప్పమన్నారండి.

హ— (మార్కండేయుడు రావడం చూసి) పాపీచిరాయుః అన్నారు. నీకు నూరేళ్ళాయుష్షు. నీ మాటే అనుకుంటున్నాం.

మా— ఇల్లేమిటి యింత నిశ్శబ్దంగా వుంది! మీ ఆవిడినీ పిల్లల్నీ పుట్టింటికి తోలేసేవా!

హ— అంతదృష్టంలేదు బ్రదర్. మాఆవిడ తాలూకు చుట్టాలెవరో దిగేరు. మొగాడేమో మా పిల్లల్ని తీసుకు షికారు పోయాట్ట. ఆడాళ్ళేమో మా ఆవిడతో వంటింట్లో బాతాఖానీ కొడుతున్నారు.

మా— నీతో ఓ ముఖ్యమయిన

విషయం మాట్లాడ్డానికొచ్చేను.

హ— మాట్లాడు.

మా— నేను పెళ్ళాడ్డానికి నిశ్చయించుకున్నాను.

హ— పెళ్ళా!

మా— జీవితానికో అర్థం పరమావధి అవసరం. జీవితంలో ఓ బాధ్యతగల వ్యక్తిగా జీవించాలంటే సమాజంయొక్క కట్టుబాట్లు గౌరవించడం మన ధర్మం. ప్రపంచ జనాభాలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ. నాలాంటి మొగాళ్ళందరూ బ్రహ్మచారులుగా వుండిపోతే ఆ స్త్రీల జీవితాలేమయిపోవాలి!

హ— వాళ్ళని కూడా బ్రహ్మచారిణిలుగా వుండమని బోధిద్దాం.

మా— ఈ విషయంలో నీబోడి సలహా అనవసరం. బ్రహ్మచర్యం స్వార్థ జీవితానికి దారితీస్తుంది. గృహస్థాశ్రమం వేదోక్తమయిన మానవ ధర్మం. ఈలక్ష్యంతోటే భగవంతుడు మానవుల్ని స్త్రీపురుషులుగా విభజించేడు.

హ— ఓరి నీవేదాంతం తగలెయ్యో! మీనాన్న దగ్గిర్నుంచి మళ్ళీ వుత్తరం వచ్చిందా ఏమిట్రా.

మా— డోంట్ బీ సిల్లీ!

హ—మీ మేనమామ కట్నం రేటు పెంచితే నువ్వు ప్లేటు మారుస్తున్నావా!

మా— అసలా సంబంధమే కాదురా. సంధ్యని పెళ్ళాడద్దా మనుకుంటున్నా.

హ— ఎవరూ! సంధ్యా! ఆ పి. యు. సి. చదువుతున్న అమ్మాయి. ఆ గరల్స్ హాస్టల్ సెక్రటరీ!

మా— అవును ఆ అమ్మాయి నేనూ ప్రేమించుకున్నాం.

హ— వెళ్ళి వెళ్ళి పెద్ద పాము నోట్లో పడ్డావేమిట్రా!

మా—ఒరేయి!నీ చవటశకునపక్షి ప్రసంగం నాతో కట్టిపెట్టి, ఆ కుటుంబరావుగాణ్ణి ఒళ్ళు దగ్గిరపెట్టుకుని ప్రేమా పెళ్ళీ అంటూ పిచ్చి పిచ్చి వేషా లెయ్యొద్దని సలహా చెప్పు. ఇప్పుడు వాడిక్కడి కొస్తాడుగా! వాణ్ణికూడా రమ్మని కబురంపించేవుట.

హ— నేను రమ్మనడ మేమిటి?

మా— మీ పిల్లల్నిద్దర్నీ తీసుకుని, మీ చుట్టంట ఎవడో, తీరుబడి చేసుకుని మిమ్మల్నీ కుటుంబరావుగార్నీ ఓ సారి అర్జెంటుగా హనుమంతరావుగారు రమ్మన్నారండని చెప్పి పోయేడు.

హ— ఈ కొత్తచుట్ట మెవడో నాకూ తెలీదు. రానీ పిలక జాడిస్తా.

మా—పోనీగాని, వెంటనే కుటుంబరావుకు బుద్ధి చెప్పాలి.

హ— ఊళ్ళో కలరా వుందని విన్నాను. కాని, ఇంత ప్రబలమైన ప్రేమజ్వరం వ్యాపిస్తుందని వినలేదే!

కు— (ప్రవేశిస్తూ) ఏమిట్రోయ్! ఏదో వినలేదంటున్నావు. ఈరోజుల్లో కనీ వినీ ఎరుగని చిత్రాలెన్నో జరుగుతున్నాయి. (మార్కండేయుడికేసి తిరిగి) ఇదుగో! మన "ట్వంటియత్ సెంచరీ రోమియో" యిక్కడే వున్నాడు.

మా— నీ వ్యాధి ఇంత ముదిరిందని తెలియదు. లేకపోతే యీపాటికే మందిచ్చేవాణ్ణి.

కు— ఆ మందేదో నువ్వు వాడిచూడు. నీ రోగం అప్పుడే సంధిలోకి దిగింది.

హ— మీ యిద్దర్నీ కట్టకట్టి తగలెయ్య! మీ రిద్దరూ ఓ అమ్మాయినే ప్రేమించారా ఏమిట్రా!

కు— (చెవులు మూసుకుంటూ) హరహర! పాపము శమించుగాక! నేను ప్రేమించాను. వాడు ప్రేమించాననుకుంటున్నాడు. ఇంతకీ పాపం! వాడికి అనుభవం చాలదు.

మా— నీ కంత అనుభవముంటే మరో అమ్మాయిని ప్రేమించుకో. నీ ఆరోగ్యం బాగుండాలంటే సంధ్య వెంట పడటం మానెయ్యి. ఇంతవరకూ నువ్వుచేసిన తప్పుల్ని క్షమిస్తాను.

కు— చూడు బ్రదర్! నువ్వు నిజంగా ప్రేమిస్తే......

మా— నేనా అమ్మాయిని మనసారా ప్రేమించాను. ఒకళ్ళ హృదయాలు ఒకళ్ళు యిచ్చిపుచ్చుకున్నాం.

కు— ఏడిశావ్! మీరు యిచ్చిపుచ్చుకున్నవి బజార్లో దొరికే ఫౌన్టెన్ పెన్నూ జేబురుమ్మాలూను.

మా— అంతా నీ కనవసరం.

కు— నాకు చాలా అవసరం. నేను ప్రేమించిన అమ్మాయిని నువ్వు ప్రేమిస్తున్నానంటే నా హృదయం ఎంత క్షోభిస్తుందో......

మా— నువ్వూ నీ హృదయం కలిసి గోదావర్లో పడండి.

హ— (అనునయంగా) అది కాదురా మార్కండేయుడూ! మొన్న మొన్నటి వరకూ ఆడదంటే హడలి చచ్చేవాడివి, పెళ్ళంటే ఒళ్ళు మంటనేవాడివి. అలాంటిదిఇంతట్లోకే ఈ ప్రేమ దెయ్యం ఎప్పుడు ఆవహించిందిరా.

కు— వాడికి ప్రేమేమిట్రా! వాడిశార్ధం! ప్రేమించడమంటే ఫుట్‌బాల్ ఆడడమా! పోనీ ఇప్పుడైనా చెప్పమను. ప్రేమంటే ఏమిటి! వాడి ప్రేమకి నిదర్శనం ఏమిటి!

మా— (స్వాప్నికంగా) సంధ్య రూపాన్ని నా హృదయ ఫలకం మీద చిత్రించుకున్నాను. ఎప్పుడూ ఆ అమ్మాయి నా కూడానే వుండాలనీ, ఆ అమ్మాయితోటే మాట్లాడాలనీ, ఆ అమ్మాయికోసం ఏ త్యాగమైనా చెయ్యాలని ఉంటుంది. కళ్ళు

మూసినా కళ్ళు తెరిచినా సంధ్యే కనబడుతుంది.

కు— ఏడిశావు! కళ్ళుమూస్తే నీకు నిద్రొస్తుంది. కళ్ళుతెరిస్తే ఆకలేస్తుంది. నీకు సంధ్యెప్పుడు జ్ఞాపకముంటుంది! ఆ మాత్రం జ్ఞాపకశక్తే వుంటే ఏనాడో పరిక్ష పేసవుదువు.

మా— నోర్ముయ్. కోపమొస్తే నే మనిషినికాను.

హ— ఒరేయి! కుటుంబం! నువ్వూరుకో. ఉత్తప్పుడే వీడు మృగం. పైగా యిప్పుడు ప్రేమ దెయ్యంకూడా పట్టింది. (మార్కండేయుడితో) నువ్వా సంధ్యని ప్రేమించేవే అనుకో. మరి ఆ అమ్మాయి నిన్ను ప్రేమించక్కర్లేదా ?

మా— నేనంటే ఆ అమ్మాయికి పంచప్రాణాలూను.

కు— నువ్వంటే ఆ అమ్మాయికి పరమ అసహ్యం, డోకూను.

మా— ఇన్నాళ్ళూ నా స్నేహితుడువన్న అభిమానంకొద్దీ, నువ్వు నన్ను తాగుబోతన్నా రౌడీ అన్నా క్షమించేను. నువ్వు ఎన్ని కుట్రలూ కుతంత్రాలూ పన్నినా చివరికి సంధ్య నన్నే ప్రేమించింది. సత్యమే జయం! ధర్మమే జయం!! ప్రేమేజయం!!!

కు— నీలాంటి బడుద్ధాయి నే ఆడది ప్రేమిస్తుందిరా !

మా— నీకివ్వాళ తన్నులు తప్పేయోగం లేదు.

కు— తన్నడానికి నేనేం ఫుట్ బాల్ని కాదు. దేహ్ కొట్టడానికి వొంటరిగావున్న ఆడపిల్లని కాను. ఇదీ మనుషులుండే లోకంరా. మరీ వెర్రి వెర్రి వేషాలేస్తే పదిమందినీ పిలిపించి పట్టించి నిన్ను బందిలిదొడ్డిలో పెట్టిస్తా.

మా— (కుటుంబరావు మీదికి ఉరికి కాలరు పట్టుకుని) సరే ఇప్పుడు చూడు—ఏ పదిమందొచ్చి నిన్ను రక్షిస్తారో!

హ— ఆఁ... ఆఁ... ఆఁ!... ... మార్కండేయుడూ!

మా— నువ్వు కలగజేసుకుంటే నీకూ తగుల్తాయి. ఇవ్వాళ వీడి అంతం చూస్తాను. ఒరేయ్—ఒక్క క్షణం టైమిచ్చాను. నీ ఇష్టదేవతా ప్రార్థన చేసుకో.

కు— (మార్కండేయుడి కాలరు పట్టుకుని) నా యిష్టదేవత సంధ్య.

మా— (గుద్దే ప్రయత్నంలో పిడికిలి బిగించి) మళ్ళీ ఆ మాటెత్తవు కదా!

స— (ప్రవేశించి) స్వామీ! పతిభిక్ష! పతిభిక్ష!

(కుటుంబరావు మార్కండేయుడూ ఒకళ్ళనొకళ్ళు విడిచిపెట్టి కాలర్లు సర్దుకుంటూ చుర చుర చూసుకుంటూ వుంటారు. హాతాశుడై కూర్చున్న హనుమంతరావు ఆశ్చర్యంగా లేచి సంధ్యదగ్గిర కొచ్చి ఎగాదిగా చూస్తాడు.)

హ— నువ్వెవరు? మా యింట్లోం

దెలా ఊడిపడ్డావు! వీళ్ళిద్దరూ బ్రహ్మచారి ముండావాళ్ళే! నీకిందులో పతియెవరు?

సం— నన్నలా దెయ్యాన్ని చూసినట్టు చూస్తారే! నా పేరు సంధ్య.

హ— (కుర్చీలో కూలబడుతూ) వీళ్ళిద్దర్నీ కాస్తదూరంగా తీసుకెళ్ళి చంపెయ్యి తల్లీ! ఈ హత్యాకాండ మా యింట్లో వొద్దు.

మా— సంధ్యా! నువ్వు ఊఁ... అను ఈక్షణంలోనే నీఎదుటే ఈ కుటుంబ్రావుగాణ్ణి హతమారుస్తా.

సం— మంచి పనిచేస్తారు! కాస్త అభిప్రాయ భేద మొచ్చేటప్పటికి అంతటి ప్రాణస్నేహితుల ప్రాణం తియ్యడానికే సిద్ధపడ్డారే! రేపొద్దున్న మీ పెళ్ళాం తప్పుచేసినా యింతేనా!

కు— సంధ్యా ఇటొచ్చెయ్యి. వాడు పిచ్చివెధవ. కరుస్తాడు.

సం— కరుస్తే కరుస్తారు. ఆయన నా బంగారు కొండ! మధ్యన మీరెవరు? మీరేమైనా నన్ను ప్రేమిస్తున్నారా!

కు— సంధ్యా! నువ్వేనా ఇలా అంటున్నది. నా ప్రేమనే శంకిస్తున్నావా!

సం— నన్ను నిజంగా ప్రేమిస్తున్నారా?

మా— ఏడిశాడు! ప్రేమేవింటి ...ంటి బొంద!

కు— నన్నలా అవమానించకు సంధ్యా! నీకోసం ఏత్యాగమైనా చేస్తాను.

సం— నిజంగానా ?

కు— అజ్ఞాపించి చూడు.

సం— నన్ను మనః పూర్వకంగా మార్కండేయుడి గారికిచ్చి పెళ్ళి చెయ్యండి.

కు— (గట్టిగా) సంధ్యా!

మా— అబ్బ! ఏమిట్రా అలా ఓండ్ర పెడతావు! సంధ్యకేమీ చెముడు లేదు. ఆమె మనస్సు చెప్పింది. 'యస్సో' 'నో' చెప్పెయ్.

కు— సరే, సంధ్యా! ప్రేమంటే ఏమిటో నీవల్లే తెలుసుకున్నాను. ప్రేమకి త్యాగమే ప్రమాణమయితే... ఇదుగో నా ప్రేమని రుజువు చేసుకోటానికి నిన్ను మార్కండేయుడి చేతుల్లో పెడుతున్నాను. (వాళ్ళిద్దరి చేతులూ కలుపుతాడు.)

మా— నువ్వు ధన్యుడివిరా కుటుంబ్రావ్. నీ ప్రేమ ఆచంద్రార్కం అమరగాథగా సాహిత్య గర్భంలో నిలిచి పోతుంది. నీ త్యాగానికి నా ధన్యవాదాలు. రా సంధ్యా పోదాం.

సం— (మార్కండేయుడి చెయ్యి విదిల్చి) ఎక్కడికి!

మా— మనం హాయిగా పెళ్ళి పెళ్ళి చేసుకుందాం.

సం— మనసారా నన్ను ప్రేమించేరా !

మా— సంధ్యా! నీ కేమయినా మతిపోయిందా !

సం— మతివుంది కనకనే అడుగుతున్నాను. మీకుప్రేమంటే ఏమిటో తెలుసా ? మీరు ఎవర్నీ ప్రేమించ లేదు. మీరు మిమ్మల్నే ప్రేమించుకున్నారు. మీ స్వార్థాన్ని గురించే ఎప్పుడూ ఆలోచించేరు. నన్నుమీరు పెళ్ళాడితే, మిమ్మల్ని పెంచి పెద్ద వాణ్ణిచేసి మీ మీ దే అన్నిఆశలూ పెట్టుకున్న మీ తల్లితండ్రులు ఎంత బాధపడతారో ఆలోచించేరా? మీ కోసం, మీ ప్రేమకోసం అహోరాత్రాలూ తపస్సు చేస్తున్న మా పిన తల్లి కూతురు మూలారాణి జీవితం ఏమయిపోతుందో ఆలోచించేరా ? అంతటి సుగుణవంతురాల్ని ప్రేమించడం చేతగాని మీరు నన్ను ప్రేమించారా !

మా— మూల మీ పిన తల్లి కూతురా !

సం— అవును. మీరు శాపనార్థాలు పెడుతూ పచ్చి అబద్ధాలతో ఆకాశరామన్న ఉత్తరాలురాసి మా చెల్లెలి హృదయంలో చిచ్చుపెట్టేరు.

మా— ఆ వెధవ రాతలన్నీ రాసింది ఈ కుటుంబరావుగాడు.

కు— పెళ్ళి ఆపకపోతే చస్తానంటే అలా రాశాను. వాడి మేనమామ ఆ ఉత్తరాలకట్ట నీకు పంపిస్తాడని కలగన్నానా !

సం— ఇలాంటి మనస్సు నిలకడ లేని మనుషులు బతకడంకంటె చావడమే మంచిది. అటు దాని ప్రాణాలు తీసేరు. ఇటు నన్ను ప్రేమించేరుట! పెళ్ళిచేసుకుంటారుట !

మా— అఁ... ...మూల చచ్చి పోయిందా !

సం— అది చస్తేయేం! మీరు రాయిలా వున్నారు చాలదూ! ఛీ! మీ మొహం మళ్ళీ నాకు చూపెట్టకండి.

మా— సంధ్యా ! నేను రాక్షసుణ్ణి. ప్రేమంటే ఏమిటో తెలీక నా మూలను పొట్టబెట్టుకున్న మహాపాపిని. ఛీ! ఈ జన్మెందుకు! వెంటనే చచ్చి పరలోకంలో వున్న మూల కాళ్ళమీదపడి ప్రేమభిక్ష వేడుకుంటాను.

సం— మీ కది సాధ్యంకాదు. మా మూలారాణి స్వర్గంలోవుంటుంది మీరు చస్తే నరకాని కెడతారు.

మా— అయితే నా పాపానికి నిష్కృతిలేదు. నాకు తరణోపాయం లేదు.


మూల (ప్రవేశిస్తూ) ఉందిబావా ! నన్ను పెళ్ళాడు !

మా— నువ్వు బతికేవున్నావా మూలా !

మూ— నీకోసమే బావా !

మా— మూలా! (మూలచేతులు తన చేతుల్లో అందుకుంటాడు.)

మూ— బావా! (ఇద్దరూ చెయ్యీ చెయ్యీ పట్టుకు నిష్క్ర



మిస్తారు.—కుటుంబ్రావు, సంధ్యా వాళ్ళవైపే చూస్తూ మౌనంగా వుంటారు. నెమ్మదిగా హనుమంతరావు కుర్చీలోంచి లేచి గొంతు సవరించుకుని సంధ్యవైపు వస్తాడు.)

హ— చూడమ్మాయ్! నువ్వా ఆ అమ్మాయి, ఆ ముసలాయినా మా యింటికొస్తే మా ఆవిడతరఫు బంధువులే అని నమ్మేను.

సం— నిజంగాకూడా బంధువులమేనండి. దూరపుబంధుత్వం, అయితేయేం! ఎంతో ఆదరంతో సహకారంతో మీ ఆవిడ ఈ సమావేశాన్నిక్కడ ఏర్పాటుచేశారు.

హ—ఓహో! అలాగా! చూడు, మిస్ సంధ్యా. నాకు ఇద్దరే ఇద్దరు ప్రాణమిత్రు లున్నారు. ఒకడు మార్కండేయుడూ. రెండోవాడు ఈ కుటుంబరావు. వీళ్ళిద్దరయినా బ్రహ్మచారులుగా వుండి సుఖపడతారేమోనని ఆశపడ్డాను. నీ మహేంద్రజాలంతో మార్కండేయుడి బ్రహ్మచర్యం నేటితో అంతం చేశావు. కనీసం ఈ కుటుంబరావునైనా బ్రహ్మచారిగా బతక నిస్తానని నాకు వరం ప్రసాదించు.

సం— అది నాతరం కాదు. నా హృదయం ఆయనకి ఏనాడో అంకితం చేశాను. ఆయన కాదంటే నాకు మరణమే శరణ్యం.

కు— సంధ్యా! నిజంగానా? (దగ్గిరికొచ్చి చెయ్యిపట్టుకుని) నేను చాలా అదృష్టవంతుణ్ణి.

హ— దౌర్భాగ్యుడా! కుటుంబరావ్! చూస్తూ చూస్తూ సంసార నరకంలో పడిపోతున్నావ్!

కు— (సంధ్యతో సహా నిష్క్రమిస్తూ) లాభంలేదు బ్రదర్! పదిమందితోపాటు చావుకూడా పండుగే నన్నారు ... టాటా !!

[హనుమంతరావు హతాశుడై కుర్చీలో కూలబడతాడు. తెరలోంచి అతని భార్య "ఏమండీ వాళ్ళందరూ వెళ్ళిపోయారా?" అంటుంది.

కుటుంబరావ్ పరధ్యానంలో పలకక పోతే గట్టిగా ఏమండీ, మిమ్మల్నే" అని కేకేస్తుంది. హనుమంతరావు 'ఆఁ ఆఁ' అంటూ ఉలిక్కిపడిలేచి తెర లోంచి వినబడే భార్య ప్రశ్నలకి సమాధాన మిస్తూంటాడు.]

హ. భా— ఎంత పిలిచినా పలక రేమండీ! నిద్రోతున్నారా!

హ— లేదు. ఏదో మూర్ఛ వొచ్చినట్టయింది.

హ. భా— ఈ సంసారం ముచ్చట కింక మూర్ఛరోగం రావడమే తరవాయి. సరేకాని...మా కాంతారావు అన్నయ్య మన పిల్లల్ని వెంటబెట్టుకు ఊర్లో కెళ్ళేడు. ఈ' వూరుకొత్త. ఏమయిపోయేరో ఏమో, కొంచెం వెళ్ళి వెతుకుదురూ.

హ— అలాగే.


హ. భా— ఎలాగా బయటు కెడుతున్నారు కనుక తమలపాకులు కూడా తీసుకురండి ...

హ— అలాగే.

హ. భా— వచ్చేటప్పుడు దార్లో... ...

హ— అలాగే! అలాగే! (నిష్క్రమిస్తాడు)

□□□



శోకాలూ - శ్లోకాలూ

'మానిషాద' మహా శ్లోకం
సంస్కృతంలో ఆదిరస్తా,
వాల్మీకి సౌజన్యముతో
తెల్గులో నే నలా రాస్తా!

●

టాగూరేమో మిస్టిసిజం
గోంగూరేమో ఆంధ్రాయిజం
ఏమీకాంది ఎక్కడుంది?
లేకేం భాయీ, ఉంది హిందీ!

●

పల్క లేని పదాలన్నీ
కలిపేద్దామా గంగలో—
నగ్నం ఎలాగైందో "నంగా"
సిగ్నల్ అలాగే ఔ "సింగల్."

●

గురజాడ కవే కాదు!
మహాత్ముడా ఏమిగాంధీ!!
గురూ, ఏమేనా అంటాడు,
పేరుకోస మిదో రంధీ!!!

పోరు నష్టం, పొందు లాభం
అంటే అర్థం చెబతారూ?
ఓ యస్, నువ్వు పొందు లాభం
నష్టపోరులే ఎవరూ!

●

అందలం అంతా ఎక్కితే
మోసేవా రెవరంటావా?
కారు స్విచ్ నీవే నొక్కితే
స్వయంగా మోసుకుంటావా!

●

మాటల్లో ఉన్న మార్దవం
మింగిందీ గాన గార్దభం
సరిపోయిందీ అంతతో
చచ్చింది అర్థం స్వరంతో!

●

కొనుక్కోవాలంటే బియ్యం
క్యూలో తప్పదయ్యా కయ్యం!
ఎందుకూ మా కీ జీతాలూ
ఇచ్చికూడదా భత్యాలూ!

వజ్ఝల కాళిదాసు

ప్లానింగు ల్లెన్నో వింటున్నాం
ఉత్పాదనమాత్రం సున్నా!
కాదులే ఒప్పుకుంటున్నా
పిల్లల్ని తెగ కంటున్నాం!

గాయకుల్లెంత పాడినా
వినేవాడే దొరకడోయ్!
నాయకుం డేం మాట్లాడినా
అందరూ తెగ విందురోయ్!

●

బాలకవి అర్థంలాగే
శిశువైద్యుడికీ అంటూ,
చాలులే, నీ విలా వాగే
వా, సమాసం తెచ్చు తంటా!

మంత్రాలకి చింతకాయ
లెలా రాలునో తెలీదా?
నినాదా లందరూ చేయ
ఏదో ఫలించడంలేదా!

●

అందరూ సలహాలిస్తే
పాటించే మూర్ఖు డెవ్వడో
డబ్బున్న రోగి వైద్యుల్ని
వంద పెట్టుక చావడో!

తెల్లువారలకే తప్ప
తెలీదయ్యా ప్రాసా యతీ;
నవ్యకవిత్వంలో గొప్ప
మర్మభావం, ధ్వనీ, గతీ!

●

ఉపమా కాళిదాసస్య
అంటే ఒప్పుకోడు మా ఫ్రెండ్—
ఉప్మా యిడ్లీన్లు దోశస్య
అయ్యర్ చేతిపాకమే గ్రాండ్!


స్వధర్మదీక్ష ఉచితం,
అన్నాది నాడు భారతం;
అన్ని మతాలూ సమ్మతం
అంటూంది నేటి భారతం!

చైత్రయాత్ర

ఈ కంటిలో వినోదం, ఆ కంటిలో విషాదం

ఫిలింతారల ఆత్మకథలకు ఇంగ్లండు, అమెరికాలలో ఎనలేని గిరాకీ వుంది.

ఎరాల్‌ఫ్లిన్ "నా క్రూర జీవిత విధానాలు" (మైవికెడ్‌వేస్) పేరిట వ్రాసిన ఆత్మకథ అమెరికాలో విశేష ప్రచారం సంపాదించింది. మొన్నీ మధ్య ఆస్కార్‌స్టార్ బెట్టీ



చార్లిచాప్లిన్ (1930)

డేవిస్ "ఒంటరి జీవితం." (దిలోన్లీ లైఫ్) పేరుతో రచించిన స్వీయ చరిత్ర కూడా అంతటి పాఠకాభిమానాన్ని చూరగొన్నది. అందులో ఆమె సినీ, వ్యక్తిగత జీవితానుభవాలను దాపరికం లేకుండా బైటపెట్టారు.

"షావుకారు" జానకి తన కుమార్తె వివాహానంతరం తన సినీ జీవితకథ రచించబోతున్నారు. ఒక ప్రసిద్ధ నవలాకారుడు (వేలసంఖ్యలో నవలలువ్రాసినవ్యక్తి) ఆమెకు సలహాలివ్వబోతున్నారని తెలుస్తున్నది.

భానుమతి, జమున స్వయంగానే ఆత్మకథలను వ్రాయ నుపక్రమించినట్లు తెలుస్తున్నది.

నాగేశ్వరరావు, రామారావు, సావిత్రి జీవిత చరిత్రలను వివిధ రచయితలు ఈవరకే గ్రంథస్థం చేశారు.

మరి కొలది రోజులలో దేవిక, సరోజ, కృష్ణకుమారి జీవితచరిత్రలు రాబోతున్నవి.

● ● ●

ప్రపంచానికి ఒకఅర్ధశతాబ్దిగా చిరపరిచితుడు చార్లిచాప్లిన్. నిజమైన హాస్యచక్రవర్తి. మహామేధావి.

వ్యంగ్యంలో నిరుపమ మహీపతి. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. 20 ఏళ్ళ క్రితమే నాల్గవసారి వివాహమాడి ఇన్నాళ్ళకి సుఖజీవితమంటే ఏమిటో తెలుసుకొన్నానన్నాడు.

1914 నుంచి 1957 వరకు 43 సంవత్సరాలపాటు నటుడుగా, దర్శకుడుగా సినీరంగంలో వుండి 80 చిత్రాలలో ప్రజ్ఞా ప్రదర్శనం చేశారు. అమెరికాలోనే 40 యేళ్ళు (1914–1954) గడిపారు. అ తర్వాత ఐరోపాకు విహారానికి వెళ్ళగా అమెరికాకు తిరిగి వెళ్ళేభాగ్యం లేక పోయింది. చాప్లిన్ బ్రిటిషర్. జీవితాంతం ఆ పౌరస్వత్వం నిలుపుకోదలచారు. ఐరోపాలో వుండగా చాప్లిన్‌ను తిరిగి అమెరికాకు రానివ్వమని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. స్విట్జర్లెండులో వుంటున్నారు.

ఆత్మకథ వ్రాశారు. 554 పేజీల చాప్లిన్ స్వీయ చరిత్రను లండన్‌లోని "ది బాడ్లే హెడ్" సంస్థ ఈ సంవత్సరంలోనే ప్రచురించింది. 115 చిత్తరువులుకూడా వున్న ఈ బృహద్గ్రంథం వెల 42 షిల్లింగులు.

చింకికోటు వేషాలతో అనేక "కోట్లు" సంపాదించిన చాప్లిన్ ఒకప్పుడు మహానికృష్టమైన దారిద్ర్యం అనుభవించారు. ఆయన వైవాహిక జీవితం ఎలా వున్నదో "నాలుగో పెళ్ళి సుఖంగా వుంది." అని ఆయన అనడంబట్టే తెలుసుకోవచ్చు. పోనీ అమెరికాలో అయినా ఆనంద జీవితం గడిపారా అంటే అమెరికన్ జీవిత విధానానికి తన వ్యక్తిగత పద్ధతులకు, ఆశయాలకూ పడక ప్రభుత్వంతో నిత్య సంఘర్షణలకు తలపడ్డారు. తర్వాత "క్విట్ అమెరికా" అనిపించుకోవలసి వచ్చింది.

వెండితెరపై విషాదపాత్ర ధారణతో వినోదం కుంభవృష్టిగా కురిపించిన చాప్లిన్ నిజ జీవిత పాత్ర కూడా అలానేవుంది. కుబేరుడుగా అందరికీ కన్పించాడు. కాని నిజ జీవితంలో, నిత్య జీవితంలో చాలా మానసిక బాధలు పడ్డారు.

చాప్లిన్ బాల్యదశ మహానికృష్ట పరిస్థితులలో గడచింది. తండ్రి త్రాగుబోతు. సంసారం గురించి పట్టించుకొనేవాడేకాదు. తల్లి నటి. సంపాదన చాలా చాలా తక్కువ. ఇద్దరు పిల్లలను (ఛార్లెస్, సిడ్నీ) పెంచాలి. అది 19 వ శతాబ్దం చివరి దశాబ్దాంతం. చాప్లిన్‌కు ఐదు సంవత్సరాలుండగా మరొక ఉపద్రవం సంభవించింది. తల్లికి ఆ చిన్న ఉద్యోగం కాస్తా పోయింది. అది మతిభ్రమణమునకు దారితీసింది కూడా. చాప్లిన్ లక్షలకు లక్షలు సంపాదించారు. మాతృ ఋణం తీర్చుకోవాలని ఎంతో తహతహ లాడారు. కాని ఏమిలాభం. డబ్బు అయితే సంపాదించ కలిగారు. మాతృదేవత మతిని సుగతికి తీసుకురాలేకపోయారు.

స్వీయ చరిత్రలో నూరుపేజీలకు పైన చాప్లిన్ తన దారిద్ర్యం గురించి, తన తల్లి సాగించిన జీవిత సమరం గురించి వివరించారు.

చాప్లిన్‌కు గాంధీజం అంటే అభిమానం మెండు. ప్రాచ్యపద్ధతులలో ఆసక్తి హెచ్చు. త్వరలో ఫిలిం ఫెస్టివల్‌కు భారత్ రావచ్చు. □□□

అందాల రోజా బి. సరోజా...



ఆమె నవ్వులరాణి. ఆమె 'స్మైల్' సినీ థియేటర్లముందు 'మైల్' పొడుగు క్యూ సృష్టిస్తుంది. ఆమె తెలుగులో స్వచ్ఛత లేకపోయినా తెలుగు పలుకులో ఓ వెలుగు, ఓ సొగసు వుంది. తెలుగు తెరకు భాషా రీత్యా ఆమె సరస్వతి కాకపోవచ్చు. కాని, అభినయందృష్ట్యా ఆమె సరస్వతే.

అంచేతనే ఆమధ్య ఆమెకు బెంగుళూరులో కళాభిమానులు 'అభినయ సరస్వతి' అనే బిరుదప్రదానం చేశారు

కన్నడ దేశంలో పుట్టిన కన్నడతార బి. సరోజాదేవికి కన్నడ దేశ మిన్న నగరం బెంగుళూరు బిరుదు బావుటా నెత్తితే భక్తిప్రపత్తులతో తలవంచడం సహజమేకదా.

బి. సరోజాదేవిగా తెలుగురంగానికి పరిచితమైన తార "పేరు" పెరుగుతుంటే క్రమేణా ఆమె "పేరు" తరగ నారంభించింది. బి. సరోజాదేవి "సరోజ"అయింది. ఈమధ్య "రోజ"గా వాడారు. తమిళరంగంలో ఆమె కాలిడినప్పుడు ఎవరీ కొత్త పద్మిని అని కొందరు ప్రశ్నించారు. ఎవరీ కొత్త వైజయంతీమాల అని ఇంకొందరు ప్రశ్నించారు. ఇప్పటికీ సరోజ స్టిల్‌ను వైజయంతి స్టిల్‌గా భ్రమపడంగారు పడ్డం కద్దు.

కన్నడ తెరనుంచి హిందీ తెరకు ఎగసిన మగువ బి. సరోజాదేవి క్రైస్తవ మతప్రచారిణిగా జీవితం గడపదలచిందికాని, ఆ కాళిదాస మహిమవల్ల చిత్రకళ పాల్పడింది.

సరోజ బెంగుళూరులో 1942 జనవరి ఏడవ తేదీని జన్మించింది. కాన్‌వెంట్ స్కూల్లో విద్యాకాలక్షేపం చేసింది. ఆ ప్రభావమే క్రైస్తవ మత ప్రచారిణి కావాలన్న కుతూహలం కలిగించింది. స్కూల్లోనే కథక్ నృత్యం, హిందూస్తానీ సంగీతం అభ్యసించింది. కొంచెం పెద్దపిల్ల

అయ్యాక పాడుతూవుంటే లతా మంగేష్కరా అని అనుకొనేవారు శ్రోతలు దానికి తగ్గట్టు ఓ స్కూలు ఉత్సవంలో సరోజ తన అభిమాన గేయమైన "అనార్కలి" హిందీ చిత్రంలో లతామంగేష్కర్ పాడిన "జిందగి ఉసీకిహై" పాట పాడారు. ఆ ఉత్సవానికి వచ్చిన హొన్నప్ప భాగవతార్ (నటుడు, దర్శకుడు, నిర్మాత) ఆ కంఠ మాధుర్యానికి పులిక్కిపడి తను కన్నడంలో తీయబోతున్న "కాళిదాసు"లో ప్లేబ్యాక్ పాటలకు సరోజను బుక్ చేశారు. తర్వాత ఆమె అందచందాలుచూసి కాళిదాస సతి పాత్రకు బుక్ చేశారు. అప్పటికి సరోజ వయసు 13. పదమూడవ సంవత్సరంలో నాయిక అయినది సరోజ. తీన్ తేరా... అన్నది తప్పని ఈ తెర తేరా సరోజ నిరూపించింది.

ఎన్. టి. రామారావు "పాండురంగ మహాత్మ్యం" సరోజకు తెలుగు రంగంలో ఓ మహత్యానికి మొదటి మెట్టు వేసింది. "పెళ్ళికానుక"తో ఆమె "గ్లామర్ గర్ల్" అయింది. పింగళి, కె. వి. రెడ్డి గారలు ఆమె గ్లామర్‌కు సరిపోయే విధంగా ఆమెకుగాను తెలుగు "గ్రామర్" సృష్టించి, జగదేక సుందర తార చేశారు. ఇక తెలుగు తెరపై ఆమె దాగుడు మూతలు చూచేందుకు కలవరించని, పలవరించని, యువప్రేక్షకులు అరుదు.

తెలుగు రంగంలో ఆమె నాయికగా త్వరలో రానున్న చిత్రం ఎన్. ఆర్. మూవీస్ వారి "ప్రమీలార్జునీయం". శ్రీ సామ్రాజ్యంలో (స)రోజ బృందం పురుషులకు పువ్వు చూపి ముళ్ళతో గ్రుచ్చినతీరు ఈ చిత్రంలో చిత్రాతిచిత్రం. నవంబర్‌లో ప్రమీల మందిరంలో షూటింగ్ జరిగింది. నాల్గింట మూడువంతులు చిత్రం తయారైంది. సరోజా కాల్ షీట్స్ లభించడమే తరువాయి చిత్రం పూర్తి అవుతుంది. 1964 సెలవు తీసుకొనేలోగా మన సినీ సెలవులలో ఈ చిత్రం వుంటుంది. దర్శకుడు మల్లికార్జునుడు. పింగళి తన పాళీని అటు ప్రేమ ఘట్టాలలోనూ ఇటు ఉద్వేగ సన్నివేశాలలోనూ సమ ప్రతిభతో సవ్యసాచిలా నడిపించారు ఈ అర్జున (రామారావు అర్జునుడు) ప్రణయ ప్రళయ గాథా చిత్రంలో.

• • •

క్రొత్తనటి కాంచన

ప్రేమ అంటే సినీమాకు పంచ ప్రాణాలు. ఇప్పుడు ఆరవ ప్రాణం వచ్చింది. ఈ చిత్రం పేరుకు ప్రేమ ఆరవప్రాణం. క్రొత్తగా ఈప్రేమ బాణం వేసింది పద్మశ్రీవారు. "ప్రేమించిచూడు" షెడ్యూల్ ఫైనలైజ్ చేశారు. దీనికి శ్రీధర్ సిల్వర్ జూబిలి తమిళ చిత్రం "కాదలిక్క నేరమిల్లై" మూలం. తమిళ చిత్రంతో

బంగారు భామ కాంచన పరిచయమైంది. ఈ విజయవాడ విజయతార "ప్రేమించిచూడు"లో కూడా బుక్ అయింది. ఈమెను త్వరలోనే ఉత్తరగా "వీరాభిమన్యు"లో చూడబోతున్నారు. చూసిన సాంఘికంలో కాంచన చిన్ని కాంచన మాలగా కన్పించింది. "ప్రేమించి చూడు"లోను ఆమెను అలానే చూసి తీరుతారు!

తారా మండలం నుంచి తారాపథానికి వచ్చిన వసుంధరే కాంచన.

విజయవాడలో సివిల్ ఇంజనీర్ శ్రీ రామకృష్ణశాస్త్రిగారి కుమార్తె వసుంధర. 1939 ఆగస్టు 16 తేదీన విజయవాడలో జన్మించింది. మద్రాసులో విద్యాభ్యాసం. గుడ్ షెపర్డ్ కాన్వెంట్ లో చదువుకున్నది. మద్రాసులో మ్యూజియమ్ థియేటర్‌లో తొమ్మిదవ యేటనే భరత నాట్య తొలి ప్రదర్శన (అరంగేట్రమ్) మిచ్చింది. మద్రాసులోని ఎతిరాజ్ స్త్రీల కళాశాలలో ప్రీ యూనివర్శిటీ కోర్సు చదివారు. ఆంగ్ల నాటకాలలో పాల్గొన్నారు. "ఏజ్ యు లైక్ ఇట్"లో సీలియా పాత్ర ధరించారు. ఎన్. సి. సి. లో కూడా చేరారు. కాలేజీవిద్యానంతరం తమిళ నాటకరంగంలో ప్రవేశించి "లంకేశ్వరన్" (మనోహర్ ప్రసిద్ధనాటకం) లో సీతగా నటించారు.



కాంచన

తారామండలంవైపు—అనగా ఆకాశంవైపు—దృష్టి మరలింది. విమాన సంస్థ ఇండియన్ ఎయిర్ లైన్స్‌లో ఎయిర్ హొస్టెస్‌గా చేరారు. అందాల భరిణలకుకదా ఆ ఉద్యోగాలు! బెంగుళూరునుంచి మద్రాసు వస్తున్న విమానంలో ఆమె ప్రయాణీకుల వసతి చూస్తుంటే వారిలో ఒకరైన తమిళ నిర్మాత చెళియన్ ఈ "చిన్న" వసుంధరలో పెద్ద వసుంధరా దేవి (ప్రసిద్ధ జెమిని తార, వైజయంతిమాల తల్లి) సలక్షణాలు చూశారు. అది డకోటా విమానం. సినిమా ఆశలకు డకోటా ఒక డోలిక అయింది.

చెళియన్ తనమిత్రుడైన శ్రీధర్‌కు "పిల్ల వసుంధర" గురించి చెప్పారు.

అది అలా వుండగా ఏ. వి. యం. వారు "ఛాయ" హిందీ చిత్రంలో ఒక మంచి భూమికను "బేబీ" వసుంధరకు ప్రతిపాదించారు. ఇంకో విమానయానంలో ప్రసిద్ధ హిందీదర్శకుడు మహేష్‌కౌల్ ("సౌతేలా భాయి", "తలాఖ్" ఫేమ్) పిల్ల వసుంధరను చూచి ముగ్ధుడై స్క్రీన్ టెస్ట్ చేసి "వెల్‌కమ్" బోర్డు చూపారు.

ఇంతలో శ్రీధర్ వైకౌంట్ విమానంలో బొంబాయికి ప్రయాణంచేస్తూ ఎయిర్ హోస్టెస్ వసుంధరనుచూసి చెళియన్ అభిప్రాయాలతో ఏకీభవించి స్క్రీన్, వాయిస్ టెస్ట్‌లు జరిపారు.

తుదకు మద్రాసులో విమానతార వసుంధర మద్రాసు శ్రీధర్‌చిత్రంలో నటించేందుకు నిశ్చయించుకొన్నది. డకోటాతో ప్రారంభమైన కల వైకౌంట్‌తో ముగిసి తనకు వైకుంఠ మనుకొంటున్న సినీలోకంలోకి విసిరివేసింది! వసుంధరాదేవి కాంచనగా పేరుమార్చుకున్నది. 63 జనవరి సంగతి అది.

ముళ్ళపూడి వెంకట రమణ సాహిత్యం సమకూర్చిన "ప్రేమించిచూడు" చిత్రం షూటింగ్ నాగేశ్వరరావు, జగ్గయ్య, కాంచన, రాజశ్రీలతో ఔట్‌డోర్‌లో నవంబర్ మాసాంతం నుంచి జరుగుతుంది. హార్స్‌లీహిల్స్ సుందర ప్రకృతిలో ఈ హాస్యశృంగార ప్రధాన చిత్రానికి ప్రారంభం జరిగింది. రేలంగి, చలం, రమణారెడ్డి కూడా తారాగణంలో కలరు. నవంబరులోనే మూడు పాటల రికార్డింగ్ జరిగింది. ఆత్రేయ, ఆరుద్ర, ముళ్ళపూడి వాటిని రచించారు. సంగీత దర్శకుడు : వేణు. ఛాయాగ్రహణం—పి. ఎల్. రాయ్. దర్శకుడు : పి. పుల్లయ్య, నిర్మాత : వి. వెంకటేశ్వర్లు.

నాగేశ్వరరావు, కాంచన ఒకజంట. జగ్గయ్య, రాజశ్రీ వుంటారు వారి వెంట. రమణారెడ్డి, రేలంగి ఈ జంటల ఐంద్రజాలిక ప్రేమవిద్యలో ఉక్కిరి బిక్కిరి అయిపోతారు. తమిళ వర్షను అనుభవంబట్టి "ప్రేమించి చూడు" చిత్రానికి "టికెట్టు దొరికితే చూడు" అన్నంత రష్ వుండగలదని భావించవచ్చు. చాలాకాలానికి నాగేశ్వరరావు ఓ కొత్తతారతో కాంచనతో కలసి నటిస్తున్నారు.

చలన చిత్ర వార్తలు

ఆడదై పుట్టకు !

హైదరాబాద్ మూవీస్ వారు "అన్నపూర్ణ మందిరం" బెంగాలీనవల ఆధారంగా తెలుగులో నిర్మిస్తున్న సాంఘిక చిత్రానికి "ఆడదై పుట్టకు" అని నామకరణంచెయ్య దలచారనే విశేషవార్త అందింది. జమున, జగ్గయ్య ప్రధాన భూమికలు వహిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు సి. ఎస్. రావు. హైదరాబాద్ మూవీస్ వారి ఈమూడవ చిత్రంలో యింకా గుమ్మడి, రమణారెడ్డి, చలం, రాజబాబు చదలవాడ, చంద్రశేఖర్, హేమలత, సూర్యకాంతం, వాసంతి, గీతాంజలి, లక్ష్మీకాంతమ్మ నటిస్తున్నారు. సంభాషణలు : డి. వి. నరసరాజు, సంగీతం : కోదండపాణి. అసోసియేట్ దర్శకుడు : పి. సాంబశివరావు. నిర్మాత : పి. గంగాధరరావు.



వీనస్ పిక్చర్సు సమర్పించే అశోక్ మూవీస్ "సుమంగళి"లో నాగేశ్వరరావు, సావిత్రి

బెంగుళూరులో "నాదీ ఆడజన్మే" షూటింగ్

శ్రీ వాణీ ఫిలిమ్సువారి "నాదీ ఆడజన్మే"లో నవంబర్ 10 నుంచి 20 వరకు బెంగుళూరు, మైసూర్ లలో జమున, హరనాథ్‌లపై యుగళ గీతాలు చిత్రీకరించారు. గ్లాస్ హౌస్, బృందావన్ గార్డెన్, మొదలైన లొకేషన్‌లలో షూటింగ్ జరిగింది. సావిత్రి నల్ల పిల్లగా నటించిన ఈ చిత్రంలో రంగారావు ఒక విశేష

భూమిక ధరిస్తున్నారు. డిసెంబర్‌లో చిత్రం విడుదల తథ్యం. "నాన్నుం ఒరు పెణ్" అనే తమిళ చిత్రం దీనికి ఆధారం. తమిళంలో నాయిక విజయకుమారి. హిందీలో "మైభి లడ్కీ హుఁ" పేరిట తీసి విడుదల చేశారు. నాయిక మీనాకుమారి. మూడు చిత్రాలలోను ఎస్. వి. రంగారావు నటించారు.

రఫెన్ చూచిన జడ్జీ త్రయంలో ఇద్దరు నాయికాత్రయంలో సావిత్రికి బెస్ట్ మార్కు యిచ్చారు. హిందీ చిత్రంలో నాయికా నాయకులకు లతామంగేష్కర్, పి. బి. శ్రీనివాస్ కంఠదానం చేశారు. శ్రీనివాస్‌కు హిందీ బాబులు ఆఫర్‌లు యివ్వడం ప్రారంభమైందని "జ్యోతి"కి విశేష వార్త.

జకార్తా రంగారావు హిందీ రంగాన్నికూడా జయించారు. మూడు చిత్రాలకూ దర్శకుడు త్రిలోక్ చందర్. తెలుగు చిత్రం నిర్మాత ఎస్. వి. రంగారావు. రామారావు, రమణారెడ్డి, రామలింగయ్య, బాలసరస్వతి, గెస్ట్ జగ్గయ్య, నటిస్తున్న ఈ చిత్రానికి సంభాషణలు నరసరాజు సమకూర్చారు. సంగీతం సుదర్శనం, కళశేఖర్, పాటలు దాశరథి, కెమెరా ముత్తుస్వామి.

ప్రసాద్ స్టూడియోలో! షూటింగ్

ప్రసాద్ ప్రొడక్షన్స్‌వారు కొత్త ఉత్కంఠ ప్రేరేపక వర్ణచిత్రం ఔట్ డోర్ షూటింగ్ నైనిటాల్‌లో ముగించుకొని మద్రాసు తిరిగి వచ్చారు. కొత్త నటుడు కె. నాగేశ్వరరావు, గీతాంజలి ఔట్ డోర్ వర్క్‌లో పాల్గొన్నారు. నాగేశ్వరరావు కృషిపట్ల సర్వత్రా హర్షం కానవచ్చింది. ఉజ్వల భవిష్యత్తు వున్నదంటున్నారు. ఎల్. వి. ప్రసాద్ మద్రాసులో నిర్మించిన సింగిల్ ఫ్లోర్ స్టుడియోలో డిసెంబర్ మొదటి వారం నుంచి షూటింగ్ ప్రారంభమై వారం పది రోజులు సాగుతుందని "జ్యోతి"కి ప్రత్యేక వార్త. దర్శకులు సంజీవ, శ్రీకాంత్. సంభాషణలు ముళ్ళపూడి, కెమేరా కె. ఎస్. ప్రసాద్, పాటలు ఆత్రేయ, నిర్మాత ఎల్. వి. ప్రసాద్.

పి. ఏ. పి. చిత్రం

యద్దనపూడి సులోచనారాణి కథ ఆధారంగా పి. ఏ. పి. వారు డిసెంబర్‌లో హైదరాబాద్‌లో షూటింగ్ జరిపే చిత్రంలో నాగేశ్వరరావు, జగ్గయ్య, సావిత్రి, జయలలిత నటించగలరు. దర్శకుడు: ప్రత్యగాత్మ, నిర్మాత: ఏ. వి. సుబ్బారావు.



శుభోదయావారి "వారసత్వం"లో అంజలీదేవి, రామారావు.

హరిశ్చంద్రలో కాశీవిశ్వేశ్వర సెట్

విజయా ప్రొడక్షన్స్‌వారి "సత్యహరిశ్చంద్ర"లో కాశీ విశ్వేశ్వరాలయం సెట్టుపై షూటింగ్ జరిగింది. గోఖలే వేసిన ఆ సెట్టు భక్తిని ప్రేరేపించేదిగా వుంది. సెట్టులో రామారావు హరిశ్చంద్రుడుగా నటిస్తూవుంటే అచ్చటివారందరు శోకతప్తులైనారు. ఎస్. వరలక్ష్మి, రాజశ్రీ, మీనాకుమారి, ముక్కామల, రాజనాల, రేలంగి, నాగయ్య, రమణారెడ్డి, ప్రభాకరరెడ్డి, జూనియర్ ఏ. వి. సుబ్బారావు మొదలైనవారు తారాగణంలో కలరు. కొత్తమాటలు, కొత్త పాటలు వినిపించే యీ కొత్తచిత్రానికి కవి పింగళి నాగేంద్రరావు. ఛాయాగ్రహణం కమల్ ఘోష్, దర్శకుడు కె. వి. రెడ్డి, నిర్మాతలు—నాగిరెడ్డి, చక్రపాణి.

హైదరాబాద్‌లో భానుమతి

నవంబర్ 12 వ తేదీనుంచి 25 వ తేదీ వరకు హైదరాబాద్‌లో సారథి స్టుడియోస్‌లో జగపతివారి చిత్రం "అంతస్తులు" షూటింగ్ జరిగింది. భానుమతి, నాగేశ్వరరావు, కృష్ణకుమారి పాల్గొన్నారు. హైదరాబాద్ చిత్రం షూటింగ్‌లో భానుమతి పాల్గొనడం ఇదే మొదటిసారి. గుమ్మడి, జగ్గయ్య, రేలంగి, రమణారెడ్డి, జి. వరలక్ష్మి కూడా నటిస్తూన్న ఈ చిత్రానికి దర్శకుడు వి. మధుసూదనరావు. మాటలు: ఆత్రేయ, పాటలు: ఆత్రేయ, ఆరుద్ర, కొసరాజు. సంగీతం: కె. వి. మహదేవన్, కెమేరా: సి. నాగేశ్వరరావు, నిర్మాత: వి. రాజేంద్ర ప్రసాద్.

"లవంగి, రాయలు" సంగీతం కూర్పు

శ్రీరామా పిక్చర్స్ వారి చారిత్రక చిత్రం "లవంగి, పండిత రాయలు"కు నాలుగు సెట్లకు అవసరమైన పాటల రిహార్సిల్స్ జరుగుతున్నవి. సంగీతం: రాజేశ్వరరావు. మల్లాది రామకృష్ణశాస్త్రి, ఆరుద్ర పాటలు రచించారు. సంభాషణలు ఆరుద్ర సమకూర్చారు. తారాగణం కొద్దిరోజులలో ఫైనలైజ్ అవుతుంది. దర్శకుడు, ఛాయాగ్రహణ దర్శకుడు : బోళ్ళ సుబ్బారావు.

శ్రీరామా పిక్చర్స్ వారి "దేశద్రోహులు" తమిళం డబ్బింగ్ జరుగుతున్నది.

"సుమంగళి" షూటింగ్

అశోకా వారి "సుమంగళి"లో మరి కొంత ఔట్‌డోర్‌పనిలో పాల్గొనడానికై నవంబర్ రెండవవారంలో నాగేశ్వరరావు మద్రాసు వచ్చారు. కాని, వర్షాలవల్ల పని పూర్తికాలేదు. ఆయన మాత్రం హుటాహుటిగా గిండీ గాంధీ మండపంవద్ద షూట్ చేశారు. ఈ సంచిక వెలువడేసరికి అజంతా, ఎల్లోరాలలో నాగేశ్వరరావు, సావిత్రిలపై పాట చిత్రీకరణ ముగిసివుంటుంది. ఔట్‌డోర్ పనికి (ఈవరకు తీసినదానికి) వాయిస్ రీ రికార్డింగ్ ప్రకాష్ స్టుడియోస్ (మద్రాసు)లో జరిగింది. డిసెంబర్ మాసాంతానికిగాని, జనవరి ఆరంభంలోకాని విడుదలకాగల ఈ చిత్రంలో యింకా జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, నాగయ్య, శోభన్‌బాబు, పద్మనాభం, జి. వరలక్ష్మి, గిరిజ, వాసంతి, సూర్యకాంతం, జయంతి, పద్మ నటిస్తున్నారు. దర్శకుడు—ఆదుర్తి, కెమేరా—పి. ఎల్. రాయ్, మాటలు—పాటలు—ఆత్రేయ, సంగీతం—కె. వి. మహదేవన్, ఎడిటర్—కృష్ణ, నిర్మాత—టి. గోవిందరాజన్, సంయుక్తనిర్మాత—టి. వి. ఎస్. శాస్త్రి.

● ● ●


శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి నిత్య సేవా క్రమంపై శ్రీ వి. జె. కె. చారి రచించిన రాగమాలికను కొలంబియా వారు రికార్డు చేశారు. జానకి, శ్రీనివాస్‌లు పాడారు. సంగీతం: ఎస్. రాజేశ్వరరావు.



మాధవీ ప్రొడక్షన్స్ వారి "పాండవ వనవాసం"లో సావిత్రి, రామారావు

ఆంధ్రమహావిష్ణువు సంగీతశోభ

శంభూఫిలిమ్స్ వారు దైవాంశసంభూతుడైన ఆంధ్ర ఆదిచక్రవర్తి గాథను "ఆంధ్రమహావిష్ణువు" పేరిట నిర్మించ దలచి అప్పుడే పాటలకు సంగీతం రిహార్సల్స్ జరుపుతున్నారు. చారిత్రక అంశాలను అనేకం పరిశోధించి స్వంత కల్పనలు—హుషారెత్తించేవి— అనేకం చేసి అద్భుత చారిత్రక జానపద పౌరాణిక చిత్రంగా భాసిల్లే విధంగా పేపర్ వర్కును శ్రీ పింగళి నాగేంద్రరావు తయారుచేశారు. ముఖ్యనటుడు రామారావు, సంగీతం: పెండ్యాల, దర్శకుడు : ఏ. కె. శేఖర్. నిర్మాత : దగ్గుపాటి లక్ష్మినారాయణ. జనవరిలో షూటింగ్ ప్రారంభం కావచ్చు.



"సుమంగళి"లో: సావిత్రి, గుమ్మడి.

"రామదాసు"లో వైకుంఠం సెట్ బకాయి

వి. ఎన్. ఫిలిమ్సు వారి 'భక్త రామదాసు' చిత్రం చివరి సీను షూటింగ్ నవంబర్ మధ్యలోనే అయిపోయిందికాని వైకుంఠం సెట్ ఒకటి బకాయి పడింది. మేటి తారలను గెస్ట్సుగా పెట్టి రంగులలో ఈ సెట్ షూట్ చెయ్యాలని దర్శక-నిర్మాత వి. నాగయ్య కలలు కంటున్నారు. వైకుంఠ ఏకాదశినాడు చిత్రం విడుదల చెయ్యాలని ఆశిస్తున్నారు.

చిత్రంలోని చివరిసీను నైజాం నవాబు 'ఏది ఫర్మానా' అని అడిగి తీసుకుని భద్రాచల రామాలయంపై యావదధికారం రామదాసుకు అప్ప జెప్పినట్లు ప్రకటించడం. ప్రకాశ్ స్టుడియోలో షూటింగ్ జరిగింది. నవాబు పసల సూర్యచంద్రరావుగారు. భద్రాచలంలో తీసిన సన్నివేశాలు చాలాబాగా వచ్చినవి.

మద్రాసులో హాలీవుడ్ తార

సావిత్రి ఓ పరదేశం ఫిలిం పడతిని 'భొట్టూకాటుకా' పెట్టి పిలిచి, కంజీవరం పట్టుచీర పెట్టితే ఆమె చీరలపై చిత్రమైన అభిప్రాయాలు తెలిపింది.

కూచిపూడి నాట్యకర్త్రి యామినీ కృష్ణమూర్తి రాధా నృత్యం చేస్తే మన పౌరాణిక కాల స్త్రీల ప్రేమ వ్యవహారాలపై గమ్మత్తు వ్యాఖ్యచేసి జపాన్, చైనా, థాయ్‌లెండ్ నృత్య రీతుల గురించి ఏమేమో మాట్లాడారు.

చెట్టు కింద పాటలట. ముక్కు పుడుక ముప్పు అట. తడవకు ఒక్క చిత్రంలో నటించే సరికే తలప్రాణం తోకకు వస్తుంటే రెండుమూడు డజన్ల చిత్రాలలో వీళ్ళు నటించడం ఆశ్చర్యమేనట. రాజకపూర్ లో ఇంత వరకు ఎవ్వరూ చూడని ఇంకో తారను చూసిందట. దేవ్ ఆనంద్‌ను నిలదీసి మీ వయస్సు నిజంగా ఎంత అని అడిగారు. "సంగం"లో అందరికీ నచ్చింది ఒకటయితే తనకు నచ్చింది ఇంకొకటి అన్నారు. సంధ్య కుమార్తె పి. ఏ. పి. కొత్త చిత్రం వర్థమానతార జయలలిత నృత్యం చూసి శ్రేష్ఠమన్నారు—మద్రాసు బొంబాయి సినీ ప్రపంచాలను నవంబర్ మొదటి వారంలో నవోత్సాహంలో ముంచెత్తిన ఆ ప్రపంచతార.

వర్జినియాలో పొగాకు మాత్రమే కాదు ఇంకొకటి కూడా శ్రేష్ఠమని ఆ 30 సంవత్సరాల తార నిరూపించారు.

ఎవరామె.? వర్జినియాలో పుట్టి, తన వయసులో మూడవ వంతు— పది సంవత్సరాలు— హాలీవుడ్ లో తారగా ప్రసిద్ధి చెందిన ఆ వారి



షర్లీ మెక్లేన్

ఎవరు? అమెరికా అమ్మాయి అయినా భారత రాకుమారిగా వేషం వేసింది. ("80 రోజుల భూ ప్రదక్షిణం"లో); పాశ్చాత్య వనిత అయినా జపాన్ చైనా వాళ్ళ కళ్ళు కలిగి ఫోటోజెనిక్ సూత్రాలనే ధిక్కరించారు. "మైగీషా" చిత్రంలో జపాన్ పిల్ల వేషం వేశారు. అవార్డు చిత్రం "ది అపార్ట్‌మెంట్"లో ఎలక్ట్రిక్ లిఫ్ట్ లలితాంగి. తను ప్రేమించిన మామూలు ఉద్యోగికి తనను ప్రేమించిన పెద్ద అధికారికి మధ్య మనస్సంఘర్షణలో నలిగిన భూమికను బాగా ధరించిన ఆ భామ షర్లీ మెక్లేన్, మద్రాసు తారలకు ఓ మాంచి ఆశ కలిగించి వెళ్ళారు. అమెరికాపై నాగేశ్వరరావు అభిప్రాయాలు విన్నారు. ఇండియాపై అమెరికా తార విచిత్ర వైఖరి చూడండి!

నవంబరారంభ వారం మెక్లేన్‌కు అంకితమై పోయింది. బొంబాయి, మద్రాసులు దర్శించిన ఆ "స్టేట్స్ స్టార్" మనవ్యవహారాలు చూసి మనకు శుద్ధ పల్లెటూరు వ్యవహారంగా కనిపించే వినిపించే ప్రశ్నలు వేశారు, వ్యాఖ్యలు చేశారు. అభిప్రాయాలు తెల్పారు. ఫిలిం "కళా" కారులతోనే కాక ఫిలిం "కలం" కారులతోకూడా పిచ్చాపాటీ చేశారు. విందు వినోద విహారాలలో పసందుగా జరిగిన ఆ పిచ్చాపాటీని ఈ అణుయుగంలో అణుమాత్రంగా దిగువ క్రోడీకరిస్తున్నాము :—

చీర సింగారించి, పూలు పడిచి, నగలు ధరించి, కుంకుమ తీర్చిదిద్దించి మద్రాసు ఫిలిం వేడుకలకు అమెరికా మెక్లేన్ అరుదెంచారు. బొంబాయిలో వుండగానే బియ్యం వంటు రుచిచూసి భేషుగ్గా వున్నదన్నారు. మద్రాసువచ్చి వక్కతమలపాకు వేసుకొని హుషారు తెచ్చుకొన్నారు. ఆవకాయదాకా పోలేదు. జాగ్రత్త పడ్డారు.

సావిత్రి ఇచ్చిన విందుకు జమున, అంజలి ఇంకా అనేకమంది వచ్చారు. మంగళవాద్యాలతో పన్నీటిజల్లులతో షర్లీని ఆహ్వానించి, కంజీవరం పట్టు చీర ఆ "ముత్తైదువు"కు పెట్టి సాగనంపారు సావిత్రి.

"చీరఇచ్చారు. చల్లగా వర్ధిల్లండి" అన్నది షర్లీ.

చీరలపై ఆమె అభిప్రాయాలు— చీరలేసుకుంటే అచ్చం ఆడదివలె కన్పిస్తారు. ఠీవి వుంటుంది. అందమూ అందల మెక్కుతుంది.

టోకియో ఒలింపిక్స్ చూసి ఓ సంవత్సరంపాటు ప్రపంచ విలాస యాత్ర జరుపుతూ భారతదేశంవచ్చిన షర్లీ మద్రాసులో చాలా చీరలు కొన్నారు.

ఓ అమ్మాయి ముక్కుపుడక చూసి "గుచ్చుకోదూ?" అని అడిగారు. తీసి యిస్తుంటే తన ముక్కుకే నొప్పి పుట్టినట్లు "ఫీల్" అయ్యారు.

విజయ గార్డెన్స్‌లో విందు జరిగింది. నాగిరెడ్డి, చక్రపాణి, బి. ఎన్. రెడ్డి, పి పుల్లయ్య, ఏ. భీమ్‌సింగ్, శ్రీధర్ మొదలైనవారితో "లావ్‌డెస్ట్ విస్పర్" (బిగ్గరరహస్యం) తార మెల్లగా చల్లగా మాట్లాడి, ఛలోక్తుల జల్లులు కురిపించారు. ఆహూతులను ఆనందపరచారు—వారి అభిప్రాయాలు తెలుసుకొని, వారికి తన అభిప్రాయాలు తెలిపి.

ప్ర : మీరు ఏ చిత్రంలో ఉత్తమంగా నటించారు?

జ : అన్నిట్లోను. ఐతే "ది లావ్‌డెస్ట్ విస్పర్" (బిల్లీ వైల్డర్ నిర్మిత చిత్రం) లో నటన తార శక్తికి పరీక్షవంటిది. ఆ పరీక్షకు మీరే మార్కు లివ్వండి.

ప్ర : ఎన్ని చిత్రాలలో నటిస్తున్నారు?

జ : బహువచనం బహు నిషిద్ధం. తడవకు ఒక్కచిత్రం. ఒక్క భూమిక ధరించడమే భారంగావుంది. భారత తారలు 20, 30 సినిమాలలో నటిస్తూ వుంటారని విన్నాను. వీరికి మానవ శక్తికాక దేవతాశక్తి ఏమైనా వుందేమో!

ప్ర : ఇక్కడ యింకేమి చూడాలని వుంది?

జ : ఒక గొప్పమ్యాజిక్ చూడాలని వుంది. భారతదేశం మ్యాజిక్ (ఇంద్రజాలిక) ప్రదర్శనలకు ప్రసిద్ధి. (రమణారెడ్డి రెడీగా లేరు. బొంబాయిలోనూ యీమె ఇటువంటి వాంఛ తెల్పింది. తుదకు కలకత్తాలో పి. సి. సర్కార్ ప్రదర్శనకు యేర్పాట్లు ప్రారంభమైనట్లు తెలిసింది.)

ప్ర : భారత్‌లో చిత్రాలపై మీ అభిప్రాయం?

జ : మేము చెట్టుకింద పాటలు పాడం! ప్రేమలో ఒక్క అంశంమాత్రం మేము ఫిజికల్‌గా చూపుతాము. కాని, మీ భారత్ చిత్రాలలో ప్రేమను సర్వసమగ్రంగా చిత్రీకరిస్తారు. జీవితాన్ని అలానే లోతులకుపోయి తరచి చూస్తారు. ఒక విధంగా మా అమెరికా చిత్రాలకంటె మీ భారతీయ చిత్రాలు సర్వసమగ్రమైనవి; సంపూర్ణమైనవి.

ప్ర : ఏయే సినిమాలుచూశారు—ఎలా వున్నాయి?

జ : బొంబాయిలో "సంగం" చూశాను. పారిస్ దుకాణాలవద్ద ఆ కొత్తజంట పాటలు నవ సహజీవితమంటే ఏమిటో నగ్నంగా చూపినవి. అంచేతనే అన్నాను—మీ చిత్రాలు సర్వ సమగ్ర సంపూర్ణమైనవని. "గైడ్" చూశాను. బాగుంది. దేవ్‌ఆనంద్ 42 సంవత్సరాలవారని విన్నాను. స్వయంగా ఆయన్ను చూసి "పద్దెనిదేళ్ళ పాపాయిలా వున్నారే" అని అనేశాను.

ప్ర : మిమ్మల్ని, మీ నటనను విలేఖరులు ఖండించినప్పుడు యెలా "నటిస్తారు"?

జ : విమర్శలతో ఏకీభవించకపోతే నవ్వేసి ఊరుకొంటాను! పోయి ఇంకోసారి సినిమా చూసి రండి అని అనాలని అనిపిస్తుంది. కాని ఆమాట అనకుండా కళ్ళతో, వదనంతో ఆభావం [illegible] నటింప జేస్తాను.

విజయోద్యానంలో [illegible] వర్ధమాన తార [illegible] నాట్యం చేసింది.

షర్లీ, తన భర్త, [illegible]

పార్కర్ భారత వాతావరణంతో టెలివిజన్, ఫీచర్ చిత్రాలు నిర్మించబోతున్నాగని, ప్రతిభావంతులైన దక్షిణభారత కళా కారులకు అవకాశం వుండ గలదని తెలియజేశారు. షర్లీ వాహినీ, విజయా స్టుడియోస్ సందర్శించారు.

"కలసి వుంటే కలదు సుఖం" హిందీ వర్షను "ఖాందాన్"లో నటించేందుకై మద్రాసు వచ్చిన సునీల్ దత్, నూతన్, మనోరమ, ఓమ్ ప్రకాష్, హిందీ "సుమంగళి" తార మాలా సిన్హా మెక్లెన్‌ను కలుసు కొన్నారు

చాలాకాలంగా పాశ్చాత్య నృత్య రీతులను అభ్యసిస్తున్న షర్లీ బొంబాయిలో వైజయంతిమాల, గోపీకృష్ణ నృత్యాలుచూచి మద్రాసులో యామినీ కృష్ణమూర్తి కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలను తిలకించారు. యామిని నృత్యంలో ఎంతో సొగసు ఉన్నదన్నారు. ముఖ్యంగా పాదవిన్యాసం (ఫుట్ వర్క్) విశిష్టమన్నారు. కృష్ణ (మూర్తి) రాధ వేషంలో కృష్ణునికై రాధ బాధలను నృత్య రూపంలో చూపగా మెక్లెన్ ముగ్ధురాలైనారుకాని, ఓ సందేహం వెలిబుచ్చారు.

మీ భారతీయ నృత్యాలలో స్త్రీ, పురుషునికోసం వెంపరలాడినట్లు చూపుతారు. ప్రేమికుని ప్రణయ బాధలు ప్రముఖంగా చూపరేం?

భారత్ ప్రేమ ఆరాధనా తత్వ విశిష్టతను మెక్లెన్‌కి వివరించారు

ప్ర : భారత నృత్య సంప్రదాయాలపై మీ అభిప్రాయం?

జ : చైనా, జపాన్, సయాం నృత్యాలు చూచాను. వాటిలో ప్రేమ ప్రకటనలో బిడియం మరింతగా వున్నది. కాని భావాభినయంలో భారత్‌కు సాటి మరొకటి లేదు.

ప్ర : మరి సంగీత వాద్యాల సంగతి?

జ : బొంబాయిలో తబలా, మద్రాసులో మృదంగం నన్ను సంగీత ముగ్ధను చేసినవి. శంకర్–జైకిషన్‌ల సంగీతం నాకు కర్ణమధురం. శంకర్‌చే కొన్ని సంగీత వాద్యాల వివరాలు తెలుసుకొన్నాను.

మెక్లెన్ కొత్త చిత్రాలలో ఒకటి "కాన్ కాన్". బాక్స్ ఆఫీస్ చరిత్ర సృష్టించిన ఈ చిత్రం దక్షిణభారత ముఖ్య నగరాలలో విడుదల కాబోతున్నది.

షర్లీ బొంబాయి గడపదాటి వెడుతూ రాజ్‌కపూర్ గురించి ఓ గొప్ప వ్యాఖ్య చేసింది. "సంగం"లో మీరు క్లార్క్ గేబుల్‌లా ఉన్నారు" అన్నది—లోతులు తరచిచూచే లోతు కళ్ళ హాలీవుడ్ లలితాంగి. □□□

పత్రాభి పసబాంగము

డిసెంబరు

1. ప్రియురాలి రసిక ప్రియునితో ఏమన్నది?—
   "చనువిచ్చెద" నని—

2. ప్రియురాలి కోక ప్రియునితో ఏమన్నది?—

   "నా మర్మాలన్నీ నీవే" అని—

3. భారతీయులకు టోపీ వేసినాడు గాంధిమహాత్ముడు.

4. ప్రపంచములో పడుచూ లేచుట స్వభావం ప్రతి జీవికి—

   కానీ, కొందరు పయికిరావడానికి పడుచులే కారణం.

5. రామాయణంలో వున్నదంతా మాయ.

6. బాల, ప్రౌఢ, వారాంగన కానీ అంటారు.
   ఇంతకూ, [illegible]
   కాని [illegible]

7. మదించిన రామ రమ్మంటుంది.

8. సామ్యవాదులదిఅధనప్రసంగము.

9. కమ్మగ ద్బుకన్నాగూడ గాద్బుకమ్మ నాకు సంతోషం కూరుస్తుంది.

10. ముస్లింలీగువల్లనే మన దేశం జిన్నా భిన్నం చేయబడింది.

11. మంగళూరు సుమంగళ్యూరు.

12. ఇంగ్లండులోన తధాప్రజా యధారాజా.

13. కాసులరాబడితప్ప మరేమీ తలంచనివారు, నిజంగా రాకాసులు.

14. జనతా గణితాలలో కూడు కూడు కూడు అని [illegible]

15. [illegible]

16. జవహర్ లాల్ బహుదూరుకు జై.

17. ప్రజానీకంతో ప్రొహిబిషన్
శాఖ తాగుడుమూత
లాడుతుంది.

18. పేరులో వట్టి అయినా
వేరులందు మేటి వట్టివేరు.

19. అది ఆదిమో ఆదాము కోరిక—
అవ్వాకావాలి బువ్వాకావాలి.

20. ఏం ఆశ్చర్యం !
ఏ ఐ సీ సీ నిజంగా ఏ ఐ ఛీ ఛీ !

21. రోజాలకన్నా అందం ఉరోజాలు.

22. ఆసవల్ల ప్రయాస.

23. చతురంగబలాలలో ఒక అంగమగు,
పావుబంట్లుకు, కాల్బలంబని
వేరు పేరు.

24. దాక్షిణాత్యులకు చాలా
రస పిపాస.

25. నేటి చిత్ర కళను పీచిత్ర కళ
అనాలి.

26. మూర్ఖుని తల చిల్లికుండల్లు బోలు.

27. పెళ్ళిముమ్ముళ్ళు కాన
బ్రహ్మచారిదే పూలబాట.

28. జన్మ పుట్టుడు దుఃఖం.

29. ఋషికి పరమాత్మతో తప్ప
పరులతో పనిలేదు.
వారిది స్వయం ఋషి.

30. ఏరిండియాలో పోవు
ప్రయాణీకులకు టాటా చెప్పు.

31. చైనాది ఆటంశక్తి
మనది రాటంశక్తి.

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications
and Printed by him at Thrinadh Art Printers
Buckinghampet post, Vijayawada-2.

JYOTI DEC '64 Regd. No. A368

